12 జులై 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లై, 99594 88088

## కథాక్రమం


| | | | |
|---|---|---|---|
| సాక్షి ఫన్‌డే | ఏమంటావు | బద్రి నర్సన్ | 94401 28169 |
| నవతెలంగాణ సోపతి | ఆన్లైన్ సాలీడు | డా.జడా సుబ్బారావు | 98490 31587 |
| సూర్య | ఒంటుండబండి | డాక్టర్ సారిపల్లి నాగరాజు | 80083 70326 |
| తెలుగుప్రభ | పిడికెడు స్వప్నాలు ఒక మరణశిక్ష | చందు తులసి | 99855 83022 |
| ప్రజాశక్తి స్నేహ | మరోరోజు మొదలైంది | మణి వడ్లమాని | 96520 67891 |
| ఆంధ్రజ్యోతి ఆదివారం | హంసల వెండికంచం | సుజాత వేల్పూరి | 97043 86363 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | సృష్టిలో తీయనిది | సింగీతం ఘటికాచలరావు | 95004 31474 |
| వార్త | శివపార్వతుల కలియుగయాత్ర | అయినాపురం వెంకటజగన్నాథరావు | |
| విశాలాంధ్ర | బడబాగ్ని రాజు | శశి | 95538 09850 |
| వార్త | కొబ్బరినీళ్లు | ఓట్ర ప్రకాష్ రావు | 97874 46026 |
| వార్త | సహాయం | సిహెచ్.ప్రతాప్ | 98660 71785 |
| సాక్షి ఫన్‌డే | భయం అంచులో.. | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| 28.6.26 కథానిధి సమీక్ష | సామాజిక రుగ్మతలపై అక్షరాల తిరుగుబాటు | భూక్యా గోపి నాయక్ | 99891 59196 |


మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు **https://kathavasudha.com** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (12 జులై 2026) కథల సంకలనం 42 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 12 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.

‘5 జులై 2026 కథానిధి’ కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం

ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**యూట్యూబ్ లో వినడం కోసం..**

**5 జులై 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

99594 88088

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈవారం కథ



● బద్రి నర్సన్

# ఏమంటూవు?


''వినీతా! ఓ నాలుగుసార్లు ఇంటికి రాగానే మనిషి ఎలాంటోడో తెల్సిపోదు...'' అంటూ కూతురుకు ఇంకేదో చెప్పబోయాడు.

తండ్రి మాటలకు అడ్డు పడుతూ వినీత, ''డాడీ! ప్రాక్టికల్‌గా ఆలోచించు. అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు చూసే కాలం కాదిది. సుదీప్ నాకు ఇంజనీరింగ్ నుంచి తెలుసు. హాలిడేస్‌లో తప్ప మేము కలవని రోజులు తక్కువే. చివరి సెమిస్టర్‌లోనే మాది స్నేహం కాదు, ప్రేమ అని గ్రహించాం. చదువయ్యాక ఇద్దరం ఒకే కంపెనీలో ప్లేస్ కావాలనుకున్నాం. ఒకరి ఇష్టాలు ఒకరికి తెలుసు. సుదీప్ నా కన్నా ఓపికవంతుడు కూడా. ఒక ఇంటివారమవడం తప్ప ఏ విషయంలోనూ మేం తక్కువ లేము. ఇంత పాజిటివ్‌నెస్‌ని వదిలి తెలియని ముఖాన్ని పెళ్లి చేసుకుని బతికే అవసరం నాకేముంది!'' అంది.

తండ్రీ కూతుళ్ల సంవాదం వినేందుకు భానుమతి పిల్లిలా హాల్లోకి వచ్చింది.

భర్తను కూతురు నిలదీయడం చూస్తుంటే ఆమెకు లోలోపల ఎందుకో కొత్త కొత్తగా, ఆత్మతృప్తిగా ఉంది. మరి ఆయనకెలా ఉందో! గయ్యిమని లేస్తే ఎలా అనుకుంటూ కూతురు వైపు 'నాన్నతో ఇంత వాదన పెట్టుకుంటావా' అన్నట్లు కళ్ళు పెద్దవి చేసి చూసింది.

నేలకేసి చూస్తూ ఆలోచనలో ఉన్నాడు సుగుణారావు. 'ఎదిగిన కూతురు మాట వినాలా, నేను చూసిన వాణ్ణే పెళ్లి చేసుకోవాలి అని ఆంక్షలు పెట్టాలా' అనే సందిగ్ధం ఆయన్ని పరీక్షిస్తోంది.



సుగుణరావుకు జాతి పట్టింపులు ఎక్కువ. రూపురేఖలతో, పేర్లతో, మాటలతో ఎవరే ఇంట్లో పుట్టారో చెప్పగలడు. ఇదే అదునుగా తల్లి సమక్షంలోనే దాని క్లారిటీ కూడా ఇచ్చేస్తే ఓ పనైపోతుంది అనుకుంది వినీత.

''అమ్మాయిలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లోకి వచ్చాక క్యాస్ట్ ఫీలింగ్ చాలా తగ్గింది డాడీ! మా క్లాస్‌మేట్స్, బ్యాచ్‌మేట్స్ ఎందరో కాలేజీలో ప్రేమించుకొని, జాబ్స్ వచ్చాక పెళ్లి చేసుకున్నారు. హాయిగా ఉంటున్నారు. ఇప్పటికి వాళ్ళు ఫ్రెండ్సా, మ్యారీడ్ కపుల్సా అన్నట్లు ఉంటారు. లక్కీ ఫెలోస్ కదా!'' అంది భుజాలు ఎగరేస్తూ.

వినీత మాటల ఘాటుకు మారిన సుగుణారావు బాడీ లాంగ్వేజీని గమనించినా, భానుమతికి ఎందుకో లేవాలనిపించలేదు. కూతురు ముచ్చట్లు ఆమెకు చాలా ముచ్చటగా ఉన్నాయి. వినీత ఇలాగే ఇంకా మాట్లాడితే బాగుండు అనుకుంది. కూతురు వాదన బేషుగ్గా ఉన్నా, నోరిప్పి ఓ మాట చెప్పే సాహసం మాత్రం తనకు చేతనవడం లేదు. ఉండబట్టలేక 'మీ నాయన పోజు చూశావా' అన్నట్లు కూతుర్ని చూస్తూ కళ్లతో సైగ చేసింది. భర్త అంటే భయం, బిడ్డ అంటే ప్రేమ– ఆమెకు రెండూ అపారమే! తండ్రీ కూతుళ్ల వాదన గాలివానలా కావద్దని ఉందామెకు. ఇద్దరి మధ్యన ఖాళీ త్రాసును సమానంగా పట్టుకొన్న న్యాయదేవతలా ఉంది తన పరిస్థితి.

తండ్రి తల పైకెత్తకపోవడంతో వినీత ముక్తాయింపుగా ''ఏదేదో ఆలోచించి బుర్ర పాడు చేసుకోకండి డాడీ! కాలం మారుతోంది. మనమూ మారాలి అంతే. లేకుంటే పాచిపోతాం!'' అంది.

కిచెన్‌లోకి వెళ్లకుండా, ఇంకేమంటుందా అన్నట్లు కూతురు ముఖంలోకి ఆశగా చూస్తున్న భానుమతిని గమనించిన సుగుణారావుకు ఒళ్ళు మరింత మండింది.

అసహనంతో మీ ఇద్దరికీ ఇదే నా సమాధానం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అన్నట్లు హాల్లోంచి లేచి ముందు గదిలోకి వెళ్ళాడు. ముఖంలో వెనుకడుగు ఛాయలు కనబడకుండా చదివిన పేపర్‌నే తీసి ముఖానికి అడ్డంగా పెట్టుకున్నాడు. భర్త తప్పుకోవడం చూసి భానుమతి వంటగది వైపు నడిచింది. ఎదిగిన ఆడపిల్ల మాటలే తల్లులకు కొండంత బలం అన్నట్లుగా ఉంది ఆమె నడక తీరు. అదే రూపం సుగుణారావుకు మరోలా కనబడింది. తల్లీ కూతుళ్ళు ఒకరిపై ఒకరు నిలబడి తన కన్నా పొడుగైనట్లు తలెత్తి చూశాడు ఆమె వైపు.

తండ్రితో 'ఊ' అనిపించడమెలాగో అర్థం కాక సోఫాలో అలాగే జారగిలబడి మొబైల్ ఫోన్ చేతిలోకి తీసుకుంది వినీత. కొద్దిసేపు వాట్సాప్ మెసేజ్‌లు చూశాక ఒక్కసారిగా ''మమ్మీ! నూన్ షోకి టికెట్స్ బుక్ అయ్యాయంట. లంచ్ చేసి నేను బయటికెళ్లాను'' అంటూ మెట్లెక్కి పైనున్న బెడ్ రూంలోకి వెళ్ళింది.

ఊర్లో వ్యవసాయం, రైస్ మిల్ నడిపిన సుగుణరావు రెండుసార్లు గ్రామ సర్పంచ్‌గా కూడా చేశాడు. మారిన రాజకీయ పరిస్థితులు, యువనేతల జోరుకు తట్టుకోలేక పదవులకు దూరం జరిగాడు. అమెరికాకు వెళ్లిన కొడుకు ఎం.ఎస్. చేసి, అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. కూతురుని చదివించి, మంచి ఇంటికి ఇచ్చి హాయిగా కాలం గడపాలని అనుకున్నాడు. అసలు ఊరు దాటాలనే ఆలోచనే ఆయనకు లేకుండేది. ఇంజినీరింగ్ చదువులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, అమెరికా వలసలు కలగలిపి ఆయన్ని నగరానికి సుడిగాలిలా నెట్టుకొచ్చాయి. ఊరికి రాకపోకలు సాగక భూమిని కౌలుకి, మిల్లును లీజుకు ఇచ్చి పిల్లలు చెప్పినట్లు రింగు రోడ్ పక్కన ఓ విల్లా కొనేసి బతుకును అందులో దించేశాడు. కాలం గడుస్తుంటే ఊరును తాను పట్టించుకోవడం మానేశాడా, లేక అక్కడి వాళ్లే తనను లెక్కలోంచి తీసేశారా అనే అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. నిజానికి ఊరే మారింది. తనలా అంతో ఇంతో స్తోమత ఉన్నవారు పిల్లల వెంట వచ్చి హైదరాబాద్ చుట్టూ వాలిపోయారు. ఈ కాలం పిల్లలు జీవిత నిర్ణయాల్లో తల్లిదండ్రుల్ని వెనక్కి నెట్టేస్తున్నారని పొద్దునే బంధువు హనుమంతరావు నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో అర్థమై చికాకును మరింత పెంచింది.

ఊర్లో ఉన్న రోజుల్లో సుగుణరావు తన కూతుర్ని హనుమంతరావు కొడుక్కి ఇవ్వాలని అనుకునేవాడు. పిల్లాడు ఎక్కడ జారిపోతాడోనని ముందు జాగ్రత్తగా వారి కుటుంబానికి స్పెషల్ గౌరవమర్యాదలు ఇచ్చేవాడు. పక్కన పట్టణంలో మెడికల్ షాప్ ఉన్న హనుమంతరావు– ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ కూడా మొదలుపెట్టి నాలుగు లారీలు కొన్నాడు. చదువు వంటబట్టని ఆయన కొడుకు వ్యాపారం చూసుకుంటూ, ఎవరు భూమి అమ్మినా కొని ఆస్తులు పెంచుతున్నాడు. ఎప్పుడు ఊరికి వచ్చినా, పెద్ద



అ లా గా!

టిబెటన్ల అధినాయకుడు, బౌద్ధగురువు దలైలామాకు వాచీలంటే విపరీతమైన మక్కువ. అంతేకాదు, వాచీల మరమ్మతులోనూ ఆయనకు నైపుణ్యం ఉంది. అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ఒకసారి దలైలామాకు పాకెట్ వాచీని బహూకరించారు. అప్పటి నుంచి దలైలామాకు వాచీల పరిశీలన, వాటి మరమ్మతు అలవాటుగా మారింది.

కార్లో అమ్మా నాన్నలను వేసుకొని హంగామా చేసేవాడు. ఆ కారులో ఆయన పక్కన తన కూతురు కూచుంటే చూడాలని సుగుణరావు ఎన్నో కలలు కన్నాడు. తన నిర్ణయం సరైనదని గట్టిగా నమ్మాడు. తలవంచి తన నిర్ణయం వినవలసిన కూతురు ఇప్పుడు తనకే ఏదో తెలియంది నేర్పుతున్నట్లు, మీరీకాలంలో లేరన్నట్లు మాట్లాడుతుంటే జవాబు చెప్పలేకపోతున్నాడు. ఇదే ఊర్లోనయితేనా వినీతని, భానుమతిని కలిపి చెడామడా తిట్టేవాడు. కోపం తగ్గకపోతే అమ్మాయిని పెంచే విధానమిదేనా అని భానుమతిపై లేచేవాడు. అదేదీ సాగేట్లు లేదు. కుబుసం వదిలినట్లు తనలోంచి ఊరు సుగుణరావు వెళ్ళిపోతున్నట్లు ఆయనకే తెలుస్తోంది. మరోవైపు అమ్మాయి వాలకం చూస్తుంటే 'నీవు 'ఊ' అన్నా అనుకున్నా, ఆ పిల్లాడితో ఎగిరిపోతాను' అన్నట్లుంది. సిటీ గాలికి ఇలా నిమిత్తమాత్రుడిని అవుతానని ఆయన కలలో కూడా ఊహించలేదు.

ఇంతలో అమ్మాయి మెట్లు దిగుతున్న చప్పుడు విని, పేపర్‌ను మరింత ముఖం మీదికి జరుపుకున్నాడు. డైనింగ్ టేబుల్ పైనున్నవి పళ్లెంలో వేసుకొని, గబగబా తింటున్న వినీత పక్కనే ఉన్న ఫోను రింగయింది.

''ఇదిగో.. వచ్చేస్తున్నా!'' అంటూ లేచి, చేయి కడుక్కుని ఇద్దరినీ ఉద్దేశించి 'బై బై' చెప్పి బయటపడింది. ఆ లోపే విల్లా ముందు కారు ఆగిన చప్పుడైంది. పేపర్ పక్కకు జరిపి సుగుణరావు కారు వైపు చూశాడు. డ్రైవింగ్ సీట్లో సుదీప్ కనబడ్డాడు. వినీత ఆ వైపు నుంచి వెళ్లి కార్లో అతని పక్కన కూచుంది.

ఒకవైపు వినీత తీసుకుంటున్న స్వేచ్ఛ గుచ్చుకుంటుంటే, మరోవైపు పొద్దునే ఫోన్లో హనుమంతరావు 'మావాడు ఉద్యోగం చేసే అమ్మాయి వద్దంటున్నాడు. జాబ్ మాన్పిస్తావా?' అన్నమాట ఆయన్ని పూర్తి తికమకలో పడేసింది. తన ప్రశ్నకు సుగుణరావు నోట మాట రాకపోవడంతో జవాబు దొరికినట్లు హనుమంతరావు ఫోన్ పెట్టేశాడు. పరాభవంతో 'ఛీ' అనుకున్నాడు.

తాను కట్టుకున్న ఆశాసౌధాలు కూలిపోతుంటే, మరోదారి లేక కూతురి కలల హర్మ్యాల్లోకి వెళ్లే తప్పనిసరి పరిస్థితికి సిగ్గనిపిస్తోంది. తన కన్నా తెలివి గల భార్య అని తెలిసినా కంటిచూపుతో నోరు మూయించినట్లు కూతురిని అదిమి పెట్టేందుకు తన అస్త్రాలు సరిపోవడం లేదు. పైగా కూతురు మాటలు చూస్తుంటే అన్ని నిర్ణయాలూ తీసుకుని, కేవలం ఆమోదముద్ర కోసం వేచి చూస్తున్నట్లు ఉన్నాయి.

భార్య భోజనానికి పిలవగానే మౌనంగా తినేసి పైనున్న బెడ్ రూంలోకి వెళ్ళిపోయాడు. మెట్లెక్కుతున్న భర్త ఎప్పుడూ అంత నెమ్మదిగా కదలలేదు. ఎందుకోగానీ ఆయనలో ఈ కుంగుబాటు భానుమతికి బాధను కలిగించలేదు. నాన్న మాట వినమని కూతురుకు చెప్పాలని అనిపించలేదు. తలెత్తి ఆయన్నే చూస్తున్న ఆమె కళ్ళలో ఒక వెలుగురేఖ, ముఖంలో ఒక గెలుపు ఛాయ వాటంతట అవే వచ్చాయి. వాటిని ఆమె కూడా గమనించినట్లే లేదు.

భర్త తిన్న పళ్లెం ముందుకు జరుపుకొని అన్నం కలుపుతుంటే భానుమతికి తన పెళ్లి రోజులు కళ్ల ముందుకొచ్చాయి. జీవిత భాగస్వామి ఎంపికలో వినీత సొంత నిర్ణయం చూస్తుంటే తన పెళ్లి విషయంలో తాను రాజీ పడక తప్పనిస్థితి గుర్తుకొస్తోంది.

భానుమతి రంగు, ఎత్తు తక్కువుండే సాధారణ స్త్రీ. చదువుకొనే రోజుల్లో ఆమెను ఎవరూ పట్టించుకొనేవారు కాదు. వాటిని అధిగమించేలా పట్టుబట్టి డిగ్రీలో కాలేజీ టాపర్‌గా నిలిచింది. తన ప్రతిభను నిరూపించుకునేలా ఏదైనా ఉద్యోగం సంపాదించాలన్న ఆకాంక్షను ఇంట్లోవారు ముందుకు సాగనీయలేదు. ఎదిగిన పిల్ల పెళ్లే పరమావధిలా ఇంట్లో ఒకటే సంబంధాల వెదుకులాట. పెళ్లి చూపుల ఏర్పాట్లు వరుసగా కొనసాగేవి. ఉద్యోగులెవ్వరూ భానుమతిని ఇష్టపడలేదు. 'ఇక ఈ పిల్లనెవరు చేసుకుంటారు' అని తల్లిదండ్రులు బెంగతో ఓ మెట్టు దిగి దగ్గరి పట్టణాల్లో ఏదో సొంత వ్యాపారం చేసుకుని బతికే కుటుంబాల్లో ప్రయత్నించారు. పట్టణాలు కూడా అందానికే పట్టం కట్టాయి. మరో మెట్టు దిగి గ్రామాల్లో ఉన్న బంధువులతో ఆరా మొదలుపెట్టారు. ఊరు పట్టుకొని ఉండే సుగుణరావుకు నచ్చిన అమ్మాయిలు ఈయన్ని మెచ్చలేదు. వయసు దాటిపోతోందని ఇంట్లోవారు పోరడంతో ఆయన భానుమతి మెడన మూడు ముళ్ళు వేశాడు. అప్పుడు గాని ఆమె తల్లిదండ్రుల గుండెల మీద కుంపటి చల్లారలేదు. జీవితమంటే భానుమతికి ఎన్నో ఆశలుండేవి. భర్త వెంట సినిమాలకు, షికార్లకు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

వెళ్లాలని కోరిక ఉండేది. పత్రికల్లో కథలు, నవలలు చదివిన యువతిగా తనకో ఊహల ప్రపంచముండేది. సుగుణరావుకు మాత్రం దాంపత్యమంటే ఒక ఆడ తోడు, ఆపై పిల్లలు, అంతే! దాన్ని దాటి ఆయనలో మరో ఏ కోణం భానుమతికి కనిపించలేదు. తన జీవితంలోకి వచ్చిన కొత్త మనిషి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి అనే ఆలోచన లేని మనిషిని తమ తిరుపతి యాత్రతో ఆమెకు స్పష్టమైంది. పెళ్లయిన కొత్తలో భానుమతి అడిగిందేమో మైసూరు, ఊటీ... ఆయనేమో పెళ్ళయితే వెంకన్న దర్శనం చేసుకుంటామని తల్లి మొక్కినందుకు మొక్కుబడిగా తిరుపతి తీసుకెళ్ళాడు. ఇక మరో ఆలోచన లేకుండా సుగుణారావు తనపై దయతో మూడు ముళ్ళు వేసిన మహానుభావుడు అని సర్దుకుంది. పిల్లలు కలిగి, వారు పెరుగుతుంటే ఆమె ప్రపంచం మరో రూపు దిద్దుకుంది. కుటుంబం ఎదుగుతుంటే తన ఆశలన్నీ తీరినట్లుగానే తృప్తి పడుతోంది.

వంట గిన్నెలు సర్దినాక  భానుమతి రోజుటిలా బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది. భర్త ఆ వైపు తిరిగి పడుకున్నాడు. పక్కనే నడుం వాల్చిన ఆమె ఆలోచన కూతురు వైపు వెళ్ళింది. తనలా వినీత కూడా అందగత్తె కాదు. తన నోట్లోంచి వచ్చినట్లే కాకుండా తండ్రి నలుపుని కూడా పూసుకొని వచ్చింది. అయితే ఏనాడు తానెలా ఉన్నాను, ఇలా ఎందుకున్నాను అనే భావన కూతురులో లేశమాత్రం కనిపించలేదు. బుద్ధి తెలిశాక తన రూపానికి నప్పే డిజైన్ బట్టలు, హెయిర్ స్టైల్, ఫేషియల్ పట్టింపులతో చలాకీగా అందరిలో కలిసిపోయేది. రకరకాల

> డాడీ! మీ రోజుల్లో ఆడపిల్ల ఇంటి గడప దాటి రాలేదు. పేరెంట్స్ కూడా తిరిగి తిరిగి వరుణ్ణి వెతికే వాళ్ళు. ఇప్పుడు ఆడపిల్లలు చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. లోకాన్ని అర్థం చేసుకుంటున్నారు.

ఆడ మగ ఫ్రెండ్స్‌తో సినిమాలు, షికార్లకు వెళ్ళేది. వినీత ఫ్రెండ్స్‌లోనూ అందం చందం ఎక్కువ తక్కువ ఉన్నవారిని తను చూసింది. సినిమా యాక్టర్లలా మెరిసిపోయేవారు కూడా ఉన్నారు. విచిత్రమేమిటంటే వారిలో ఆ పొగరు, స్పృహ కనబడేది కాదు. తమ ఫ్రెండ్స్‌లో ఫలానా అమ్మాయిని ఫలానా అబ్బాయి ప్రపోజ్ చేశాడని వినీత చెబితే ఆశ్చర్యపోయేది. ఇంత చక్కని పిల్లాడికి ఆ అమ్మాయిలో ఏం నచ్చింది అనిపించేది. ఆ అమ్మాయి కన్నా ఫలానా పిల్ల ఇంకా అందంగా ఉంది కదా మరి ఈ పిల్లను ఎందుకు ఇష్టపడ్డాడో అర్థం కాకపోయేది. అదే ప్రశ్న వినీతను అడిగితే 'నీకేం తెలువదు' అన్నట్లు నొసలు కొట్టుకునేది.

వినీత ఫ్రెండ్స్‌తో పాటు సుదీప్ కూడా అప్పుడప్పుడు ఇంటికొచ్చాడు. సుదీప్ ఎత్తు, చక్కని వర్చస్సు గల అబ్బాయి. కావాలనుకుంటే తనకి వినీత కన్నా అందమైన అమ్మాయి భార్యగా లభిస్తుంది. కాని వినీత అంటే అతనికి ఎంతో ఇష్టం. ఇలా అందాన్ని దాటి తనకు అర్థం కాని శక్తి ఏదో యువతను ఒక్కటి చేస్తోంది అనుకుంది భానుమతి. అది తెలివా... చదువా... సంస్కారమా... ఏదైతేనేం ఆడపిల్ల పెళ్లి అనే తతంగం గుండెలపై కుంపటి కారాదు. ఇలా కొందరికైనా పెళ్లి చూపుల గంగిరెద్దు పాత్ర తప్పుతోంది. నచ్చలేదట అనే కుంపటి రాజేసే మాటల ఊసు లేదు. నూనూగు మీసాల ప్రేమలో అందానిదే పైచేయి. అది ప్రేమ కాదు మోహమే! అయితే, పై చదువులు, ఉద్యోగాల తర్వాత వివేచనతో కూడిన భాగస్వామి ఎంపిక ఓ పరిపక్వ ప్రక్రియ. సుఖ సంతోషాలతో బతకడమే కదా ప్రేమ పరమార్థం. దాన్ని వీళ్లు సాధిస్తున్నారు. అలా సాగుతున్న ఆమె ఆలోచనలు తానేదో గెలిచినట్లు కొత్త సంతృప్తిని ఇస్తున్నాయి.

వారి దాంపత్య చరిత్ర చూస్తే ఒక్కసారి కూడా సుగుణరావు ఏ విషయంలోనూ భానుమతి అభిప్రాయాన్ని తీసుకోలేదు. మంచీ చెడూ చెప్పమనలేదు. అంతా ఆయన నిర్ణయమే సాగింది. పైగా ఆమెకేం తెలుసనే అలుసు. అందుకే ఈ రోజు కూడా తండ్రి కూతుళ్ల మధ్య ఆమె మౌన సాక్షిలా ఉండిపోయింది. కనీసం అమ్మాయి నిర్ణయంపైనైనా తల్లిగా తనను ఒక్కమాటైనా చెప్పనిస్తే బాగుండు అని ఆశ పడుతోంది. నిద్ర లేచిన సుగుణరావు కిందికి వచ్చి ముందు గదిలో కూచున్నాడు. టీ తీసికెళితే తల ఎత్తకుండానే పక్కన టీపాయ్ మీద పెట్టమన్నాడు. ఆయన ముభావం చూస్తుంటే అమ్మాయిని వారించేందుకు మాట సాయం చేయలేదని తనపై కినుక వహించాడా అనే అనుమానం భానుమతికి కలుగుతోంది. అయినా వినీత నిర్ణయానికి తానెలా వ్యతిరేకంగా మాట్లాడగలదు. ఇంతకాలం ఇంట్లో అన్ని నిర్ణయాలకు మౌనమే తన భాష అయినప్పుడు దీనికి కూడా మౌనమే తనకు నచ్చిన జవాబు అనుకుంది.

ఇంటి ముందు కారు ఆగిన చప్పుడయింది. వెంటనే పేపర్ తీసుకుని ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు సుగుణరావు.

లోపలికి వస్తూనే వినీత తండ్రి చేతుల్లోంచి పేపర్ లాక్కుంటూ, ''ఇంకా పేపర్ చదవడం అయిపోలేదా డాడీ!'' అంది నవ్వుతూ.

'లేదు' అన్నట్లు తలాడించాడు ముభావంగా.

తండ్రిని కూల్ చేసేందుకు ఆయన పక్కన కూర్చుంటూ వినీత, సుగుణరావు తలను తనవైపు తిప్పుకొని ''డాడీ! మీ రోజుల్లో ఆడపిల్ల ఇంటి గడప దాటి రాలేదు. పేరెంట్స్ కూడా తిరిగి తిరిగి వరుణ్ణి వెతికే వాళ్ళు. ఇప్పుడు ఆడపిల్లలు చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. లోకాన్ని అర్థం చేసుకుంటున్నారు. మాకు తెలియని రోజుల్లో మా కోసం సంబంధాల్ని వెదికారు. ఇప్పుడు లైఫ్ పార్టనర్‌ను పట్టుకోవడంలో మీకన్నా మేమే ముందున్నాం. కావాలంటే బోలెడు ఉదాహరణలు ఇస్తాను. సుదీప్‌ను కాదనడానికి మీరొక్క బలమైన కారణం చెప్పండి, లేదా సంతోషంగా ఒప్పుకోండి!'' అంది.

కూతురు ఎంత మొండిగా వాదిస్తున్నా, విషయాన్ని ఎంతో ఓపిగ్గా వివరిస్తూ తండ్రిగా తనకు ఇస్తున్న గౌరవాన్ని కాపాడుకొమ్మని సుగుణరావు మనసు గుర్తుచేస్తోంది.

కూతురుతో ఇక వాదించలేక సుగుణారావు తల ఎత్తి భానుమతి వంక చూస్తూ, ''ఏమంటావు?'' అన్నాడు. ఇన్నేళ్ల బండరాయి మంచు గడ్డలా కరగడం ఇదే మొదటిసారి. ఈ ఒక్క ప్రశ్న చాలు, ఇంట్లో తానున్నానని గుర్తించడానికి. బిడ్డ భవిష్యత్తు విషయంలో తన మాటకూ విలువుందనడానికి. భర్త నోట ఆ పదాన్ని వినగానే బిత్తరపోయిన పరవశం నుండి భానుమతి కోలుకొని సరే అన్నట్లు తలాడించింది. భార్య కూడా కూతురు వైపే ఉన్నందుకు ఆయన చూపులో ఒక మెట్టు దిగిన ఓటమి కనిపించినా అది గమనించనట్లే భానుమతి నటించింది. మానై వంగుతున్న భర్తను విరక్కుండా కాపాడుకోవడం ఆమెకు తెలుసు.

## కథాకళి

FEED ME A STORY

**28.6.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'పిలవని అతిథి' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

నాన్ పేయింగ్ గెస్ట్
జె.వి.వి. ప్రసాద రావు

అడగని తోడు
జి. భరద్వాజ్, తెనాలి

అవును, ఆవిడ అంగీకరించింది
లక్ష్మి బుర్రా

అతిథి'సేవో' భవ
కందుకూరి భానుకిరణ్, అనంతపురం

ఒకరికి ఒకరు
కె. మాలిని, హైదరాబాద్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

**కథ**


# ఆన్లైన్ సాలీడు

డా. జడా సుబ్బారావు, 9849031587

ఇంకో పది నిమిషాల్లో ఈ పనిని పూర్తి చేయాలి; అనుకుంటున్నాడే గానీ కుర్చీలోంచి లేవలేకపోతున్నాడు అరవింద్. వెళ్తున్న కొద్ది లోతు తెలియనట్లుగా స్క్రీన్లో మెరుస్తున్న సోషల్ మీడియా అతన్ని కదలనివ్వకుండా చేస్తోంది.

మెసేజులు, రీల్సు, వీడియోలు, గేమ్స్.. ఇలా అన్నీ వరుసగా అతని చూపుల్ని లాక్కుంటూనే ఉంది.

బయటనుంచి వాహనాల రొద వినిపిస్తోంది. బరువుగా ఉన్న కనురెప్పలని మూస్తూ, తెరుస్తూ లాప్టాప్ లోకి నిమగ్నమయ్యాడు అరవింద్. ఒకపక్క కళ్ళ మంటలు, మరోపక్క ఆగకుండా వచ్చే ఆవలింతలు.. చేస్తున్న పనిమీద శ్రద్ధ లేకపోయినా 'తప్పనిసరి తద్దినంలా' లాప్టాప్ తెరమీద దృష్టి సారిస్తూ పక్కనున్న కాఫీ కప్పు అందుకున్నాడు.



అప్పటికే చల్లారిపోయిన కాఫీ నోటికి రుచించలేదు. ఆఫీస్ ఫైల్స్ ఒక్కొక్కటి చూస్తూ మధ్య మధ్యలో ఫేస్బుక్, వాట్సప్, ట్విట్టర్, యూట్యూబ్ ఒకదాని తర్వాత ఒకటి తెరుస్తూ కొన్నిటికి సమాధానాలు ఇస్తూ అతని వేళ్ళు కీబోర్డ్ మీద చక చకా కదలసాగాయి.

'కాఫీ తాగారా.. ఈరోజు కూడా చల్లారిపోయిందా?' అంటూ లోపలికి వచ్చింది ప్రత్యూష.

తాగకుండా పక్కన పెట్టిన కప్పు వంకా, ఆలస్యంగా గుర్తుచేసిన భార్యవంక అయోమయంగా చూస్తూ పైకి కనీ కనిపించనట్లుగా చిన్న చిరునవ్వు నవ్వాడు.

'రోజూ ఇంతే మీరు.. మళ్ళీ వెచ్చబెట్టలేక చచ్చిపోతున్నాను. లోకం మునిగిపోయేంత పనేముంది? కాఫీ తాగి చేసుకోవచ్చుగా' అంది ప్రత్యూష టేబుల్ మీద ఉన్న కప్పు చేతిలోకి తీసుకుంటూ.

'ఏం చేస్తాం? జీవితం నానాటికి ముళ్ళకంచెగా మారిపోయింది. ఉద్యోగం, స్నేహాలు, వార్తలు, మాటలు, ఆశలు అన్నీ ఆన్లైన్లోనే సాగిపోతున్నాయి. ఈ వలయాన్ని వదిలితే ఎక్కడ వెనకబడిపోతామో అని బెంగ! ఊపిరి నన్నొదిలితే తప్ప నేను దీన్ని వదిలేలా లేను' అన్నాడు కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంటూ.

'బతుకంతా ఆన్లైన్లోనే బుగ్గయిపోతోంది. ఇంట్లో మాటల్లేవు, సరదాగా గడిపే పూటల్లేవు. అన్నీ అరచేతి పెట్టెల్లోనూ, అంగుళాల తెరల్లోనూ మరక్కాగిపోతున్నాయి' తనలో తనే గొణుక్కుంటూ కప్పు తీసుకుని బయటికి వెళ్ళింది ప్రత్యూష.

కుర్చీలోంచి పైకి లేచి కిటికీ రెక్క తెరిచాడు. చల్లటి గాలి ఒంటికి తగిలింది. వంద ఏనుగుల గుంపులు ఒకచోట చేరినట్లుగా ఆకాశం మందంగా కదులుతోంది. ఎనిమిది గంటలు దాటుతున్నా మబ్బు తలుపుల చాటు నుంచి బయటికి రాలేక సూర్యుడు నానాయాతన పడుతున్నట్లుగా ఉంది. చెట్టుకొమ్మలు ఒక్కోసారి భారంగా కదులుతున్నాయి, మరోసారి ఘోరంగా ఊగుతున్నాయి.

చూస్తుండగానే టపటపమంటూ చినుకులు పడసాగాయి. ఇంటి ముందు గేటు పక్కగా ఉన్న కారు షెడ్డు మీద వాన చుక్కల చప్పుడు పెద్దగా వినిపిస్తోంది. నడుస్తున్న వాళ్లంతా ఎక్కడ తడిసిపోతామో అన్నట్లుగా పక్కనున్న చెట్ల కిందకి, కిరాణా షాపుల లోపలికి పరిగెడుతున్నారు.

ఒకసారిగా ఇల్లు, ఊరు గుర్తొచ్చాయి. తోటి ఈడు పిల్లలతో కలిసి వర్షంలో చేసిన అల్లరి గుర్తొచ్చింది. వాన పడుతుందన్న స్పృహ ఉండేది కాదు, వానలో తడుస్తామేమో నన్న బెంగ లేదు. ఎగరడం, దూకడం, ఒకరి మీద ఒకరు నీళ్ల చల్లుకోవడం లాంటి పనులతో సంపూర్ణమైన బాల్యాన్ని అనుభవించిన రోజులు గుర్తొచ్చాయి.

'నాన్నా... ఈరోజు స్కూలు ప్రాజెక్టుకి మోడల్ చూపించాలి. రాత్రి అడిగితే ఖాళీ లేదన్నావు. స్కూలుకు టైం అవుతోంది, తొందరగా చేసిస్తావా' అంటూ గదిలోకొచ్చింది పదవ తరగతి చదివే కూతురు మోక్షిత.

వాన మీద నుంచే దృష్టి మరలింది. జ్ఞాపకాల వల చెదిరింది.

కూతురు వైపు చూస్తూ 'ఓహ్.. ఇప్పుడా? ఆన్లైన్లో మీటింగ్ ఉంది. లేటుగా అటెండ్ అయితే బాగోదు. సాయంత్రం తప్పకుండా చేస్తా చిట్టి తల్లీ' అన్నాడు నీరసంగా.

ప్రతీ రోజు 'ఇది చెప్పు, అది చెయ్యి' అంటూ కూతురు తన దగ్గరికి రావడం మామూలే! 'ఇప్పుడు కష్టం మీటింగ్ ఉంది, ఫైల్స్ చూడాలి' అని చెప్పడం కూడా మామూలే! ఏంటో.. సాంకేతికత పెరిగే కొద్దీ సంసారాలు ఇరుకు, గరుకు అయిపోతున్నాయి. కుటుంబ సంబంధాలన్నీ కుంటి నడకన సాగుతున్నాయి. దేన్ని వదలాలో తేల్చుకునేసరికి ప్రతిరోజూ తెల్లారిపోతూనే ఉంది. కథ షరా మామూలే!!

'నిన్నూ నన్నూ పట్టించుకునే తీరిక మీ నాన్నకెక్కడుందే! ఆన్లైనే ఆయనకి ఇల్లూ, వాకిలి! నేనొక పరిచారికని, నువ్వొక పిల్ల దెయ్యానివి. నీ ప్రాజెక్ట్ పని నేను చేసి పెడతాను గానీ ఆయన్నలా వదిలెయ్' అంటూ కాఫీ కప్పు విసురుగా టేబుల్ మీద ఉంచి గదిలో చిందరవందరగా వున్న వస్తువుల్ని సర్దసాగింది ప్రత్యూష.

'వర్క్ ఫ్రం హోం' అంటే ఇంట్లో వాళ్లతో ఎక్కువ సమయం గడుపొచ్చు అనుకునేవాడు. మొదట్లో సరదాగా ఉండేది.

ఎక్కువసేపు ఆన్లైన్లో ఫైల్స్ చూడడం, మెయిల్స్‌కి రిప్లై ఇవ్వడం లాంటి పనులతో పాటు సామాజిక మాధ్యమాలలోను స్నేహితులు పెరిగిపోయారు. మొదట్లో చిన్న వినోదంగా మొదలైన ఆన్లైన్ వ్యాపకం రానురానూ దానికి బానిసను చేసేసింది. పనున్నా, లేకపోయినా ఏదో ఒక వెబ్సైట్లో

ఏదో ఒకటి వెతకడం తీరని దాహంలా మారిపోయింది. ఇంటికంటే ఇంటర్నెట్ బెటర్ అన్నట్లుగా పరిస్థితి తయారైపోయింది. ఎప్పుడైనా ఎక్కువ వాన కురిసినప్పుడో, వేరే కారణాల వల్లనో నెట్ రావడం ఆగిపోతే పిచ్చెక్కినట్లుగా ఉండేది. శ్వాస ఆగిపోయినట్టు అనిపించేది. దానికి తోడు పని ఒత్తిడి తగ్గించుకునే క్రమంలో కొన్ని కొన్ని ఆన్లైన్ గేమ్స్ కి అలవాటు పడ్డాడు అరవింద్. ఎప్పుడూ పది నిమిషాలు ఖాళీ దొరికినా ఇంట్లో వాళ్లతో మాట్లాడటం మానేసి ఏదో ఒక గేమ్ ఆడేవాడు. ఎక్కువ సమయం గేమ్స్ ఆడటం వల్ల కళ్లకు నిద్ర కరువై కళ్ళ కింద నల్లటి వలయాలు ఏర్పడిపోయాయి. మొహం అంతా వాడిపోయినట్లుగా, బరువు తగ్గిపోతున్నట్లుగా తనలో తనకే ఏదో తెలియని వెలితి కనిపించ సాగింది. ఎప్పుడైనా స్క్రీన్ మీద మొహం చూసుకున్నప్పుడు ఆ దిగులు మరింత పెరిగేది. 'నువ్వు ఎప్పుడూ ఇంతే నాన్నా... ఎప్పుడూ బిజీ! ముఖ్యమైన వాటికి కూడా ఇవే కారణాలు చెప్తావు. మా ఫ్రెండ్స్ అందరి నాన్నలు వాళ్లకి ఎంత హెల్ప్ చేస్తారో తెలుసా? మంచి మంచి ప్రాజెక్టులు చేసి తీసుకొస్తారు స్కూల్కి' బుంగమూతి పెట్టుకుని  కూతురు, కోపంగా చూస్తూ భార్యా ఇద్దరూ బయటికి వెళ్లిపోయారు.

కూతురి వంక దిగులుగానూ, భార్యవంక భయంగానూ చూశాడు అరవింద్. చేజారిపోతున్న బంధాలకంటే చేయాల్సిన పనులే కళ్లముందు కదలాడాయి. 'బిజీ' అనే పదాన్ని ప్రతిరోజు 'ఒకే కారణం'గా చెప్పడం అతనికి కూడా ఇబ్బందిగానే ఉంది. బతుకంతా అంతర్జాలం అనే నడి సముద్రంలో మునిగిపోతున్న నావలాగా మొనకలేస్తోది మునకలేస్తోంది. ఆఫీస్ టైమింగ్స్ అయితే ఫలానా టైం నుంచి ఫలానా టైం వరకని ఉండేది. ఎప్పుడైనా అర్జెంటు పని పడితే గంటో, అరగంటో ఆలస్యం అయ్యేది. ఇప్పుడేంటో... వేళకి తిండి లేదు, నిద్ర రాదు. బుర్ర నిండా భూగోళం, దాన్నిండా చేయాల్సిన పనులు, పూర్తి చేయాల్సిన టార్గెట్లు! ఇంటికెన్ని గుమ్మాలున్నాయో ఎప్పుడో మర్చిపోయాడు, ఎక్కి దిగుతున్న మెట్లెన్నో ఎన్నిసార్లు తలుచుకున్నా గుర్తు రాదు.

బయట వాన పెరుగుతున్న దానికి సూచనగా కిటికీలోంచి కొన్ని చినుకులు గదిలో పడసాగాయి. తలుపులు మూయాలన్న ధ్యాస లేదు. వర్షాన్ని కూడా వాల్ పేపర్ మీద చూస్తూ అతని వేళ్ళు మళ్ళీ కీబోర్డ్ మీద పరుగులు తీయసాగాయి.

◆◆◆

అరవింద్... అత్తయ్యగారు లైనులో ఉన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా నువ్వు లిఫ్ట్ చేయట్లేదని నాకు చేశారు'

అంటూ ప్రత్యూష ఫోను చేతిలో పెడుతుంటే ఆదుర్దాగా చూస్తూ తన ఫోన్ స్క్రీన్ ఆన్ చేశాడు. తల్లి నుంచి వచ్చిన కాల్స్ కనిపించాయి. ఒక్క క్షణం సిగ్గుగా అనిపించింది.

'అరూ... నాన్నకి రాత్రి నుంచి వొంట్లో బాగోలేదురా. మైల్డ్ హార్ట్ స్ట్రోక్ వచ్చిందని చెప్పి అబ్జర్వేషన్లో పెట్టారు. నాకు కాలూ చెయ్యీ ఆడట్లేదు. సమయానికి ఎవరూ దగ్గర్లేరు' ఆందోళనగా అవతలి నుంచి అమ్మ గొంతు వినిపించింది.



'తమ్ముడు రాలేదా అమ్మా' అన్నాడు. ఏం అడగాలో, ఏం అడిగాడో అంతా అయోమయంగా ఉంది.

'వాడికేదో అర్జెంటు ఆఫీసు పని ఉందని నిన్న సాయంత్రమే ఊరికెళ్లాడు. వీలయినంత తొందరగా రారా.. నాకేమీ పాలుపోవట్లేదు' అమ్మ గొంతు నుంచి సన్నగా ఏడుపు వినిపిస్తుండగా ఫోన్ కట్ చేసి భార్యవంక చూశాడు. ఆమె మొహంలో కూడా ఆందోళన కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

'ఇంకా ఆలస్యం చేస్తారెందుకు? బయల్దేరండి. నేనీలోపు బట్టలు సర్దుతాను' అంటూ వెనక్కి తిరిగిన ప్రత్యూష 'ప్రత్యూ' అన్న పిలుపుతో ఆగిపోయింది.

'అక్కడికి నువ్వెళ్తే బాగుంటుందేమో' అన్నాడు కిటికీ వైపు చూస్తూ.

అతని వైపు ఆశ్చర్యంగా, ఒకింత కోపంగా చూస్తూ. 'అక్కడికెళ్తే నేను అత్తయ్యకి తోడుగా ఉండి ఓదార్చగలను గానీ, మావయ్యగారికి కావలసినవి చేసిపెట్టలేను. పని ఒత్తిడని చెప్పి ఇలాంటి వాటిని కూడా పక్కకు పెడితే రేపు లోకం మనల్ని పక్కనబెడుతుంది. మాట్లాడకుండా బయల్దేరండి' అంటూ బయటికి నడిచింది.

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయాడు. ఇక వెళ్లక తప్పదన్నట్లుగా పైకి లేచి కావలసిన ల్యాప్టాప్, అవసరమైన కొన్ని ఫైళ్లు బ్యాగులో పెట్టుకున్నాడు. గదిలోనుంచి బయటికి వచ్చి ప్రత్యూషతో చెప్పి బయల్దేరాడు.

◆◆◆

ఒంటినిండా చీర కప్పుకుని ఆస్పత్రి బయటున్న కుర్చీలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న తల్లిని చూడగానే ప్రాణం నీరైపోయింది అరవింద్కి. తన ఎదుగుదలకి నిద్రాహారాలు లేకుండా శ్రమించిన అమ్మ నిస్సహాయంగా కనిపించింది. కొడుకుని చూసి వాటేసుకుని బావురుమని ఏడ్చింది మహాలక్ష్మమ్మ. తల్లిని తీసుకుని ఐసీయూ రూము వరకూ వెళ్లి అద్దంలో నుంచి తండ్రిని చూశాడు. ఆ స్థితిలో తండ్రిని చూసి మనసంతా చేదుగా అయిపోయింది. ఈలోపు జేబులో ఫోన్ మోగింది. మాట్లాడుతూ తల్లినక్కడే వదిలేసి బయటికి వచ్చాడు. ఆఫీసు నుంచి త్వరగా పంపించాల్సిన ఫైల్స్ గురించి అవతలి వ్యక్తితో మాట్లాడసాగాడు. ఈలోపు మహాలక్ష్మమ్మ కొడుకు దగ్గరకు వచ్చి చేతిలోని స్లిప్ చూపించి 'ఈ మందులు తీసుకురమ్మన్నారు' అని చెప్పింది.

ఫోనులో మాట్లాడుతూనే అప్రయత్నంగా జేబులో చేయి పెట్టి డబ్బు పైకి తీసి తల్లి చేతిలో పెట్టి 'అమ్మా.. అర్జెంట్ కాల్. కొంచెం నువ్వే వెళ్లి తీసుకురా' అంటూ సైగ చేశాడు.


మహాలక్ష్మమ్మ అతని వంక అయోమయంగా చూస్తూ బయటికి నడిచింది. ఫోన్ మాట్లాడ్డం పూర్తయ్యాక అక్కడున్న కుర్చీలో కూర్చుని ల్యాప్టాప్ ఓపెన్ చేశాడు. కీ బోర్డ్ మీద అతని వేళ్లు చకచకా కదలసాగాయి. ఏవో మెయిల్స్ కి రిప్లై ఇస్తూ తల్లి మందులు తీసుకుని ఐసీయూ వైపు వెళ్లిన సంగతి కూడా గమనించలేదు అరవింద్. అక్కడున్న నర్సుకు మందులిచ్చి కొడుకుకు దగ్గరగా ఉన్న మరో కుర్చీలో మౌనంగా కూర్చుంది మహాలక్ష్మమ్మ. పనయ్యాక పక్కకు చూసిన అరవింద్కి ఏదో ఆలోచిస్తూ తల్లి కనిపించింది. ల్యాప్టాప్ మూసేసి తల్లి పక్కన కూర్చున్నాడు.

'సారీ అమ్మా... ఏదో అర్జెంట్ వర్క్. మందులు తెచ్చావా' అన్నాడు.

తలూపింది కానీ జవాబు చెప్పలేదు.

కాసేపయ్యాక అరవింద్ని చూస్తూ 'కొడుకంటే కొండంత అండ అనుకున్నా.రా. నిన్నిలా చూస్తుంటే ఏదో తెలియని బాధ కడుపులో ఉండలు చుట్టుకుపోతోంది. చెప్పుల్లో కాళ్లు పెట్టుకున్నట్టుగా వచ్చిన నిన్ను చూసి సంతోషపడాలో, లోకం పట్టనంత పనిలో మునిగిపోతున్న నిన్ను చూసి బాధపడాలో అర్థం కావట్లేదు. దీనికంటే అసలు నువ్వు రాకుండా ఉంటేనే బాగుండేది' అంది.

ఒక్క క్షణం అరవింద్ నవనాడులూ కుంగిపోయాయి. భూమి ఉన్నఫళంగా బద్దలై తనని లోపలి ఈడ్చుకు పోతున్నట్లుగా అనిపించింది. ఇక తను అక్కడ ఉండాలో, ఉండకూడదో తేల్చుకోలేకపోయాడు. ఏమీ మాట్లాడకుండా జేబులో నుంచి మరికొంత డబ్బు తీసి తల్లి చేతిలో పెట్టాడు. మహాలక్ష్మ్మ అతని వైపు అయోమయంగా చూసింది. కాసేపయ్యాక 'ఇప్పుడున్న పరిస్థితుల్లో డబ్బు చాలా అవసరమే కాదనను! కానీ దానికంటే కడుపున పుట్టినవాళ్లు కళ్లముందు ఉండడం ఇంకా అవసరం. ఈ డబ్బు వద్దులేరా... నేనెక్కడైనా సర్దుబాటు చేసుకుంటాను' అని చెప్పి ఐసీయూ వైపు సాగిపోతున్న తల్లిని చూసి దు:ఖం పొంగుకొచ్చింది. భారమైన హృదయంతో అక్కడి నుంచి కదిలాడు అరవింద్.



◆◆◆

గదిలో కూర్చుని పని చేస్తున్నాడన్న మాటేగానీ మనసు మనసులో లేదు అరవింద్‌కి. ఐసీయూ బెడ్ మీద స్పృహ

లేకుండా ఉన్న తండ్రి, గండం నుంచి గట్టెక్కించమని అటూ ఇటూ తిరుగుతున్న తల్లి గుర్తొచ్చారు. కన్న తల్లిదండ్రుల్ని కీకారణ్యంలో వదిలేసి వచ్చాడు, కనీసం తమ్ముడు వచ్చేవరకైనా ఆగలేకపోయాడు. తల్లేదో కోపంలోనో, బాధలోనో ఒక మాటంటే దాన్ని పట్టుకుని తిరిగి రావడం సమంజసం అనిపించలేదు. తల్చుకుంటుంటే అరవింద్ గుండె బద్దలైపోతోంది. ల్యాప్టాప్ స్క్రీన్ మీద చూశాడు. ఫేస్బుక్ కంటే ప్రేమానుబంధాలు బలీయమైనవనిపించింది. వాట్సప్ స్టేటస్‌ల కంటే వాటేసుకుని గుండెలకు హత్తుకున్న కన్నప్రేమ గొప్పదనిపించింది. ట్విట్టర్ సందేశాల కంటే మనిషిగా గుప్పెడు మానవత్వాన్ని గుండెల్లో నింపుకోవడం మేలనిపించింది. ప్రయాణం ఎక్కడ మొదలైందో... ఎలా కొనసాగుతోందో... ఎక్కడ ముస్తుందో! బలమైన మమతల ముడులు విడిపోతున్నాక, అనుబంధాల వాకిళ్ల కనుమరుగవుతున్నాకా... మనిషి ఏం పోగేసుకుంటాడు? ఆహారం కోసం తాను అల్లుకున్న గూడులో తానే చిక్కుకుపోయిన సాలీడులా మారిపోయింది పరిస్థితి.

అవసరమో, అనవసరమో తెలియని అంతర్జాలపు అవసరం మనిషిని ఆన్లైన్ సాలీడుగా మార్చేసింది.

పుట్టడానికి, పెరగడానికి, తినడానికి, తిరగడానికి, పరిగెత్తడానికి, పాకులాడ్డానికి... ఇలా ప్రతీ పనికీ ఒక టైం ఉంది. గెలుస్తున్నామో, ఓడిపోతున్నామో తెలియకుండానే రోజులు గడిచిపోతున్నాయి. 'పని ఒత్తిడి' పేరుతో తల్లిదండ్రుల్ని, కుటుంబాన్ని, స్నేహితుల్ని ఎంతగా దూరం చేసుకున్నాడో అనిపించింది. హఠాత్తుగా అతనికి 'కూలిపోయిన ఇంటిదగ్గరా, డబ్బులేని మనిషి దగ్గరా ఎవరూ ఉండర్రా. అందమైనా, బంధమైనా మనం కాపాడుకుంటేనే నిలుస్తాయి. మనం సృష్టించే బంధాలే నిజమైన సంపద, మిగిలినవన్నీ కృత్రిమం' అని తండ్రి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. గదిలోంచి బయటికి వచ్చిన అతనికి భోజనం బల్ల దగ్గర భార్యా, కూతురూ కనిపించారు. 'ఏమైనా కావాలా' అన్నట్టు అరవింద్ వైపు చూసింది ప్రత్యూష. 'నువ్వే కావాలి' అన్నాడు పెద్దగా నవ్వుతూ.

ప్రత్యూషలో ఎక్కడలేని ఆశ్చర్యం తొంగి చూసింది. కూర్చుని అన్నం తింటున్న కూతురితో అడిగి ముద్దలు పెట్టించుకుని తిన్నాడు. తల నిమిరాడు. కాసేపయ్యాక 'నీ ప్రాజెక్ట్ పనినే కాదు, ఈసారి మీ స్కూల్ పేరెంట్స్ మీటింగుకు కూడా వస్తాను చిట్టి తల్లీ' అన్నాడు.

'నిజంగానా నాన్నా' చిట్టితల్లి కళ్ళు సంభ్రమాశ్చర్యాలతో మెరిశాయి. ప్రత్యూష వైపు చూస్తూ 'రోజువారీ పనుల్లో భాగంగా ఉండాల్సిన సాంకేతికత నన్ను యాంత్రికంగా మార్చింది. నట్టింట్లో పూసే నిజమైన పువ్వుల్ని విడిచిపెట్టి నెట్టింట్లో విరిసే కృత్రిమ పువ్వుల కోసం ఎగబడ్డాను. అవసరమో, అనివార్యమో తెలియని అయోమయంలోకి వెళ్ళిపోయాను. నిజమైన ఆనందం స్క్రీన్ పైన లేదని, మనిషిని మనిషినీ కలిపే బంధాల్లో ఉందని తెలుసుకోడానికి నాకు చాలా టైం పట్టింది. ఇకనుంచి నా ఇంటికి నిప్పు పెట్టుకుని ఆ మంటల్లో చలి కాచుకోవడానికి ఆరాటపడను' అన్నాడు అరవింద్.

ప్రత్యూష మొహంలో కోటి కాంతులు విరజిమ్మాయి. 'థాంక్యూ నాన్నా' అంటూ కూతురు అల్లుకుపోయింది.

◆◆

---

## శిలా రూపానికి కళ్లొస్తే

అవునండీ! అవును !!
కడుపు కట్టుకుని ఇష్ట దైవానికి
సమర్పించిన ఆ వెండి ఇటుకలు,
భక్తితో దేవుడికిచ్చిన కానుకలు,
తమ లోపల తామే కుమిలిపోతున్నాయి.
గుడిని కాపాడాల్సిన హస్తాలే
దోపిడీదారులుగా మారిన వేళ,
పూజారుల కర్పూర హారతిలోనే ఇప్పుడు
గాయపడిన గుండెల కోత కనిపిస్తోంది!
కంచే చేనును మేసినట్టు జరిగిన
ఈ ద్రోహంతో–
నిరుపేదల రెక్కల కష్టం
నిస్సహాయంగా రోధిస్తోంది.
గర్భగుడిలోని చిమ్మచీకట్లు
దీపాలను వెలిగిస్తుంటే,
బయటి మధ్యాహ్నపు ఎండ వెలుతురులో
చీకటి రాజ్యం నడుస్తోంది!
వత్తి లేని దీపపుకుందుల వెనుక
దొంగలు నిశ్శబ్దంగా దాక్కున్నారు.
సొమ్ము కాజేసిన వారి అపవిత్ర హస్తాలలోనే
పూజా పళ్ళాలు వెలిగిపోతున్నాయి,
విలువలన్నీ ఇక్కడ అమ్మకపు సరుకయ్యాయి!
కాపాడాల్సిన వారే లూటీలు చేస్తుంటే
డబ్బులిచ్చిన భక్తులు నిశ్చేష్టులయ్యారు,
ఇది కాలం చూసిన నమ్మకద్రోహపు దృశ్యం!
భావోద్వేగానికి ప్రతిరూపమైన
బాల శిలా విగ్రహమేమో
ఏం చేయాలో తోచక,
దిక్కు తెలియని స్థితిలో తలుపులేసుకుని
అంతరంగంలోనే పచార్లు చేస్తున్నది.
అది తప్పు చేసినవారిని శిక్షించే సరియైన
కాలం కోసం వేచి చూస్తున్నదో లేదో గానీ,
మాట్లాడాల్సిన 'అధికారం' మాత్రం
తూ, తూ మంత్రాలు చదువుతూ
గమ్మున నోరుమూసుకుని కూర్చుంది!
ఆలయ గుమ్మాలకు అతుక్కున్న కళ్ళు
నిజాలను నిగ్గుతేల్చమని ప్రశ్నిస్తున్నాయి,
ధూప దీపాల పొగలో పవిత్రత ఆవిరై
ముక్కలైపోతోంది భక్తుల నమ్మకం
మౌనంగా!
విరాళాలు ఇచ్చిన జనం
ఇప్పుడు పిడికిళ్ళు బిగిస్తున్నారు,
ఆ బిగిసిన నరాలే నిలదీస్తున్నాయి...
"మా నమ్మకపు విలువ ఇదేనా?" అని.
పవిత్రమైన విశ్వాసం
నిలువునా సమాధి అయిన వేళ,
ఆ దేవుడే పరధ్యానంలో ఉండిపోతే...
ఇప్పుడు అంతిమ దైవం భక్తుడి కన్నీరే!

**- విల్సన్ రావు కొమ్మవరపు,**
89754 35515

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి


సూర్య

12.7.2026

# ఒంటుండ బండి (కథ)



(డాక్టర్ సారిపల్లి నాగరాజు – 8008370326)

రాత్రి తొమ్మిది దాటింది..

ఊరంతా నిద్రలో మునిగిపోయింది. కానీ ఊరి చివరనున్న చిన్న మట్టి ఇంట్లో మాత్రం నిశ్శబ్దం కేకలేస్తోంది. కుక్కల మొరుగులు దూరంగా వినిపిస్తున్నా, రాములు గుండెలో వినిపిస్తున్న ఖాళీ అంతకంటే గట్టిగా ఉంది.

మంచంపై వెల్లకిలా పడుకున్నాడు. నిద్ర అతనిని దాటేసి వెళ్లిపోయింది. అటూ ఇటూ కదులుతున్నాడు. బలవంతంగా కళ్ళు ఎంత మూద్దాం అన్నా కంటి మీదకు కునుకు రావడం లేదు.

కంటి ముందు పట్నానికి వలస వెళ్లిన కొడుకు, కొడుకు చేయి పట్టుకొని కోడలు, కోడలు చేతిలో మనవడు వెళ్ళిపోయిన దృశ్యం కదలాడుతూనే ఉంది.

“ఎక్కడున్నారో? ఎలాగున్నారో? గూడు దొరికిందో లేదో? కూడైనా తిన్నారో లేదో?...” అనే ఆలోచనలు అతని మనసును చుట్టుముడుతున్నాయి.

పల్లెలో పుట్టి పెరిగిన బంధాలు ఒక్క రోజులోనే తెగిపోవు. కానీ అవసరం అనే దొంగ నిశ్శబ్దంగా వచ్చి బంధాలను, అనుబంధాలను బలవంతాన దొంగిలించి పట్టుకుపోతాడు.

ఆ దొంగ మరెవరో కాదు మాయదారి వలస.

***

కోడి కూతకుముందే రాములు మేలుకున్నాడు.

రాత్రి నిద్రపోయాడో లేదో! అతనికే తెలియదు.

చెరువు దారి పట్టాడు. చల్లని గాలి ముఖాన్ని తాకినా గుండె మాత్రం వేడెక్కినట్టే ఉంది.

తిరిగి వచ్చేసరికి గడియారం ఐదు మోగింది. చర్చి గంటలు “టంగ్ టంగ్” మంటూ ఊరంతా నిద్రలేపుతున్నాయి. కానీ రాముల గుండె మాత్రం అప్పుడే మేల్కొన్నట్టుంది కొడుకు జ్ఞాపకాలతో!

మూలన ఉన్న కత్తిని తీసాడు.

అడుగు ముందుకేసేసరికి గతం ముందుకొచ్చింది. మనసునిండా ఏవో జ్ఞాపకాల దొంతరలు... దూరమైన కొడుకును తల్చుకుంటే మనసు చేదుగా, బతుకు భారంగా అనిపిస్తోంది.

‘కొడుకు దగ్గరుంటే ఇద్దరం కలిసి ఎడ్లబండి తోలుకుంటూ కొండెక్కేవాళ్లం... బండి నిండా కట్టెలు కొట్టి పట్టణానికి తీసుకుపోయి అమ్మేవాళ్ళం. కట్టెలు బండి నిండితేనే పొట్ట నిండేది బతుకు బండి సజావుగా సాగేది’ అనుకున్నాడు తనలో తానే.

ఇప్పుడు ఆ బండి ఒంటిదయిపోయింది. ఒంటిదయినా బాగుణ్ణు ఒంటుండ బండి అయిపోయింది. ఒంటి చేయి మనిషి, ఒంటి చక్రం బండి... కొంతకాలం తిరిగినా ఎప్పుడో అప్పుడు ఒక పక్కకు ఒరగాల్సిందే!

‘దీనంతటికీ కారణం ఒప్పుల కుప్ప వయ్యారి భామ మా కోడలే’ అని అనుకున్నాడు.

కానీ వెంటనే ఆ ఆలోచన లోంచి బయటికొచ్చాడు. నిజమే.. కోడల్ని నిందించాల్సిన పనేముంది? కసురుకున్నా, విసురుకున్నా ఇంత గంజి నీళ్ళు పోసేది. బతుకు బండి గడిచిపోయేది.

రోజుకు పాముల్లా పగబట్టాయి. ఉన్న దరిద్రానికి

తోడు పంటల్లేక, పనుల్లేక ఇల్లు గడవడం కష్టమైనప్పుడు గుప్పెడు మెతుకుల్ని వెతుక్కుంటూ వలసెళ్లడంలో తప్పేముంది?

నా కొడుకుని చూడకుండా నేనుండలేను. మరి కళ్ళముందే ఆడి కొడుకులు ఆకలికి తట్టుకోలేక అల్లాడుతుంటే ఆడు మాత్రం ఎట్టా సూత్తా ఊరుకుంటాడు?’

అని తనలో తానే సర్ది చెప్పుకుంటూ

కొండ దారిన నడవసాగాడు రాములు.

కానీ అతని మనసు మాత్రం పట్నం వీధుల్లో తిరుగుతోంది.

‘వాళ్లు ఎలా బతుకుతున్నారో?... ఆకలితో ఉన్నారేమో?... పని దొరికిందో లేదో? మనవుడు ఎలా ఉన్నాడో...’

***

సూర్యుడు తూర్పున ఎర్రటి కాంతి చిమ్ముతుంటే, రాములు తలపై కట్టెల మోపు వేసుకుని ఇంటి దారి పట్టాడు.

కానీ అతని అడుగులు బరువుగా ఉన్నాయి. శరీరం వల్ల కాదు, ఒంటరితనం వల్ల.

‘నేనింకా ఎవరి కోసం బతకాలీ?’

అన్న ప్రశ్న నోట్లోంచి బయటకు వచ్చి గాల్లో కలిసిపోయింది.

ఒకప్పుడు భార్య వెళ్లిపోయింది. అప్పుడు అతను సగం చనిపోయాడు.

ఇప్పుడు కొడుకు దూరమయ్యాడు. మిగిలిన సగం కూడా మసకబారుతోంది.

***S

ఇంట్లోకి అడుగుపెట్టేసరికి ఆ ఇంటి నిశ్శబ్దం అతనిని కౌగిలించుకుంది.

అది ఓదార్పు కాదు శూన్యం.

పొరిగింటి సోములు వచ్చి చూసేసరికి రాములు పడమర వైపు కూలబడి ఉన్నాడు.

చేతిలోని కట్టెలు పక్కనే జారిపోయాయి. అప్పటి వరకూ ఆ కట్టెలే అతని బతుకు బండిని ముందుకు నడిపాయి. ఇప్పుడు ఆ కట్టెలే ఆ కట్టెను కాల్చడానికి కారణమయ్యాయి.

విషాదంగా అతని వైపు చూశాడు సోములు. పుట్టి పెరిగిన దగ్గర్నుంచీ ఎన్నో మరణాలు చూశాడు. సహజంగా వచ్చే మరణాల కంటే వలస దుఃఖాన్ని మోయలేక ఆగిపోతున్న ఒంటుండ బండిలే ఎక్కువవుతున్నాయి.

కళ్ళు తుడుచుకుంటూ వీధిలోకి నడిచాడు.

# పిడికెడు స్వప్నాలు ఒక మరణశిక్ష

• చందు తులసి





అది బెంగళూరు పరప్పన సెంట్రల్ జైలు ముందున్న ట్రాఫిక్ సిగ్నల్. అక్కడ హఠాత్తుగా భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. మోటార్ బైక్‌లూ, కార్లూ... తోడేలుని చూసి బెదిరిపోయిన గొర్రెల మందలా అడ్డదిడ్డంగా పోతున్నాయి.

ఆ వాహనాల పక్కనుంచే, ఆ శబ్దాల మధ్యలోనే మనుషులు కూడా వెళుతున్నారు. వర్షాకాలపు చెత్తకుప్పలో ఒకదాన్ని ఒకటి ఒరుసుకుంటూ పోయే వేలాది గాజుపురుగుల్లా గుంపులు గుంపులుగా పోతున్నారు.

తమ కళ్లముందే ఒక ఘోరం, దుర్మార్గం జరుగుతున్నా వాళ్లెవరూ పట్టించుకోవడం లేదు. ఆ జైలు ముందు పట్టపగలు అందరూ చూస్తుండగానే... పాటగాడు పెద్దన్నను బహిరంగంగా ఉరితీస్తున్నారు.

అప్పుడెప్పుడో పదహారో శతాబ్దంలో బ్రూనోను రోమ్ నగరం వీధుల్లో ఈడ్చుకుంటూ తెచ్చి సజీవదహనం చేసినట్లుగానే... తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమ పాటకు మారుపేరుగా నిలిచిన పాటగాడు పెద్దన్నను కూడా కాళ్లు, చేతులు కట్టేసి, కొరడాలతో కొడుతూ ఈడ్చుకొంటూ తీసుకొస్తున్నారు నల్ల ముసుగులు వేసుకున్న వాళ్లు.

పెద్దన్న నోరు తెరిస్తే ఏ పాట పాడతాడో.. అనే భయం వాళ్లలో కనిపిస్తుంది. పాట అతని ఆయుధం.. ప్రశ్న అతని అస్త్రం.. అందుకే పెద్దన్న నోరు తెరవకుండా ఇనుపతీగలతో నోరు కుట్టేశారు. ఇంత జరుగుతున్నా పట్టనట్టు వెళ్లిపోతున్న జనాలకి... తన చివరి మాటలు చెప్పాలని పెద్దన్న విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

ఆ నల్లముసుగు మనుషులకు తలలు కనిపిస్తున్నాయి కానీ... వాళ్లకు తలలో మెదడు లేదు. వెన్నెముక లేదు. సొంత ఆలోచనా శక్తి లేదు. దూరంగా ఉత్తర దిక్కున ఉన్న కొండ పైనుంచి ఆదేశాలు పంపిస్తున్న మహామంత్రగాడి సైగల ఆధారంగా వాళ్లు తలలు ఊపుతున్నారు.

ఉత్తరం దిక్కు మహామాంత్రికుడి ఆజ్ఞ మేరకు... నల్లని మృత్యువు రంగు బట్టని పెద్దన్న తలపై కప్పారు. పెద్దన్న కళ్లను చీకటి ఆవహించింది. ఉరితాడు గట్టిగా బిగించి కింద ఆధారం తొలగించారు. గిలగిలా కొట్టుకుంటున్నాడు పెద్దన్న.

ఇంకొందరు పెద్దన్న పైకి రాళ్లు విసురుతున్నారు. ఇతనికి ఉరిశిక్ష సరిపోదు... శిలువ వేసి చంపాలని గట్టిగా పిచ్చిపట్టినట్టు అరుస్తున్నారు. ఇంకొందరు వీడు దేశద్రోహి... పక్క దేశానికి అమ్ముడుపోయాడని కేకలు వేస్తున్నారు.

ఉరికొయ్యకి వేలాడుతున్న పెద్దన్న కాళ్ల కింద... రక్తం కక్కిన సూర్యుడు పడమర కడుపులోకి కరిగిపోయాడు. ఆశ్చర్యంగా పెద్దన్న మరణించినా... అతని శరీరంలోంచి ఏదో పాట వినిపిస్తోంది. మెల్లగా ఆ పాట నాలుగు దిక్కుల్లో ప్రతిధ్వనిస్తోంది.

పెద్దన్నని చంపినా, దేహాన్ని ఖండఖండాలుగా నరికినా అతని పాటను చంపలేమని వాళ్లకి అర్థమైంది. పెళపెళమంటూ నలుదిక్కుల నుంచి ఉరుములా ప్రతిధ్వనిస్తున్న అతని పాట వినలేక చెవులు మూసుకుంటూ తలో దిక్కు పారిపోతున్నారు. మహాసముద్రం హోరులా చుట్టుముట్టిన పెద్దన్న పాట ధాటికి ఉత్తరదిక్కు మహామాంత్రికుడు పెళపెళమని కుప్పకూలి పోయాడు.

ఇంత జరుగుతున్నా... అక్కడి జనాలు మాత్రం గాజుపురు గుల్లా కదిలిపోతున్నారు. వేలాది గాజుపురుగులు తన వంటిపైన పాకుతున్నట్లు అనిపించడంతో పెద్దన్న... ఒక్కసారిగా ఉలిక్కి పడి నిద్రలేచాడు. చాలా రోజుల నుంచి పదేపదే వస్తున్న కల అది. తనను బెంగళూరులో ఉరితీస్తున్నట్లు, మనుషులంతా గాజుపురు గుల్లా మారిపోతున్నట్టు మళ్లీమళ్లీ వస్తున్న కల. ఐతే పెద్దన్నను ఉరితీయడం కలే కావచ్చు కానీ బెంగళూరు కేసు మాత్రం వాస్తవం.

***

"బ్రేకింగ్ న్యూస్..."

త్వరలో రానున్న బెంగళూరు కుట్ర కేసు తీర్పు. ప్రజాగాయ కుడు పెద్దన్నకి మరణశిక్ష తప్పదా? దేశద్రోహులకు ఈ తీర్పు కఠిన హెచ్చరిక అంటూ సంబరాలు చేస్తున్న దేశభక్తులు.."

పాతకాలం బ్లాక్ అండ్ వైట్ టీవీలో వస్తున్న బ్రేకింగ్ న్యూస్‌ని టెన్షన్‌గా చూస్తున్నాడు పెద్దన్న. అంటే... బెంగళూరు కేసులో తనకి ఉరిశిక్ష తప్పదా..? ఇంతకీ ఏం నేరం చేశాడని ఈ ఉరిశిక్ష? పాట పాడినందుకు... కొన్నిసార్లు పాట పాడినందుకే కాదు, సత్యం మాట్లాడినందుకు కూడా ఉరిశిక్ష వేస్తారు.

హైదరాబాద్ సిటీసెంటర్‌లో ఉన్న చిక్కడపల్లి మెట్రోరైలు బ్రిడ్జికి కుడివైపున పెద్ద డ్రైనేజీ వాగు ఉంది. ఆ మురికి కాలువకి రెండు వైపులా వందల కొద్ది రేకుల షెడ్లు. ఆ బస్తీలోనే ఉంది పెద్దన్న ఇల్లు అనే రేకుల షెడ్డు. వానొస్తే నీళ్లు కారకుండా కప్పిన టార్పాలిన్ కవర్ చినిగిపోయింది. మురికి కాలవ పైనుంచి వస్తున్న గాలికి టార్పాలిన్ కొట్టుకుంటోంది. రెండు గదుల ఆ ఇంట్లోని ముందు గదిలో ఒక మూలకు ఉన్న టీవీపైన రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయిన పెద్దన్న భార్య గౌరమ్మ ఫోటో ఉంది. పెద్దన్న పాటల మీద సెంట్రల్ యూనివర్శిటీలో పిహెచ్‌డి చేస్తున్న రవీందర్ ఒంటరిగా ఉంటున్న పెద్దన్నకు తోడుగా ఉంటున్నాడు. పెద్దన్న అన్నా, ఆయన పాట అన్నా రవీందర్‌కి ప్రాణం.

పెద్దన్న ఎవరనేది ఇప్పటి తరానికి పెద్దగా తెలియదు. వాట్సాప్ పోస్టులు, ఫేస్ బుక్ రీల్స్, ఇన్‌స్టా పోస్టులతో నిత్యం బిజీగా ఉండే నేటి తరానికి పెద్దన్నతో అంతగా అవసరం కూడా లేదు. కానీ ముప్పైఏళ్ల కిందట పెద్దన్న అంటే ఉవ్వెత్తున ఎగిసి పడిన పాట... లక్షలాదిమందిని ఉరకలెత్తించిన చైతన్యం.

పెద్దన్న పాట ఉందంటే... సభలకు జనాలు ఉసిళ్లమందలా ఉరికివచ్చేవాళ్లు. ఎడ్లబండ్లూ, ట్రాక్టర్ల పైనా ఒక మహాయుద్ధానికి తరలిపోతున్న సైనికుల్లా తరలివచ్చేవాళ్లు. పెద్దన్న స్టేజీపైకి ఎక్కితే చాలు... ఈలలు, కేకలు, చప్పట్లతో మారుమోగేది. ఆ రోజుల్లో పెద్దన్న పాట ఒక స్వేచ్ఛాగీతిక, ఒక చైతన్య పతాక.

చెమటతో భూమిని తడిపే రైతు కూలీలకు, పట్టణం భారాన్ని రెక్కలతో ఈడ్చే రిక్షావాలాకు, యంత్రాల మధ్య నలిగిపోయే కార్మికులకు... తమ బతుకు మారుతుంది అన్న ఆశకు పెద్దన్న పాట ఒక భరోసా. ఎటువంటి కాలం అది! మానవులంతా సమానమయ్యే... మరో ప్రపంచాన్ని కలలు కన్న కాలం అది. నాలుగు పిడికిళ్లు, రెండు నినాదాలు, ఒక్క పాట, ఇంకొన్ని తూటాలు... అన్యాయన్ని, దోపిడినీ తుడిచేస్తాయని నమ్మిన కాలం అది. ఆ కలలకు, కాలానికి కళ్లను అరువిచ్చింది పెద్దన్న పాట. ఎక్కడ ఎన్కౌంటర్ జరిగినా అక్కడ పెద్దన్న పాటలు, దోసెడు కన్నీళ్లు, రెండు పిడికిళ్ల మన్ను తప్పక ఉండేవి.

రోజంతా ఆడీపాడీ అలిసిపోయి ఏ రాత్రికో ఇంటికి చేరుకున్న పెనిమిటికి... గౌరమ్మ ఉడుకు నీళ్లతో కాపడం పెడుతూ అడిగేది.. "ఇంటినీ, పిల్లల్నీ వదిలేసి ఎంతకాలం ఈ తిరగడం.." అని. పెద్దన్న గౌరమ్మని దగ్గరకు తీసుకుని... "మన పిల్లలే కాదు. జనమంతా పసిపిల్లలే. ఏది మంచో, ఏది చెడో తెలిసిన వాళ్లు చెప్పాలి కదా? మన పిల్లల్ని చూసుకోవడానికి నువ్వున్నావు కదా. జనం కోసం నేను, నా పాట..." అంటూ గౌరమ్మ తలపై నిమురుతూ చెప్పేవాడు.

అప్పుడు గౌరమ్మకి జనాల సంగతి ఏమో కానీ... పెద్దన్న మాత్రం పసిపిల్లాడిలా కనిపించేవాడు.

***

ఒకసారి మానుకోటలో జరిగిన మీటింగ్‌కు పోయిండు. మూడు రోజుల పాటు ఇంటికి రావడానికి కుదరలేదు. ఇంటికి వచ్చేసరికి బజారులో గుంపుగా జనాలు. అనుమానంగా కాళ్లు కదిలిస్తూ ఇంటి లోపలికి పోయిండు.

వచ్చినవా నాయనా... అంటూ పెద్దన్న కాళ్లు పట్టుకొని, తలబాదుకుంటూ కన్నీరుమున్నీరుగా వలపోసింది భార్య గౌరమ్మ. ఏడేళ్ల పెద్ద కొడుకు జ్వరంతో రెండు రోజుల కిందటనే చనిపోయిండట. పెద్దన్న ఎక్కడికైనా పోతే మీటింగుకి పోతున్న అని చెప్పడమే తప్ప... ఏ ఊరు అని గౌరమ్మ అడిగేది కాదు, పెద్దన్నా చెప్పేవాడు కాదు. బస్తీ జనాలే కొడుకు అంత్యక్రియలు చేసారట. మూసీ ఒడ్డున కప్పెట్టిన కొడుకు సమాధి దగ్గర రోజంతా వలపోశాడు పెద్దన్న. చివరి చూపు కూడా దక్కకుండా పోయిన బిడ్డ సమాధి మీద పడి ఎన్ని పాటలు పాడుకున్నాడో..!

ఓ రోజు తెల్లవారుజామున కబురు మోసుకొచ్చాడు మిత్రుడు. వలిగొండ ఊళ్లో ఇరవయేళ్లు కూడా దాటని ఆరుమంది యువకులని చెట్లకి కట్టేసి కాల్చి చంపారట. ఆ వార్త వినగానే ఇంట్లో ఉండలేక పోయాడు. హడావిడిగా బయలుదేరుతున్న భర్తను కళ్లతోనే ప్రశ్నించింది గౌరమ్మ. నీ బిడ్డలాంటోళ్లే అందరి బిడ్డలు కదా. నీలాంటి దుఃఖమే అందరిది కదా అన్నడు. అంతే... ఆ తర్వాత ఏనాడూ పెద్దన్నని ఎక్కడికి అని అడగలేదు. ఇప్పుడు అడగడానికి తను లేదు.

> మానవులంతా సమానమయ్యే.. మరో ప్రపంచాన్ని కలలు కన్న కాలం అది. నాలుగు పిడికిళ్లు, రెండు నినాదాలు, ఒక్క పాట, ఇంకొన్ని తూటాలు.. అన్యాయన్ని, దోపిడినీ తుడిచేస్తాయని నమ్మిన కాలం అది. ఆ కలలకు, కాలానికి కళ్లను అరువిచ్చింది పెద్దన్న పాట. ఎక్కడ ఎన్కౌంటర్ జరిగినా అక్కడ పెద్దన్న పాటలు, దోసెడు కన్నీళ్లు, రెండు పిడికిళ్ల మన్ను తప్పక ఉండేవి.

ఇప్పుడు పెద్దన్నకి అటు ఇటుగా డెబ్బైఏళ్లు ఉంటాయి. ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం భుజానికి డప్పు, చేతిలో జెండాతో అన్ని ఊర్లు తిరిగిండు. పాటే ప్రాణంగా, జనమే ప్రపంచంగా బతికిండు. వయసు పెరగడంతో ఓపిక తగ్గింది. ఐనా ఇప్పటికీ ఏ విద్యార్థి సంఘాల వాళ్లో, ప్రజాసంఘాల వాళ్లో పిలిస్తే పోయి పాటలు పాడతాడు.

పెద్దన్నపై ఇప్పటికీ చాలా కేసులు ఉన్నాయి. ఐతే రాజ్యం తలచుకుంటే ఏ ఆధారం లేకున్నా, ఏ సంబంధం లేకున్నా... ఎలాంటి కేసైనా పెడతారనడానికి ఒక క్రూర ఉదాహరణ బెంగళూరు కుట్రకేసు.

***

సరిగ్గా పాతికేళ్ల క్రితం పెనుగొండలో పెద్ద బహిరంగసభ జరిగింది. సుమారు లక్షమంది జనం... ఎటు చూసినా ఎర్రెర్రని జెండాలు. నిప్పుకణికల్లాంటి నినాదాలు. చైతన్యంతో పైకి లేచిన పిడికిళ్లు... ఆవేశం, నిరసన, ఆగ్రహం కలిసిపోయి... కణకణ మోగిన డప్పులు. అనంతపురం జిల్లాలోని చిన్న పట్టణం పెనుగొండ. ఫ్యాక్షనిస్టుల రాక్షసత్వానికి బలైపోయిన కామ్రేడ్ అబ్దుల్ భాషా సంస్మరణ సభ అది.

అనంతపురంలోని ఊడలమర్రిలా విస్తరించిన ఫ్యాక్షనిస్టుల ఊడలు తెగనరికాడు కామ్రేడ్ అబ్దుల్. బిక్కుబిక్కుమంటూ భయపడుతూ బతికే... రైతుకూలీలతో ఊరూరా సంఘాలు పెట్టించాడు. కబ్జాకోరులు ఆక్రమించిన ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతించాడు. పట్టాలు ఇప్పించాడు. ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు... కామ్రేడ్ అబ్దుల్ పెనుగొండను నిత్యం ఒక నిప్పుల కొలిమిలా రాజేశాడు. అబ్దుల్ బతికి ఉంటే తమ ఆటలు సాగవని అర్థమైన ఫ్యాక్షనిస్టులు హత్య చేయాలని ప్లాన్ వేశారు. వేల ఎకరాలు భూములు పంచి, లక్షలాది మంది జనం కోసం పోరాడిన అబ్దుల్‌ని దారుణంగా హత్య చేశారు. అబ్దుల్లా పోరాటంలాగే అతని మరణవార్త జనాల్ని కదిలించింది. కామ్రేడ్ కడచూపు కోసం వేలాదిమంది తరలి వచ్చారు. కన్నీరుమున్నీరుగా ఏడ్చారు. తమ కామ్రేడ్‌ని పొట్టన పెట్టుకున్న ఫ్యాక్షనిస్టులు ఉలిక్కిపడేలా అబ్దుల్ సంస్మరణ సభను భారీ ఎత్తున చేయాలని ఏర్పాట్లుచేశారు. శాంతిభద్రతలకు ప్రమాదం అని చెప్పి పోలీసులు సభకి పర్మిషన్ ఇవ్వలేదు. ఐనా హైకోర్టు దాకా పోయి సభకి పర్మిషన్ తెచ్చుకున్నారు.

ఆ సభకు వస్తే అరెస్టు చేస్తామని పోలీసులు భయపెట్టినా... భయపడకుండా వెళ్లాడు పెద్దన్న. కామ్రేడ్ అబ్దుల్లా పోరాటం గురించి గొంతెత్తి పాడాడు. రాలిపోయిన కామ్రేడ్‌ని తిరిగి పెద్దన్న పాటలో చూసుకున్నారు జనం. అక్కడకి వచ్చిన లక్షమంది జనం మధ్యలో అబ్దుల్ పాషా కుటుంబానికి సాయం చేయమని జోలె పట్టాడు పెద్దన్న. నలభైవేల పైనే వసూలు అయింది. వేదికపైనే ఉన్న అబ్దుల్లా భార్య, పిల్లలకు ఆ డబ్బులు ఇచ్చాడు పెద్దన్న. ఆ మరునాడు హైదరాబాద్ వచ్చాడు పెద్దన్న. పెనుగొండలో జరిగింది ఇంతే.

ఐతే సభ జరిగిన మరుసటి రోజు బెంగళూరు శివార్లలోని లగ్గేరి స్లమ్ ఏరియాలో అల్లర్లు చెలరేగాయి. అగ్ని సిద్ధప్ప అనే రౌడీషీటర్ ఆగడాలు పెరగడంతో తట్టుకోలేక... జనాలు తిరగబడి చంపేశారు. అది తట్టుకోలేని అగ్ని సిద్ధప్ప అనుచరులు ప్రత్యర్థుల దుకాణాలపై దాడిచేశారు. లూటీలు జరిగాయి. రెండు మూడు రోజులు బెంగళూరు నగరం భగ్గుమని మండింది. ఆ అల్లర్లలో దాదాపు పదకొండు మంది చనిపోయారు.

ఆ అల్లర్లకు కారణం నూటయాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగొండ బహిరంగ సభలో పెద్దన్న పాడిన పాటలే అని ఆరోపిస్తూ పోలీసులు దొంగకేసు పెట్టారు. అప్పటికే చాలా కేసులు ఉన్న పెద్దన్న... ఈ బెంగళూరు కేసును కూడా పట్టించుకోలేదు. చాలా ఏళ్ల పాటూ ఆ కేసులో ఉలుకు లేదు, పలుకు లేదు. ఆ కేసు సంగతే మర్చిపోయారు అందరూ. పాతికేళ్లలో దేశం చాలా మారిపోయింది. కొత్త పాలకులకు తమ ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించకూడదనీ, అలా ప్రశ్నించే వాళ్లు జైళ్లలోనే ఉండాలని అనుకున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న ఉద్యమకారులని, కళాకారులనీ జైళ్లలో పెట్టాలని... అప్పుడే జనం రోడ్ల మీదకు రావాలంటే భయపడతారని కుట్రచేశారు. అలా పెద్దన్న బెంగళూరు కేసు కూడా తిరగతోడారు. ఈ కేసును స్వయంగా పైనుంచి పెద్దలు పర్యవేక్షిస్తున్నారనే వార్తలు కూడా పత్రికల్లో వచ్చాయి. పాలకులకు కావాల్సింది పెద్దన్నకు శిక్షపడడం కాదు– జనాలు భయపడడం...

ఇప్పుడు పెద్దన్న బెంగళూరు పోవాలంటే కూడా చాలా ఖర్చు అవుతుంది. ఎంత లేదన్నా ఇరవైవేలకు తక్కువ ఖర్చు కాదు. అంత డబ్బు వాళ్ల దగ్గర లేదు. జనాల కోసం బతికాడు తప్ప ఏనాడు తన గురించి ఆలోచించలేదు పెద్దన్న. డబ్బు కోసం ఆలోచిస్తుంటే... నారాయణరావు గుర్తొచ్చిండు. ఫోన్ చేసి నారాయణరావు బెంగళూరు కేసు గురించి చెప్పి... ఇరవై వేలు కావాలని అడిగిండు పెద్దన్న. సాయంత్రం వరకు చెప్త అని ఫోన్ కట్ చేసిండు. నారాయణరావు ఒకప్పుడు యూనివర్శిటీలో స్టూడెంట్‌గా ఉన్నపుడు పెద్దన్నతో పాటే సభలకు వచ్చేవాడు. పెద్దన్నతో తిరుగుతూ స్టూడెంట్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నడు. తర్వాత రెండు పార్టీలు మారిండు. మెల్లగా కాంట్రాక్టులు పనులు సాధించాడు. బాగానే సంపాదించిండు అంటరు.

***

మధ్యాహ్నం ఉస్మానియా యూనివర్శిటీల ధర్నా ప్రోగ్రామ్ ఉంది. అక్కడికే ఆటోలో పోతున్నరు పెద్దన్న, రవీందర్.

"అన్నా... బెంగళూరు కేసు గురించి టీవీల చూసినప్పటి నుంచి భయమైతుందే. నీకు ఉరిశిక్ష వేస్తరట..." భయంభయంగా చెప్పాడు రవీందర్. తన భయాన్ని చూసి పగలబడి నవ్విండు పెద్దన్న. నాకిప్పుడు డెబ్బై ఏండ్లు. యాభై ఏండ్ల నుంచి ఉద్యమాల్లో ఉన్న. నా మీద ఎన్నోసార్లు ఎటాక్ చేసినరు. చచ్చేటోన్ని బతికిన. బిడ్డా రవీందర్! ఒక్క మాట చెపుత గుర్తుపెట్టుకో. నువ్వు భయపడ్డా, భయపడకపోయినా సచ్చిపోతవు. ఇంకెందుకురా భయం. చావు గురించి ఎక్కువ ఆలోచించకు..." రవీందర్‌కి ధైర్యం చెప్పిండు పెద్దన్న.

ఆర్ట్స్‌కాలేజీ గ్రౌండ్ ముందు రోడ్డు దగ్గర ఆగింది ఆటో. ఆటో ఛార్జీ ఇవ్వడానికి ఇద్దరి దగ్గరా డబ్బులు లేవు. అప్పటికే పెద్దన్న కోసం ఎదురుచూస్తున్నడు స్టూడెంట్స్ లీడర్ రఘురామ్. అతన్ని అడిగి ఆటోకి డబ్బులు ఇచ్చిండు పెద్దన్న.

ఎటు చూసినా స్టూడెంట్స్ కనపడకపోవడంతో... ధర్నా అన్నవు... పోరగాండ్లు ఎక్కడా... అని అడిగిండు స్టూడెంట్ లీడర్‌ని. "ఇప్పటిదాకా ఈడనే ఉన్నరే. అగో ఆ పార్కు దగ్గర ఎవరో సినిమాల్లో నటిస్తున్న యువ హీరోయిన్ వస్తే అటు పోయినరు. పిలుస్తా. ఔ గనీ అన్నా ఇదే నా కొత్త కారు. పోయిన వారం కొన్న..." అంటూ దూరంగా ఎర్రరంగులో మెరుస్తున్న ఐ–20 కారు చూపించాడు రఘురామ్.

ఒక స్టూడెంట్ లీడర్‌కి కొత్త కారు ఎట్ల వచ్చిందో అర్థంకాలేదు రవీందర్‌కు. "వచ్చే ఎలక్షన్ల ఎమ్మెల్యేగా పోటీ చేస్తవు అంటున్నరు నిజమేనారా బిడ్డా..." ఆర్ట్స్ కాలేజ్ ముందు పచ్చగడ్డి మీద కూలబడుతూ రఘురామ్‌ని అడిగిండు పెద్దన్న. సమాధానం చెప్పలేక సిగ్గుపడ్డాడు స్టూడెంట్ లీడర్. "ఎంతైనా మా తరం కంటే మీరు తెలివైనోళ్లురా బిడ్డా" అని భుజం మీద కొడుతూ నవ్విండు పెద్దన్న.

ఎంత సేపైనా ధర్నాకి ఎవరూ రాలేదు. దూరంగా గుంపులుగా ఉన్న స్టూడెంట్స్ దగ్గరకి పెద్దన్నే పోయిండు. అక్కడ యూనివర్శిటీ కాంపౌండ్ గోడకు పక్కన ఏదో దావత్ జరుగుతున్నది. ఆ దావత్‌కి గెస్ట్‌గా యువ హీరోయిన్ వచ్చింది. గంటసేపు అక్కడ ఉండడానికి యాభైవేలు ఇచ్చి ఆమెను పిలిచిన్రట. ఆమెను చూడడానికి స్టూడెంట్స్ పోటీ పడుతున్నారు. ఒక సెల్ఫీ ప్లీజ్ అని పోరగాళ్లు ఎగబడుతున్నారు. అందరితో సెల్ఫీలు దిగి... బైబై అని చెప్పి కారులో వెళ్లిపోయింది. కొంతమంది ఆమె కారు వెనకాల చేతులు ఊపుకుంటూ ఉరుకుతున్నరు.

ధర్నా కోసం వచ్చిన స్టూడెంట్స్ ఆ సంగతే మర్చిపోయి... హీరోయిన్ వెనకాల ఎందుకు ఉరుకుతున్నరో పెద్దన్నకి అర్థంకాలేదు. పోరగాళ్లు ఎటోడు అటు వెళ్లిపోవడంతో ఇంటికి పోవడం తప్ప ఇంకో దారిలేదని అర్థమయింది. ఇంటి దగ్గర డ్రాప్ చేస్తానని రఘురామ్ కొత్త కారు స్టార్ట్ చేశాడు.

"ఫీజులు తగ్గించాలని ధర్నా చేయాల్సిన పోరగాండ్లు ఎవరో సినిమా నటి వెనకాల పడి ఉరికినరేంది తమ్మీ. సెల్ఫీ ముఖ్యమా. పోరాటం ముఖ్యమా..." ఆశ్చర్యంగా అడిగాడు పెద్దన్న.

> పాతికేళ్లలో దేశం చాలా మారిపోయింది. కొత్త పాలకులు తమ ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించకూడదనీ, అలా ప్రశ్నించే వాళ్లు జైళ్లలోనే ఉండాలని అనుకున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న ఉద్యమకారులని, కళాకారులనీ జైళ్లలో పెట్టాలని.. అప్పుడే జనం రోడ్ల మీదకు రావాలంటే భయపడతారని కుట్ర చేశారు. అలా పెద్దన్న బెంగళూరు కేసు కూడా తిరగతోడారు.

"ఎనకటి రోజులు కావు అన్నా. ఇప్పుడు పోరగాండ్లు మారిపోయినరు. ఎవరి చేతిల చూసిన కొత్తకొత్త స్మార్ట్ ఫోన్లు. బీర్లు తాగుతూ దావత్ చేసుకుంటున్నరు. ధర్నాలు, రాస్తారోకోలు అంటే ఎవలు రావట్లేదు అన్న... నాకు ఏ పని చేతకాక... ఈ పాలిటిక్స్ అంటు తిరుగుతున్న. రేపోమాపో నేను కూడా రియల్ ఎస్టేట్ చేసుకుంట అన్న..."

పెద్దన్నకు బెంగళూరు జైలు ముందు ఉరితీసిన పీడకల గుర్తొచ్చింది. అది కల మాత్రమే కాదు. ఇప్పుడు తన కళ్లముందే జరుగుతోంది. తమ చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోకుండా గాజుపురుగుల్లాంటి మనుషులే ఇప్పుడు కళ్లముందు ప్రత్యక్షంగా కనపడుతున్నారు.

కారు సీతాఫల్ మండి దగ్గరికి రాగానే ఒక ఊరేగింపు ఎదురైంది. ఆ ఊరేగింపు ముందు బాగా తాగిన మైకంలో ఉన్న పదిమంది యువకులు బీరు సీసాలు చేతిలో పట్టుకుని డాన్స్ చేస్తున్నారు. డీజేలో వస్తున్న పాట విన్న పెద్దన్న ఉలిక్కిపడ్డాడు. కదలండి ముందుకు, ఉరకండి ముందుకు... అని ముప్పై ఏళ్ల క్రితం రాసిన తన పాట. ఒకప్పుడు లక్షలమంది విద్యార్థులని చైతన్యవంతం చేసిన తన పాట ఇప్పుడు డీజే పాటగా మారిపోయింది. ఆ పాట అర్థంఏమిటో పట్టించుకోకుండా బీరు బాటిళ్లు తలపై పెట్టుకుని గంతులు వేస్తున్నారు. రోడ్డు మీద వాహనాలకు దారి ఇవ్వాలనే స్పృహ కూడా వాళ్లలో లేదు. చాలాసేపు గంతులు వేసి, ట్రాఫిక్ జాం ఐన తర్వాత పక్కకి జరిగారు.

కారు మెల్లగా చిక్కడపల్లి దాకావచ్చింది. ఇద్దరినీ ఇంటి దగ్గర గల్లీలో దింపి వెళ్లిపోయాడు స్టూడెంట్ లీడర్ రఘురామ్.

***

"అన్నా... డబ్బులు ఎంత ట్రై చేసినా దొరకలేదు. రోజులు ఎనకటి లెక్క లేవు. నేను కూడా ఇప్పుడు కాంట్రాక్టులు చేయట్లే. అంతా మా కొడుకు చూసుకుంటుండు. నేనే ఖర్చుల కోసం కొడుకు దగ్గర అడుగుతున్న. ఇంకెవల దగ్గరన్నా ట్రై చేయ్..." అని ఫోన్ కట్ చేసిండు నారాయణరావు. పెద్దన్నకి మెల్లగా అర్థమైంది. నారాయణరావు చెప్పినట్లు రోజులు ఎనకటి లెక్క లేవు. రోజులు మారినట్టే మనుషులూ మారిపోతున్నరు.

ఒకప్పుడు జనమే లోకంగా, జనం కోసమే బతికిండు పెద్దన్న. ఎన్ని కేసులు, నిర్బంధాలు, ఎన్ని కష్టాలు, ఎన్ని కన్నీళ్లు. అవేవీ ఇప్పటి తరానికి తెలియదు. ఇప్పటి తరానికి తను అవసరం కూడా లేదు. పొద్దున్న యూనివర్శిటీ దగ్గర ధర్నా సంగతి మర్చిపోయి యువనటి వెనకాల ఉరికిన యూత్ గుర్తుకొచ్చినరు. బీర్ సీసాలు పట్టుకుని గంతులు వేసిన జనాలు గుర్తుకొచ్చినరు. దేశంలో ఏం జరుగుతున్నా సరే... ఎవనికి ఏమీ పట్టడంలేదు. ఎవని ఆనందంలో వాడు ఉన్నడు. అచ్చం తన కలలోని గాజు పురుగుల్లా. ఏం జరుగుతున్నా పట్టించుకోకుండా పోతున్నరు.

ఎన్నో ఏళ్లుగా పెద్దన్నతోనే ఉంటున్న రవీందర్‌కి ఇవన్నీ తలుచుకుని ఒక్కసారిగా ఆవేశం తన్నుకొచ్చింది. "ఎందుకన్నా ఈ తలనొప్పులన్నీ. ఎవని కోసం ఇదంతా. జనమంతా ఎవని ఆనందంలో వాళ్లు ఉన్నరు. ఏం జరుగుతున్నా ఎవడూ పట్టించుకోడు. నువ్వేమో జనం జనం అంటూ... జీవితం మొత్తం పాడుచేసుకున్నవు. ఏం తప్పు చేసినవన్నా నువ్వు. అందరూ బాగుండాలని పాటలు పాడినవు అంతే కదా... దానికేనా ఇన్ని వేధింపులు, ఇన్ని నిర్బంధాలు... జైలు శిక్షలు, మరణశిక్షలు..." ఆవేశం తట్టుకోలేక తిడుతున్నాడు రవీందర్.

అరే ఊకోరా బిడ్డా... అని దగ్గరికి హత్తుకున్నాడు పెద్దన్న.

"నీకు భయంగా లేదా అన్న..."అడిగాడు రవీందర్.

"భయమైతోందిరా బిడ్డా... కానీ వాడు జైలులో పెట్టి మరణశిక్ష వేస్తానన్నందుకు కాదు. ఇంత జరుగుతున్నా జనం ఎవ్వడూ పట్టించుకోవడం లేదు చూడూ... అది చూసి భయమైతోందిరా బిడ్డా. మేం ఆ రోజుల్లో తిన్నా, తినకున్నా... బాధపడేవాళ్లం కాదురా. కళ్ల నిండా కలలు మాత్రం కనేవాళ్లం. దోపిడీ పోతుందనీ, మనుషులంతా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి బతుకుతారనీ, ఇలా ఎన్ని కలలు కన్నమో. ఆ కలలన్నీ కరిగిపోతుంటే భయమేస్తోందిరా" బాధగా అన్నాడు పెద్దన్న.

"రేపు బెంగళూర్ పోవాలి కదా... పొద్దుగాల లేవాలి. ఇంగ పడుకో"అని చెప్పిండు.

తన కళ్ల ముందు ఆనాటి కలలు అలలు అలలుగా కనిపిస్తున్నాయి. ఒక్కో కలను గుర్తుచేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు పెద్దన్న.

రవీందర్‌కి మాత్రం నిదుర పట్టడం లేదు. ఎన్ని త్యాగాలు... ఎన్ని జీవితాలు, ఎన్ని ఉద్యమాలు, ఎన్ని ప్రాణాలు... ఎంత రక్తం, ఎంత హింస... ఎన్ని యుద్ధాలు, ఎంతో మంది బలిదానం వల్లనే కదా... అందరూ సుఖంగా బతుకున్నరు. ఆనాటి త్యాగాలు, ఆ పోరాటాలు... అవన్నీ దండగేనా... ఆ కలలకు, ఆ త్యాగాలకు బహుమతి జైలుశిక్షలు, మరణశిక్షలా...?

సమాధానం లేని ఎన్నో ప్రశ్నలు రవీందర్ మెదడులో పుట్టగొడుగుల్లా క్షణానికొకటి పుట్టుకొస్తున్నాయి.

ఇంటి పక్కన ఉన్న మూసీ కాల్వపైనుంచి తెరలుతెరలుగా కదిలివస్తున్న గాలి... పెద్దన్న ఇంటి గోడకు వేలాడుతున్న డప్పుని సుతారంగా తాకుతోంది. ఆ గాలి స్పర్శకే డప్పు చిన్నచిన్న శబ్దాలు చేస్తోంది. టీవీపైన ఉన్న ఫోటోలో ఉన్న గౌరమ్మ పెద్దన్న వైపే చూస్తోంది. ఇంటిపైన సిమెంట్ రేకుల పైన కప్పిన టార్పాలిన్ పట్టా... గాలికి రెపరెపలాడుతోంది.

***

"బ్రేకింగ్ న్యూస్..."

"గాయకుడు, ఉద్యమకారుడు పెద్దన్న కన్నుమూత..."

"బెంగళూరు కేసులో ఇవాళ హాజరు కావాల్సి ఉండగా హఠాన్మరణం..."

"తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేక మరణించినట్లు వైద్యుల ధృవీకరణ..."

ఆ రోజు పొద్దున్నే న్యూస్ ఛానెళ్లలో పెద్దన్న మరణవార్త బ్రేకింగ్ న్యూస్‌గా మారింది.

మార్పుకోసం, సమసమాజం కోసం, మనుషులంతా సమానమయ్యే రోజు కోసం కలలు కంటూ... క్షణక్షణం పాటగా బతికిన పెద్దన్న మహాప్రస్థానం ముగిసిపోయింది.

పెద్దన్న మరణవార్త తెలిసి... కొంతమంది ఉద్యమకారులు, కళాకారులు ఇంటికి వచ్చారు. పెద్దన్న రాసిన పాటలను గొంతెత్తి పాడారు. తన మరణానంతరం దేహాన్ని మెడికల్ కాలేజీకి రాసిచ్చాడు పెద్దన్న. మెడికల్ కాలేజీకి ఫోన్ చేసి చెప్పాడు రవీందర్. ఐతే బెంగళూరు కేసుకు సంబంధించిన ప్రొసీజర్ ఉందని... అది అయిపోయేదాకా బాడీని అప్పగించకూడదని పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఆ ప్రొసీజర్ ఐపోవడానికి మధ్యాహ్నం రెండుగంటల వరకూ పట్టింది. మెడికల్ కాలేజీ వాళ్లు పెద్దన్న బాడీని హ్యాండోవర్ చేసుకుని అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

తన గురువు, తండ్రిలాంటి పెద్దన్నను ఆఖరిసారిగా... కళ్లనిండా చూసుకున్నాడు రవీందర్.

ఆకాశం వైపు చూస్తూ... సూర్య చంద్రుల్లా మెరుస్తున్నాయి పెద్దన్న కళ్లు. ఆ కళ్లు ఇప్పటికీ ఏవో స్వప్నాలను కలగంటున్నాయి. ✿

## రచయిత గురించి...



చందు తులసిగా గుర్తింపు తెచ్చుకున్న రచయిత అసలు పేరు చంద్రశేఖర్. సూర్యాపేట సమీపంలోని బండమీద చందుపట్ల స్వగ్రామం. తొలుత పాత్రికేయుడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. జీవిత సహచరి తులసి పేరుతో కలిపి కథలు రాస్తుంటారు. మొదటి కథ ఊరవతల ఊడలమర్రి మంచి గుర్తింపు తెచ్చింది. పాలపిట్టల పాట కథ... నేషనల్ బుక్ ట్రస్ట్ కథా సంకలనానికి ఎంపికై వివిధ భారతీయ భాషల్లోకి అనువాదం అయింది. తల్లిగారిల్లు, నీళ్ళబిందె, బతుకమ్మ పుట్టింది లాంటి కథలు గుర్తింపు తెచ్చాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల జీవితాలను ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకుని కథలు రాస్తుంటారు. కళలు, సినిమా రంగం పట్ల ప్రత్యేక అభిరుచి. రేపటి కథ... శీర్షికన సారంగ పత్రికలో కొత్త తరం కథకులను పరిచయం చేశారు. యువ సాహిత్యకారులను ప్రోత్సహించడంలో ముందుంటారు.


9985583022

## రెడ్డి మోజుకు బలైన మాదిగ కనకవ్వ, కొండయ్య

ఎండపల్లి భారతి కథ మరపురాని కనకవ్వ (జూన్ 28)లో మహిళలతో మాట్లాడని అందగాడయిన నారాయణరెడ్డి– పదిమందిని ఒంటి చేత్తో కొట్టే బలశాలి, చెప్పినట్లు వినే భర్త వున్న మాదిగ కనకవ్వ మీద మోజు పడతాడు. భార్య రెడ్డిసానిని రాయబారానికి పంపిస్తాడు. అక్కా ఒప్పుకో అని బతిలాడితే, నీ కాపురం కోసం నా కాపురం ముంచుకుందునా కుదరదు, నా మొగుడు చంపేస్తాడని చెప్పిన కనకవ్వను, ఒక్కసారి కొంగు పరువు నీకు మూట వడ్లు యిస్తా, చీర, రైక ఇస్తా అని ప్రలోభపెట్టి, కనకవ్వకు ఇష్టం లేకున్నా ఆమె పేదరికాన్ని అలుసు చేసుకొని రెడ్డిసాని కనకవ్వను ఒప్పిస్తది. అప్పటినుంచి రెడ్డి ఇంట్ల ఏ పని వున్నా, చేసివచ్చే పనిమనిషే కానీ, రెడ్డి గౌరవంగా చెప్పుకునే ప్రేమికురాలు కాదు కనకవ్వ.

ఈ కథలో తాను సాయిబుపై మనసు పడిన విషయాన్ని రెడ్డిసాని కనకవ్వ ద్వారా రెడ్డికి చెప్పిస్తే, అది విన్న రెడ్డి కనకవ్వను చెడామడా తిట్టి, నా పెళ్ళాం నీ మాదిరి అనుకుంటివా అని అవమానిస్తాడు. నా పెళ్ళాం రెడ్డిసానే ఎక్కువ నువ్వు తక్కువ అనే తూస్కారమ్. ఇట్లాంటివి మీ తక్కువ కులాల ఆడవాళ్ళే గాని, మా కులం ఆడవాళ్లతో చేయనివ్వం అనే భావన. సమాజంలో ఒకే జెండర్ అయినా ఒకే విలువలు, అంతస్తులు వుండవు. కులాన్ని బట్టే జెండర్ విలువలు, వివక్షలు హెచ్చు తగ్గులు ఉన్నట్లు రెడ్డి మాటలు బలంగా స్పష్టం చేయిస్తాయి.

తీట్లో కొట్టి సాయిబుని తరిమేసిన రెడ్డిని, నాకో న్యాయమా? అని భర్తను నిలదీస్తది రెడ్డిసాని. నీ మాదిరి అనుకుంటివా? అని రెడ్డి చేసిన అవమానానికి నాకో విలువా, రెడ్డిసానికో విలువా అని రెడ్డిని నిలదీయలేక పోతది కనకవ్వ. ఇది కుల జండర్ అసహాయత, ఒక్క మాదిగ కనకవ్వకు సంబంధించిందే కాదు, కమ్యూనిటీపరమైన సుదీర్ఘకాల వ్యవస్థీకృత అణచివేతల అసహాయత. రెడ్డి తన భార్యతో సంబంధం ఉన్న సాయిబును తరి మేసి భార్యను కాపాడుకున్నట్లు, పదిమందినైనా ఒంటి చేత్తో తిప్పికొట్టే బలశాలి కొండయ్య, రెడ్డిని ఎందుకు తన్ని తరిమేయలే కపోయాడు? ఇక్కడ కూడా కొండయ్య వ్యక్తిగత అశక్తత కాదు. కులపరమైన సుదీర్ఘకాల దాష్టీకాల దౌర్జన్యాల అణిచివేతల వల్ల ఏర్పడిన అసహాయత. కొండయ్య ఈ అసహాయతతో భార్యను కొట్టి తిట్టాడే గాని, భార్య మీద లైంగిక ఆధిపత్యం చేసే రెడ్డిని నిలువరించలేకపోయాడు. చివరికి వున్న ఊరిని విడిచి కుటుంబంతో పారిపోయాడు. మాదిగ కనకవ్వను రెడ్డి బలవంతంగా లొంగతీసుకొని ఉంచుకోవడం వల్ల, అతనికి జరిగిన నష్టమేమీ లేదు. కానీ రెడ్డి ఉంచుకున్న మాదిగ కనకవ్వకు భర్త చేతిలో దెబ్బలు, ఊరు, వాడ, కుటుంబం ఛీత్కారాలు అవమానాలు మిగిలాయి. భర్తకు ఇతరులకు





తెలవకుండా రెడ్డిసాని, సాయిబుతో ఉండి తర్వాత ఆ సంబంధాన్ని వొదులుకున్న స్వతంత్రత, మాదిగ కనకవ్వకు లేదు. ఆమె పెనిమిటితో దెబ్బలు తిన్నా, ఊరువాడల్లో అవమానాల పాలైనా, తప్పించుకొని పుట్టింటికి పోయినా, ఎలుకను పిల్లి వేటాడిన, వెంటాడిన ఆధిపత్య కుల, మగ లైంగిక వుచ్చు నుంచి విడివడే స్వతంత్రం లేని, విడిపించే సొంత మగ దిక్కులేని అసహాయ జండర్, కులం కనకవ్వది.

మాదిగ ఆడవాళ్ళ లైంగికతల మీద, తమ మగవాళ్ళ కంటే ఆధిపత్య కుల మగవాళ్ల అజమాయిషి వ్యవస్థీకృతంగా నడుస్తున్నదనేది ఈ కథలో చూస్తాము. సవర్ణ పితృస్వామ్యమే సర్వాధిపత్యాల, సార్వభౌమాధికారం వున్న పితృస్వామ్యం అనీ, మాదిగ కొండయ్య రెడ్డి అనే ఇద్దరి మగవాళ్ళ పితృస్వామ్యము ఒక్కటే కాదనేది ఈ కథ ద్వారా అర్థమైతది. ఈ కథల అద్దు, పొద్దు, దుడ్డు, కులం పెండ్లి, సరోళ్ళు, బరోళ్ళు వీటిని తుంగలో తొక్కి రెడ్డి అనుకున్నది చేసిండు. మాదిగ కనకవ్వ, కొండయ్యల జీవితాలే విధ్వంసమయ్యాయి.

– జూపాక సుభద్ర



# మరో రోజు మొదలైంది..

మణి వడ్లమాని
9652067891

కథ

తెల్లని అక్షరాలతో వున్న బోర్డుని చేతి గుడ్డతో శుభ్రంగా తుడిచి, ఒకసారి దానివంక అభిమానంగా చూసుకుంది సీతమ్మ.

ఎప్పటిలాగే ఉదయాన్నే నాలుగున్నర కల్లా స్నానం కానిచ్చి, తన సరంజామాతో, రమణయ్య రిక్షాలో రేవు దగ్గరికొచ్చేస్తుంది. అతను ఆమెకి నమ్మిన బంటు. ముందుగా కొట్టు శుభ్రం చేసుకుని, దేవుడి పటాలకు పూల దండలు వేసి, దీపం వెలిగించి అగరబత్తుల ధూపం వేసి, తన వ్యాపారం బాగా సాగాలి.. అందరూ క్షేమంగా వుండాలి, ఆ గోదారి తల్లి చల్లగా చూడాలని నమస్కారం పెట్టుకుంటుంది. ఇహ ఆ తర్వాత ఇంటి నుంచి తెచ్చుకున్న ఇడ్లీ పిండితో వాయలు దింపుతుంటే, ఆ సువాసన ఆకలికే ఆకలి పుట్టించేటట్లు వుంటుందంటే అతిశయోక్తి కాదు. ఒక్కొక్కళ్ళుగా వచ్చి ఇడ్లీలు తింటూ, "అబ్బ.. నీ చేతిలో అమృతం వుంది సీతమ్మా!" అని పొగిడితే, వినేసి ఓ నవ్వు నవ్వుతుంది.

● ● ●

'ఏరా రమణయ్యా, ఇప్పటిదాకా రాలేదే!' అని పక్కనున్న గిన్నె మూత తీస్తూ అంది ఆగిన రిక్షా చప్పుడు విని. అలసటతో చెమట తుడుచుకుంటూ వుస్సూరుమంటూ రమణయ్య వచ్చాడు. 'ఇదిగో ముందు ఈ మంచినీళ్ళు తాగు' ఆమె ఇచ్చిన నీళ్ళు అందుకుని గటగటా తాగి 'అబ్బా! మన గోదారి నీళ్ళు ఓ గ్లాసుడు తాగితే ఆకలి దప్పులే వుండవు' అంటున్న అతని చేతికి నాలుగు వేడి వేడి ఇడ్లీలు, ఇంత అల్లం పచ్చడి వేసిన ఆకు ఇచ్చి 'ఇది తిని మాట్లాడు' అంది. మారు మాట్లాడకుండా అందుకున్నాడు. బల్ల దగ్గర కూర్చుని, ఇడ్లీ ముక్క తీసుకుంటూ.. 'ఈ ఇడ్లీ వాసన దూరం నుంచి వచ్చినా కడుపు నిండిపోతుంది. నీ చేతి వంటే పుష్కరాల కన్నా, పుణ్యం కన్నా మహత్తరమైంది' అన్నాడు నవ్వుతూ.

'హా.. హా.. పుష్కరాలు పుణ్యం, నా ఇడ్లీలు తింటే వస్తుందా? అయ్యో అంత మాటకాదు కానీ, నా వంట మీ అందరికీ నచ్చడం నా భాగ్యం.' అంది సీతమ్మ.

కొంతసేపటికి రమణయ్య వెళ్ళిపోయాడు. సీతమ్మ కూడా పది గంటలకు కొట్టు కట్టేసి వెళ్ళిపోయింది. ఇంటికెళ్ళి మళ్ళీ మూడు గంటలకల్లా తిరిగి వస్తుంది.

● ● ●

ఆకాశం మబ్బుపట్టి ఉంది. ఉదయం కరిగి, మధ్యాహ్నం మొదలవ్వబోతున్న వేళైనా వాతావరణం చల్ల చల్లగా ఉంది. ఉండుండి వీస్తున్నగాలి హాయి గొలుపుతోంది. వర్ష ఋతువు కదూ. అందులోనూ కొండలు కోనల నుంచి, ఉరుకుతూ పరుగులు తీస్తూ ఎర్రటి నీళ్ళతో కళకళ్ళాడిపోతూ ఉంది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఈ ఋతువులో నిండు అందం గోదారమ్మది. ఆ గోధూళివేళ గోదావరి అలలపై విద్యుద్దీపపు కాంతులు ఆకాశంలోని నక్షత్ర కన్యలతో పోటీ పడుతున్నాయి. సాయంత్రం అయ్యేసరికి రేవు అంతా దీపాల తోరణాలతో పట్టపగలులా వుంది. నదిలో తేలుతున్న దీపాల వెలుగులు రేవు మీద తళుక్కుమన్నాయి. పిల్లలు, పెద్దలు స్నానాలు చేస్తూనే వున్నారు. చేసినవాళ్ళు బట్టలు మార్చుకుని, అక్కడున్న మెట్ల మీద కూర్చుని వున్నారు. ఓ పక్కన గుడిలో హరికథ చెబుతున్నారు, ఇంకో పక్కన భజన చేస్తున్నారు. ఆ పుష్కర సందడంతా కళ్ళల్లో నింపుకుంటూనే పనులు చూసుకుంటోంది సీతమ్మ. అదే సమయానికి ఓ వృద్ధుడు అక్కడికొచ్చాడు. చూడటానికి బైరాగిలా వున్నాడు. నీళ్ళతో తడిసి, వణుకుతున్న కాళ్ళు. స్నానం చేసి వచ్చినట్లున్నాడు.

'అమ్మా, కొంచెం నీళ్ళిస్తావా?' అనడిగాడు.

'ముందు ఆ పక్కగా కూర్చోని నీళ్ళు తీసుకోండి, ఆ తర్వాత వేడి వేడిగా టీ తాగండి, ఇడ్లీ తినండి. మా ఇడ్లీ సెంటర్‌లోకి వచ్చినవాళ్ళను, ఆకలితో పంపము' అంది చిరునవ్వుతో. అతను నెమ్మదిగా తిన్నాడు. టీ కూడా తాగి సీతమ్మ వైపు చూసి చెప్పాడు,

'అమ్మా నీ నవ్వు.. గోదావరంత చల్లగా వుంది తల్లీ'. ఆ మాటలు విన్న సీతమ్మ నవ్వింది.

'మీరు కూడా పుణ్యస్నానం చేశారుగా తాతయ్యా! గోదావరి నీళ్ళు మనందరికీ ఆశీర్వాదం.'

● ● ●

మరుసటి రోజు ఉదయం రమణయ్య, సీతమ్మని కొట్టు దగ్గర దింపేసి, తొందరగా బయలుదేరాడు. ఎప్పటిలాగే 'సీతమ్మ ఇడ్లీ సెంటర్' బోర్డుని శుభ్రంగా తుడుచుకుంది.

'ఈ రోజు జనం ఇంకా ఎక్కువ వస్తారని అనుకుంటున్నారు' అన్నాడు.

'ఇదిగో.. మొదటి వాయ అయిపోయింది. ఐదు నిముషాలు తినేసి వెళ్ళిపో'

'తర్వాత తింటాను సీతమ్మా! స్టేషన్ కాడ గిరాకీలు బాగా దొరకుతాయి' అంటూ నవ్వి బయలుదేరాడు. పుష్కర సంబరంతో రేవు నిద్రపోవటం లేదు. తెల్లవారు ఝామున రెండు గంటల నుంచే దీపాలు, పూజార్ల మంత్రాలు, యాత్రికుల హడావుడి. జనం భక్తి ఉత్సాహంతో గోదావరి వైపు సాగుతుంటే, మధ్యాహ్నం అయ్యేవరకూ సీతమ్మకి కూడా ఊపిరి సలపనంత గిరాకీ. ఇక తెచ్చిన పిండి అయిపోడంతో కొట్టు మూసేసి, గోదారి వైపు చూస్తోంది.

అంత హడావుడిలోనూ, ఆమె గుండెలో ఏదో వెలితి, శూన్యం.

● ● ●

పన్నెండేళ్ళ సీత గలగలా నవ్వుతూ అందరినీ ఇట్టె మాటలతో ఆకట్టుకుంటుంది. కొంతకాలానికి పెళ్ళయింది. పెళ్ళికొడుకు పేరు రామయ్య. తను పెద్దదై, అత్తవారింటికి కాపురానికి వెళ్ళేసరికి ఆ మొగుడు కాస్తా దేశాంతరం వెళ్ళాడని కొందరు, కాదు కాదు బైరాగుల్లో కలిసిపోయాడని మరికొందరు, ఇంకొందరేమో కాదు అతడిని రాజమండ్రి దగ్గర గోదారొడ్డున స్టేషన్‌లో చూసామని అనడంతో, భర్త కనిపిస్తాడేమోననే ఆశతో ఇక్కడకు వచ్చి, ఇదిగో ఈ రేవు దగ్గర ఇడ్లీ కొట్టు పెట్టింది. గోదారొడ్డుకు వచ్చేవాళ్ళే కాదు, చుట్టుపక్కల ఊర్ల నుండి పనుల కోసం రైలు దిగేవాళ్ళకి, తిరిగి పని ముగించుకుని రైలెక్కే వాళ్ళక్కూడా సీతమ్మ చేసే ఇడ్లీతో పాటూ ఘాటైన అల్లం పచ్చడి అంటే ఇష్టం. ఎప్పటిలాగే రోజూ సాయంత్రం వచ్చే రమణయ్య రాలేదు. కానీ ఒక పోలీస్ జీపు సీతమ్మ ఇడ్లీ కొట్టు ముందాగింది. ఒక కానిస్టేబుల్ దిగి లోపలికొచ్చాడు. వెంటనే వాళ్ళని చూసి "ఇప్పుడే పొయ్యి మీద పెట్టాను, ఐదు నిముషాలు ఓపిక పట్టండి సార్! వేడివేడిగా పెట్టేస్తాను' అంటున్న ఆమె మాటలను మధ్యలోనే ఆపుతూ..

'అమ్మా, మీరు సీతమ్మనా?' అనడిగాడు కానిస్టేబుల్.

'అవును బాబూ..'

'గోదావరిలో మీ కొట్టుకు వచ్చే రిక్షా అతను మునిగిపోయాడట.. ఎవరో పిల్లాడు, స్నానానికి దిగాడట. ఆ పిల్లాడు నీటిలో మునిగిపోతుంటే రక్షించడానికి వెళ్ళి, సుడిగుండంలో చిక్కుకు పోయి, చచ్చిపోయాడు. ఆ పిల్లాడు మటుకు బతికాడు. ఈ నీలిరంగు రిక్షా అతనిదే కదా?' ఆ మాటలకు సీతమ్మ చేతులు వణికాయి.

'మా రమణయ్యా..?'

'అవునమ్మా! అతని శవం దొరికింది, మీరు గుర్తించగలరా?' అంటున్న పోలీసు మాటలకు సీతమ్మకు దుఃఖం పెల్లుబుకింది. అవి కన్నీళ్ళు

**తరువాయి 16 లో**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

( 4 వ పేజీ నుంచి)

# మరోరోజు మొదలైంది..

కాదు, ఆ కళ్ళలో మొత్తం గోదావరే.

● ● ●

మరుసటి రోజు ఉదయం రేవులో అదే దృశ్యం. ఎక్కడ చూసినా జనాలు, స్నానాలు చేసేవాళ్ళు చేస్తున్నారు. చేసినవారు మెట్ల దగ్గరున్న గుడివద్ద గుంపులు గుంపులుగా వున్నారు. సీతమ్మ కొట్టు దగ్గర అదే దృశ్యం.

'సీతమ్మ ఇడ్లీ సెంటర్' బోర్డు తుడుస్తోంది. కానీ ఆ చేతుల కదలికల్లో నిర్లిప్తత. అదే సమయానికి నిన్నటి వృద్ధుడు మళ్ళీ వచ్చాడు.

'అమ్మా! నిన్న నన్ను తీసుకెళ్ళిన అబ్బాయి పోయాడట కదమ్మా. పైగా అన్నాడు, ''తాతయ్యా! నీవు పుణ్యస్నానం చేయి, నేను వచ్చి తీసుకెళ్తా''నని. కానీ తిరిగి రాలేదు అన్నాడు. సీతమ్మ దుఃఖాన్ని నిగ్రహించుకోలేక బావురుమంది.

''గోదారమ్మా! రమణయ్య జీవితమంతా ఇతరులను మోశాడు.. ఇప్పుడు నువ్వే అతన్ని తీసుకునిపోయావా! ఇన్నాళ్ళు తోడుగా వుండేవాడు. నా ఒంటరి బతుకులో దీపంలా వచ్చాడు. కానీ ఒక్కమాట చెప్పేవాడు. 'కష్టాలకు, బాధలకు లొంగకుండా ఎదిరించి నిలబడాలి' అని. పైగా 'నువ్వు సీతమ్మవి, నేను నీ బంటుని' అంటుండేవాడు. ఆ రాత్రి సీతమ్మ నది దగ్గరకెళ్ళి ఒక దీపం వెలిగించి వదిలింది. గోదావరి మీద ఆ దీపం తేలుతూ దూరం పోతుంది. నదిలో తేలుతూ వెళుతున్న దీపం ఓ కొత్త అర్థాన్ని తెలిపింది. మానవ జీవితం ఈ గోదావరిలా ఓ చైతన్య స్రవంతి. అది ఎప్పటికీ నడుస్తూనే వుంటుంది. మనుషులు వస్తారు, వెళ్ళిపోతారు. గోదావరి మటుకు నిత్య నూతనం.

● ● ●

పుష్కర సమయంలో సూర్యుడు ఉదయించక ముందే లేచి, నదిని స్మరిస్తూ స్నానం చేస్తున్నారు భక్తులు. రేవులో ఒకటే సంబరం.. ఒకటే సందడి. పెద్ద, చిన్న, ముసలి, ముతక అబ్బో అదో జన ప్రవాహంతో పాటు ఆగకుండా సాగిపోయే ప్రవాహపు గోదారమ్మ,

పక్కనే సీతమ్మ ఇడ్లీ సెంటర్‌లోంచి, ఇడ్లీలతో పాటూ పచ్చి అరటాకుల సువాసన కలిపి వస్తున్నాయి. అందుకోసమే జనాలు అక్కడికి వెళుతున్నారంటే అతిశయోక్తి కాదేమో!

సీతమ్మ చెమట తుడుచుకుంటూ, స్టౌ పైన ఇడ్లీల వాయ దింపుతూ.. 'కిట్టయ్యా! అదిగో చెట్టు కింద కూర్చున్నవాళ్ళకి మూడు ప్లేట్లు ఇడ్లీ, ఒక టీ ఇచ్చి రా!' అంది.

'అలాగే అత్తా' అన్నాడు. 'హే సొట్ట కిట్టిగాడు కుదిరాడా పనిలోకి' అన్న లాంచీల గుమస్తా గవర్రాజు మాటలకి చివ్వున చూసింది. సీతమ్మ.

చురుక్కున తగిలిన ఆ చూపుకి అతను కళ్ళు దించుకుని 'పోనీలే మంచిపని చేసావు' అంటూ గబగబా తినసాగాడు. కిట్టయ్య కాలు ఈడుస్తూ నడుస్తాడు. అక్కడే గోదారి మెట్ల మీద పడుకుంటాడు. వాడిని పిలిచి అప్పుడప్పుడు టిఫెన్ పెట్టేది. ఆ రోజున కొట్టు కట్టేస్తూ వాడికి ఇడ్లీ పొట్లం చేతికిచ్చేసరికి 'పాపం రమణయ్య పోయాడుట కదా అత్తా' అంటూ భోరున ఏడ్చాడు. ఆ ఆత్మీయతకు సీతమ్మ కరిగి, కన్నీరై అక్కడ మరో గోదారయింది.

● ● ●

'ఈ పుష్కరాల రోజుల్లో కస్టమర్లు ఎక్కువగానే వున్నారు కదా, సీతమ్మా!' అంటున్నారు ఎవరో.

'ఈ సీతమ్మ చేతి ఇడ్లీలు తిని, ఒక చెంబుడు గోదావరి నీళ్ళు తాగితే నా సామిరంగా కడుపు నిండిపోతుంది.'

'మరే! స్వర్గం కనిపిస్తుంది' మరెవరో అంటున్నారు. అందరి మాటలు వింటూ సీతమ్మ ఎప్పటిలాగే నవ్వుకుంటూ పని చేసుకుంటోంది.

కిట్టిగాడు ఆర్డర్లు తీసుకుంటూ, అందరికీ ప్లేట్లు అందిస్తున్నాడు. సీతమ్మ కొట్లోంచి వస్తున్న ఇడ్లీల వాసనలతో రేవంతా ఘుమఘుమలాడింది.

గోదారమ్మ కూడా ఆ కబుర్లు విని గలగల మంది. అసలే కొత్త నీరు ఉధృతంగా చేరుతోందేమో, ఆ తాకిడికి పాత నీరు కొట్టుకుపోయింది.

✦

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# హంసల వెండి కంచం

- సుజాత వేల్పూరి

"నాన్న బట్టలు చాలా ఉన్నాయి కదా, అవన్నీ ఆ సుబ్బారెడ్డి నడిపే అనాథాశ్రమానికి ఇయ్యండమ్మా, ఎవరో ఒకరు వేసుకుంటార్లే" తేలిగ్గా అన్నాడు బావ కేశవ్, నా భర్త అన్న. అన్ని కార్యక్రమాలూ అయిపోతే త్వరగా బెంగళూరు వెళ్ళిపోవాలని మనసులో తొందర పడుతున్నాడు. ఆస్తుల పంపకాలు తల్లి ఉన్నంత వరకూ ఏమీ ఉండవని తనకి తెలుసు.

"నాన్న వస్తువులు నేనైతే ఏమీ తీసుకెళ్ళే పరిస్థితి లేదు లేరా. తీసుకుపోయి గుర్తుగా రోజూ చూసుకునేంత నోస్టాల్జిక్ ఫీలింగ్‌తో సతమతమైపోవాలని లేదు" ఆడపడుచు గాయత్రి అంది.

"అది సరే, ఈ మంచం అదీ తీసుకుంటారా వాళ్ళు? అసలు ఈ గదంతా మంచమేనాయె. ఇచ్చేస్తే పోలా? చాలా పెద్దది కదా?" కేశవ్ బావ అన్నాడు చుట్టూ చూస్తూ.

"అవును, ఈ మంచం తీసేస్తే సగం గది ఖాళీ అవుతుంది. అమ్మ ఒక్కతే హాయిగా ఉండొచ్చు" చటుక్కున అనేసి, నేను వారింపుగా చూసేసరికి నాలుక్కర్చుకున్నాడు కౌశిక్.

"నాన్న మెడలోని గొలుసు మా నిహాల్‌కి ఇస్తానన్నారు పోయినసారి వచ్చినపుడు.. ఎక్కడ ఉందమ్మా?" గాయత్రి.

"దానితో నీక్కొంత నోస్టాల్జిక్ ఫీలింగ్ వస్తుంది లేవే అక్కా, బంగారం కదా?" వెక్కిరింతగా నవ్వాడు కేశవ్.

అత్తయ్య ఏమీ మాట్లాడలేదు. కిటికీ దగ్గర కూచుని బయటికి చూస్తోంది. బాధపడుతుందేమో తెలీడం లేదు. దగ్గరికివెళ్ళి భుజంమీద చేయివేసి ఆమె చూస్తున్న వైపు చూశాను.

పెరట్లో గౌరమ్మ గిన్నెలు తళతళలాడేట్టు తోమి కడిగి గట్టు మీద బోర్లిస్తోంది. బావి నుంచి బిగించిన మోటర్ దగ్గర కుళాయి తిప్పి, గట్టంతా కడిగి చేతులు కొంగుకు తుడుచుకుంటూ లేచింది. గౌరమ్మ తోమకుండా వదిలేసిన ఆ కంచం నా దృష్టిని దాటి పోలేదు.

మొన్న రాత్రి మా మామగారు భోజనం చేసిన వెండి కంచం!

ఆయన నిన్న ఉన్నాడు.. ఇవాళ లేడు!

అత్తయ్య కొంచెం కదిలి "గౌరమ్మా, కడిగెయ్ అది కూడా. ఇప్పుడు నిన్నెవరూ అడ్డు పెట్టరు" అంది. గొంతు కొంచెం రుద్ధమైంది.

గౌరమ్మ తలెత్తి అత్తయ్య వైపు ఒక్క క్షణం చూసి 'వొద్దు' అన్నట్టు చెయ్యి తిప్పి, పక్క సందులో నుంచి బయటికి వెళ్ళిపోయింది. అత్తయ్య నిట్టూర్చింది.

"దానికి ఎంత భయం, ఎంత గౌరవం చూడు మీ మామయ్యంటే."

ఆ వెండి కంచం ఒక పెద్ద సబ్జెక్ట్ అక్కడ! ఆ ఇంట్లో మనుషుల కంటే విలువ ఎక్కువ. మా తాత కంచం, మా ముత్తాత చేతికర్ర, మా నాన్న పడక్కుర్చీ అంటూ చాలా ఇళ్లలో తరతరాలుగా వాళ్ళ గుర్తులకు ఎనలేని విలువ ఆపాదించి అందరి మీదా రుద్దటం, ఇంట్లో అందరూ అది నిజమని నమ్ముతూ వాటిని గౌరవిస్తుండటం సహజ కుటుంబ చరిత్రల పరిణామం. ఈ ఇంట్లోనూ అంతే!

ఆ వెండి కంచం బరువు దాదాపు కిలోన్నర. ఒకరోజు అత్తయ్య అత్యంత శ్రద్ధపెట్టి బూడిదతో తోమింది. మెరిపిస్తుంటే చూశాను దాని సౌందర్యం. విస్తరాకు ఆకారంలో, హంసలూ, లతల డిజైన్లు ఒంటి నిండా అలంకరించుకుని ఠీవీ ఒలకబోస్తోంది. మధ్యలో చిన్న బంగారం పువ్వు. మా మామగారి తండ్రికి పెళ్ళిలో వాళ్ళ నాన్న బహుమతిగా ఇచ్చాడట. అంటే దాని వయసు వందేళ్ళుం టుందేమో! అందుకే దానికంత విలువ. దానికి యాంటిక్ వాల్యూ ఉందా లేక, ఈ యాంటిక్ మనుషులు ఆ 'వంశ గౌరవం' పేరుతో ఆ లోహానికి ఇచ్చుకున్న విలువా అనేది నాకర్థం కాలేదు మొదట్లో.

దాన్ని శుభ్రం చేశాక డైనింగ్ టేబుల్ పక్కనే ఉన్న స్టాండ్ మీద, మెత్తటి టర్కీ టవల్ వేసి దాని మీద బోర్లించి ఉంచేవాళ్ళు. దాని పక్కగా నడుస్తూ ఉంటే, స్వయంగా దాని యజమాని తేరిపార చూస్తున్నట్టు జలదరింపు తెప్పించేది.


నిజానికి, ఈ ఇంటికి నేను తరచుగా రానే లేదు. ఉద్యోగంలో బిజీ ఉండటం ఒక కారణమైతే, ఆ ఇంటి వాతావరణం నా ఒంటికి పడకపోవడం మరోటి.

"వాడిష్టపడిన పిల్ల కదాని ఒప్పుకుంటే, ఎంత గీర చూపిస్తుందో! వ్రతాలు నోములూ అంటే రానే రాదు. నా కలవాటు లేదు.. అని మొహాన్నే చెప్పేస్తుంది. ఆ పెంపకం అలా ఏడిసింది" అని నన్నూ, మా అమ్మానాన్ననూ కూడా తిట్టి తృప్తి పడేవాడు ఆ పోయిన మనిషి. ఆయన్ని గౌరవించాలని నేను చేసిన సహజ ప్రయత్నాలన్నిటినీ ఆయన ఇదే విధంగా తిరగ్గొట్టాడు.

అత్తయ్య, ఆయన్ని సపోర్ట్ చేస్తున్నట్టు చూస్తూ మౌనంగా నిలబడేది.

అసలు ఆ వెండి కంచం చరిత్రే ఆ ఇంటి చరిత్ర అన్నట్టుండేది అక్కడి యవ్వారం. ఎవరైనా చుట్టాలొస్తే, భోజనాల దగ్గర మొదలవుతుంది చరిత్ర పారాయణం. మామగారు మాట్లాడేటపుడు ఇంకెవరూ నోరెత్తడానికి లేదు. అదొక శాసనం. ఇలాంటి శాసనాల్ని మొదట్లో అంగీకరించి, వాటిని రాజ్యాంగంగా మార్చే వాళ్ళ లొంగుబాటు మీద నాకు అసహ్యం, అది ఏ ఇల్లయినా సరే!

వాళ్ల తాతగారి కరణీకం నుంచి మొదలై తన తండ్రి హయాంలో కరణీకాలు పోయిన దారుణ ఘటన వైపుగా, తన రిటైర్‌మెంట్




వరకూ జరిగిన చరిత్రలో ఆ వెండి కంచపు భోజనాల చరిత్ర మొత్తం మళ్ళీ మళ్ళీ రిపీట్ అయ్యేది.

వాళ్ళ తాతగారు కరణంగా చేస్తున్నపుడు, ఎవరిదో భూమి సమస్య పరిష్కరిస్తే, ఆ రెడ్డి గారో చౌదరి గారో ఎవరో రెండు కిలోల వెండి బహుమతిగా ఇచ్చారట. అందులో కొంత వెండితో ఆయన కంచం చేయించుకున్నాడట. మిగిలిన దానితో ఇంట్లోకి పూజ సామాన్లు!

ఆ కంచాన్ని తన తండ్రి పెళ్ళయ్యాక ఆయనకిస్తే ఆయన్నుంచి తనకి వారసత్వంగా వచ్చిందట. ఇదంతా ఒకెత్తయితే, ఆ వెండి కంచాన్ని తోమి కడిగి శుభ్రంగా ఉంచడానికి కూడా ఆ ఇంటావిడో, కోడళ్ళో, లేదా కూతుళ్ళో చేయాలి తప్ప పనివాళ్ళెవరూ ముట్టుకోరాదని అది చేయించినపుడే నిర్ణయమైందట.

రెండేళ్ళ క్రితం ఒకసారి నేనూ, కౌశిక్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈ వారం కథ



వచ్చినపుడు, అంట్ల గిన్నెలు పెరట్లో వేస్తూ ఆ కంచం కూడా అన్నిటితో కలిపి వేస్తుంటే, అత్తయ్య గావుకేక పెడుతూ వచ్చి పెరట్లో పడింది. హడలి పోయాను ఏం జరిగిందోనని!

"ఆ కంచం మీ మావయ్య గారిది."

"తెలుసు, ఐతే?"

"పనివాళ్ళు కడగడానికి వీల్లేదు."

"ఏం?"

నిలువు గుడ్లేసుకుని చూసింది.

"ఏం ఏంటి? కౌశిక్ చెప్పలేదా?"

కౌశిక్ చెప్పడమేంటి? ఆ కంచానికి గానీ, కంచం యజమానికి గానీ ఏమైనా ఎలర్జీలున్నాయా? ఏం చెప్పాలి నాకు? కంచం గురించి మాట్లాడుకోవడమే టాపిక్కా. మాకు?

"ఏం చెప్పాడు కౌశిక్ కంచం గురించి" విసుగ్గా విస్మయపడ్డాను.

"అది మీ మామగారి తాతగారి కంచం.." అంటూ మొదలెట్టింది.

చాలాసేపు దాని చరిత్ర గానం చేసిందావిడ. ఆ చరిత్ర మొత్తం ఆమె నెత్తి మీద ఎలా రుద్దారో అర్థమైంది. ఆవిడ ఆ రుద్దుడుని ఒక ప్రివిలేజ్‌గా భావిస్తోందని నాకర్థమైంది. చదువుకుని ఉద్యోగాలు చేసే స్త్రీలను సైతం కుటుంబ వాతావరణం ఎలా బురదలోకి తొక్కగలదో ఆవిడను చూస్తే తెలుస్తుంది.

"గౌరమ్మ పన్లో చేరిన కొత్తల్లో ఒకసారి మిగతా అంట్ల గిన్నెలతో సహా దాన్ని కూడా తోమడానికి తీసుకుపోతే అప్పుడే స్నానం చేసి వస్తోన్న మీ మామయ్య అది చూసి నన్ను నానా తిట్లూ తిట్టారనుకో. 'ఆ అలగాదాని చేత్తో తోమిస్తావా, నీకసలు బుద్ధుందా? అసలు నిన్ను అనాలి, కళ్ళు నెత్తికెక్కాయా లేక నిర్లక్ష్యమా?' అని అబ్బ ఎలా తిట్టారనుకున్నావ్?"

"అలగా దాని చేత... అలగా దాని చేత.." ఆ వాక్యం తర్వాత నా మెదడు ఆవిడ మాటల్ని తీసుకోవడం మానేసింది.

ఆ అలగా దాని చేత ఇంట్లో సర్వ కార్యాలూ చేయించుకుంటారు. పూజ సామాను మొత్తం అత్తయ్య బయట పెడితే గౌరమ్మ చింతపండు ఉప్పు కలిపి, ఇత్తడి సామానుని బంగారంలా మారుస్తుంది. అత్తయ్య చాలా సహజంగా వాటి మీద పసుపు నీళ్ల జల్లి తీసుకుని పూజకి వాడుతుంది. అలా ఎందుకు అనే ప్రశ్న అత్తయ్య పుట్టింట్లోనూ అత్తింటిలోనూ కూడా ఎప్పుడు రేగలేదు కాబట్టి ఆవిడా దాన్ని సహజం అనుకుంది.

ఒక్కరోజు ఆ 'అలగా మనిషి' రాకపోతే ఆ ఇల్లు నడక మానేసి పడుకుంటుంది. గౌరమ్మ ఎందుకు వస్తుందంటే, వాళ్ల మూడు సెంట్ల స్థలానికీ మా మామగారు పట్టా చేయించి ఇచ్చాడు.. ఆ కృతజ్ఞతతో.

"అలగా దాని చేత" అనే మాట చాలాసార్లు గౌరమ్మ చెవిన పడే ఉంటుంది. పడాలనే కూడా అనుంటాడాయన. అదంతా గుర్తొచ్చి నిన్న సాయంత్రం దహనమై బూడిదైపోయిన మనిషి మీద ఇప్పుడు ఆగ్రహం, అసహ్యం ముంచుకొచ్చాయి.

ఆవిడ బాధలో ఉందేమో ఆ క్షణంలో అన్న ఆలోచన కూడా రాలేదు. ఆవిడ భుజం మీద పడిన చెయ్యి నెమ్మదిగా వెనక్కి తీసుకున్నాను.

ముందు గదిలోకి వచ్చాను. గౌరమ్మ ఆరేసిన బట్టలు తీసి మడత పెడుతోంది. అందులో ఆయన బట్టలు కూడా ఉన్నాయి. 'అలగా మనిషి' ఉతికిన బట్టలు పనికొస్తాయి. అలగా మనిషి తోమిన మిగతా గిన్నెలు వంటకి పనికొస్తాయి. కానీ కంచం మాత్రం తినడానికి పనికి రాదు.

ఇల్లంతా తళతళలాడేలా ఊడ్చి, తడిబట్టతో తుడిచి, మొక్కలకు నీళ్ళు పెట్టి, "బట్టలీడ పెడతానమ్మా, తీసుకోండి చిన్నమ్మా" నా వైపు చూసి నవ్వి, కొంగుతో మొహం తుడుచుకుంటూ గేటు తీసి ముందుకు కదిలింది గౌరమ్మ.

"మైల ఇంట్లో నేను చెయ్యను" అని గౌరమ్మ మానేస్తే? ఈ కొంప నిజంగానే కొల్లేరై పోతుంది.

కానీ గౌరమ్మ అనదు. పెద్దాయన తన ఇంటిని నిలబెట్టిన మనిషిగా పూజిస్తుందో, ఆరాధిస్తుందో తెలీదు. ఎలాటి భావమూ లేకుండా తన పని చేసుకుని వెళ్ళిపోతుంది. మళ్ళీ సాయంత్రం వచ్చి, వెండి కంచం మినహా గిన్నెలన్నీ కడిగి సంధ్య కసువు వూడ్చి వెళ్తుంది. పదిహేనేళ్ళుగా గౌరమ్మ విధులు అవే ఆ ఇంట్లో.

• • •

పిండ ప్రదాన కార్యక్రమాలన్నీ ముగిశాయి.

"గుడిలో ఒక రోజు నిద్ర చేసి రండమ్మా, తర్వాత మీరు ఎవరింటికి వెళ్లాలన్నా సమస్య ఉండదు" అన్నాడు ఇంటి బ్రాహ్మడు.

మామయ్య బట్టలు, వస్తువులు అవసరమైన వాళ్ళకి పంచేసింది అత్తయ్య.

"ఏదో ఒకటి గుర్తుగా ఉండనివ్వమ్మా" అన్నాడు కేశవ్ నెమ్మదిగా.

"ఆయన మాటలూ, చేతలూ అన్నీ పదిలంగా గుర్తుగా వదిలేసి వెళ్లారు లేరా. వస్తువులెందుకు" చిన్నగా నవ్వింది.

"నాన్న వెండి కంచం ఏం చేస్తావ్ మరి?"

"ఉంటుంది బీరువాలో.. ఉండనీ" అంది భావరహితంగా.

"నాకిచ్చెయ్యమ్మా, నేను వాడుకుంటా. మా ఆవిడ నీలా పంచభక్ష్య పరమాన్నాలు వండక పోయినా, వండిందేదో దాంట్లో తింటాను" అన్నాడు జోకేసినట్టు పగలబడి నవ్వుతూ నా తోటికోడలి కేసి చూస్తూ. సరోజ మొహం కఠినంగా పెట్టుకుని కేశవ్ జోక్‌ని తిరగ్గొట్టింది.

అత్తయ్య ఎందుకో ఒప్పుకోలేదు.

"ఒద్దులేరా, మీ నాన్నకి ఆ కంచమంటే చాలా ప్రేమ, ఇంకా చెప్పాలంటే వ్యసనం. ఉండనీ ఇక్కడే.. నేనున్నంత వరకూ.. తర్వాత ఏదో ఒకటి చేసుకోండి."

అప్పటిదాకా మౌనంగా ఉన్న కౌశిక్, "ఈ ఇంటికి గౌరమ్మ చేసినంత సర్వీస్ ఎవరూ చెయ్యలేదు. గౌరమ్మకి ఏదైనా ఇవ్వాలి నాన్న గుర్తుగా" అన్నాడు వాళ్ల మాటల్లో తల దూరుస్తూ.

"ఇద్దాం లేరా, గౌరమ్మ నాతోనే ఉంటుందిగా.. నేను చూసుకుంటాన్లే."

ఆ రోజు రాత్రి నన్నూ, సరోజనీ పిల్చి, "మామయ్య వెండి కంచం గౌరమ్మకి ఇచ్చేస్తున్నాను. అది ఇక ఈ ఇంట్లో వద్దు" అంది అత్తయ్య.

ఇద్దరం ఒకేసారి తెల్లబోయాం!

మళ్ళీ తనే అంది. "గౌరమ్మకి ఏమిచ్చినా రుణం తీరదు. నా పసుపు కుంకుమ కింద వచ్చిన ఇంటి స్థలం తనకే ఇద్దామనుకుం టున్నాను. ఇప్పుడు మాత్రం ఆ కంచాన్ని గౌరమ్మకి ఇచ్చేస్తున్నాను. రేపు పని పూర్తి చేసుకుని వెళ్ళేటపుడు సంచిలో పెట్టి ఇస్తాను. మీ ఇద్దరికీ అభ్యంతరాలు లేవుగా? నా కొడుకుల సంగతి వదిలేయండి."

"మాకేం అభ్యంతరం లేదు" ఇద్దరం ఒకేసారి అన్నాం తేరుకున్నట్టుగా.

రెండు రోజుల తర్వాత అమావాస్య దాట గానే సత్రశాల శివాలయంలో నిద్ర చేద్దామంది తను. నేనూ కౌశిక్, ఆడపడుచు గాయత్రి, తోటికోడలు సరోజ సత్రశాలకి బయల్దేరాం. తన వెంటే ఉండాలని గౌరమ్మని కూడా రమ్మంది అత్తయ్య. ఇంటికెళ్ళి, చిన్న చేతి సంచితో తిరిగొచ్చింది. అప్పుడెప్పుడో ఒకసారి కృష్ణా నది పుష్కరాలకు తీసుకెళ్ళింది అత్తయ్య సత్రశాలకి. ఎక్కువ రద్దీ లేని ప్రశాంతమైన ప్రాంతం. ఒడ్డునే శివాలయం. కొద్ది మెట్లు దిగితే మంద్రంగా ప్రవహిస్తూ కృష్ణ.

దగ్గరే కాబట్టి నిజం చెప్పొద్దూ, ఏదో పిక్నిక్‌కి వెళ్తున్న ఫీలింగ్‌తో భోజనాలు ప్యాక్ చేశాం నేనూ, సరోజా! దిగుళ్ళకీ, దుఃఖాలకూ ఎక్స్‌పైరీ డేట్ లేకపోతే ప్రపంచం నడవదు.

రెండు కార్లలో బయలు దేరి గంటలోపే అక్కడికి చేరాము. మేము గుడి అంతా తిరిగి అక్కడున్న శాసనాలు చదవాలని ప్రయత్నిస్తుంటే అత్తయ్య, గౌరమ్మ మౌనంగా ఒడ్డు నుంచి కృష్ణకి దారి తీసే మెట్ల మీద కూచున్నారు.

నేనూ, కౌశిక్ అక్కడి నుంచి లేచి కాసేపు ఆ చివరి వరకూ నడిచి కృష్ణలో కొన్ని నున్నటి గులకరాళ్లు ఏరుకున్నాం.

"అమ్మ చాలా దిగులుపడి కుంగిపోతుందను కున్నాను. కానీ చాలా ధైర్యంగా ఎదుర్కొంది" అన్నాడు. మళ్ళీ తనే "నాన్నకి మొన్న ఆగస్టులో 72 నిండాయి. అమ్మకి 65" అన్నాడు. తన వైపు నిశితంగా చూశాను. కౌశిక్ చూపు తిప్పుకున్నాడు.

"చాలా కష్టాలు పడింది అమ్మ. నాన్న మొండితనం, కోపాలతో. ఇప్పుడు పెద్దయ్యాక మర్చిపోయాం గానీ, చిన్నప్పుడు మాకే భయంగా ఉండేది. చాలా తట్టుకుని నిలబడింది అమ్మ. నాన్నకి అన్నీ పట్టింపులు, సంప్రదాయాలు" దూరంగా కనిపిస్తున్న అత్తయ్య వైపు చూశాడు. అత్తయ్య, గౌరమ్మ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆయన పట్టుదలల్ని అంగీకరించడం తప్ప ఆవిడకి వేరే ఛాయిస్ లేక పోబట్టి.. ఈ 'పచ్చని కుటుంబం' ఇవాళ నిలబడి ఉంది.

"అమ్మని మనతో రమ్మన్నాను. కానీ కొన్నాళ్ళు ఒక్కతే ఉండాలనుకుంటున్నట్టు మాట్లాడింది. ఉండనీ, తనకు తోచినట్టు బతకనీ" అన్నాడు.

"పద, చీకటి పడుతోంది" లేచి డ్రెస్‌కి అంటుకున్న ఇసుక దులుపుకున్నాను.

రాత్రి అందరం గుడి ఆవరణలో కూచుని భోజనాలు చేశాం. వద్దన్నా వినకుండా గౌరమ్మ ఆ గిన్నెలు పట్టుకెళ్ళి నదిలో కడిగి తెచ్చింది.

తెచ్చుకున్న దుప్పట్లు పరిచి అందరం విశాలమైన గుడి ఆవరణలోనే నడుం వాల్చి కబుర్లకు పడ్డాం. వాటిలో ఎక్కువ భాగం మామయ్య గురించే. ఆయన పట్టుదల, పంతం, కోపం, పౌరుషం.. ఎందుకూ పనికిరాని ఆ లక్షణాలకు, ఆయన మరణం కీర్తిని అద్దింది.

"గౌరమ్మ ఏది?" అత్తయ్య అనేసరికి చటుక్కున తల తిప్పాను. ఇందాక కాస్త దూరంలో దుప్పటి పరుచుకు పడుకున్న గౌరమ్మ అక్కడ లేదు.

"బాత్‌రూం అవసరమై వెళ్ళిందేమో అత్తయ్యా, నేను వెళ్ళి చూసొస్తా మీరుండండి" అన్నాను లేస్తూ.

"నేనూ వస్తా ఉండు" వద్దంటున్నా నాతో పాటే నడిచింది.

ఇద్దరం గుడి నుంచి బయటికి వచ్చి నది వైపు నడిచాం. మెట్ల మీదుగా నది వైపు నడుస్తూ కనిపించింది. రాత్రి పదిన్నరకి చీకట్లో నీళ్ళకి అంత దగ్గరగా ఎందుకు వెళ్ళడం, విసుక్కుంటూ నాలుగు మెట్లు దిగాను "గౌరమ్మా" అని పిలుస్తూ.

గాలి వాలుకు నా పిలుపు ఎటో పోయింది ఎగురుకుంటూ.

అత్తయ్య పరీక్షగా తేరిపార చూస్తూ "దాని చేతిలో సంచిలా ఉంది, ఏంటి చూడది ప్రీతీ" అంది.

నేను, అత్తయ్య చూస్తుండగానే గౌరమ్మ సంచిలోంచి వస్తువొకటి తీసి, ఒకసారి దాన్ని పరీక్షగా చూసి, నదిలోకి విసిరేసింది.

'చక్' మన్న చిన్న శబ్దంతో నదిలో పడిన ఆ వస్తువు ఆ క్షణంలో మునిగిపోయి కృష్ణకి అంకితమై అదృశ్యమైపోయింది. ఇద్దరం ఒక్క క్షణం షాక్‌తో నిలబడి ఒకరివైపు ఒకరం చూసుకున్నాం. మరుక్షణంలో అదేమిటో నాకు అర్థమైంది. కాళ్ళు నేలలో పాతేసినట్టు ఇద్దరం అక్కడే నిలబడి పోయాం. గౌరమ్మ మెట్లెక్కి వస్తూ మమ్మల్ని చూసి ఒక్క క్షణం తొట్రుపడి ఆగిపోయింది. కానీ ఆ చూపులో భయం లేదు.

"ఏం విసిరేశావే కృష్ణలో?" అత్తయ్య ఆశ్చర్యంగా అడిగింది, గొంతులో కొంత అనుమానం.

"పెద్దయ్య గారి వెండి కంచం పారేశానమ్మా" ఒక్క క్షణం తర్వాత జవాబు మామూలుగా వచ్చింది.

ఇద్దరం ఒకరి మొహాలొకరం చూసుకుంటూ నిలబడిపోయాం.

అత్తయ్య తన శక్తి అంతా క్షీణించి పోయినట్టు మెట్ల మీద నెమ్మదిగా కూచుండిపోయింది. అత్తయ్యలో దుఃఖం సుడులు తిరుగుతోందని అర్థమైంది. ఎలా ఇప్పుడు? గుళ్ళో ఉన్న ముగ్గురికీ ఈ సంగతి తెలిస్తే చాలా పెద్ద గొడవే అవచ్చేమో!

అత్తయ్య పూడుకుపోతున్న గొంతు పెగిల్చి "ఎందుకే?" అంది.

భయం వేసింది. హార్ట్ పేషంట్ తను!

నేల చూపులు చూస్తున్న గౌరమ్మ అత్తయ్య కాళ్ల దగ్గర ఉన్న కింది మెట్టు మీద కూచుంది.

"పెద్దయ్య మా ఇంటికి పట్టా ఇప్పించాడని మా ఆయన పొయ్యే దాకా సెప్పుకుని సెప్పుకుని మురిసిపొయ్యే వోడమ్మా. ఆయన పొయ్యాక కూడా నీ ఇంట్లో ఎందుకు పని చేశానంటే, ఆ పట్టా కోసం కాదు. ఒకసారి నా చేతికి పట్టా ఒచ్చాక ఇది దాన్ని ఎవుడూ ఏం జెయ్యలేడు గదా? నేను ఇన్నేళ్ళు నీ పని చేశానమ్మా. ఎందుకో తెలవదు గానీ నీ

"ఆ కంచం నాకొద్దమ్మా! దాన్ని నేను తాకితే అది మైల పడి పోయిద్దని, ఎన్నోసార్లు పెద్దయ్య నీ ముందే అన్నాడు గదూ? అంత గొప్ప కంచం నా కాడ ఉంటే, పెతీ నిమిసం అది పెద్దయ్య హాంకారాన్నే గుర్తు జేసిద్ది నాకు. మీ ఇంట్లో అన్ని సామానుల్లోకీ పెద్ద సిమ్మాసనం ఎక్కి కూసున్నట్టు ఎగిరిపడుద్ది ఆ కంచం. అందుకే దాన్ని చూస్తే నాకు పెద్దయ్యని చూసినట్టే ఉంటది. జీవితాంతం నేను కడగటానికి కూడా దానికి పనికిరాలా. ఇప్పుడు ఏకంగా నా కొంపకొచ్చి కూసుంటే దానికి మర్యాదలు నేనెక్కడ జేసేది? దాన్ని సూత్తేనే నాకసయ్యం"

బతుకు చాలా అన్యాయమైన బతుకు గదూ.."

ఒక స్త్రీ పడుతున్న అవమానాలను సాటి స్త్రీ కంటే ఎవరు అర్థం చేసుకుని గుర్తించగలర నిపించింది. గౌరమ్మ బెరుకు లేకుండా మాట్లాడుతుంటే నాకు ఒకపక్క కంగారు, మరో పక్క కోపం వస్తోంది. అత్తయ్య ఎలా రెస్పాండ్ అవుతుందో అని.

అత్తయ్య నిర్ఘాంతపోయి చూస్తోంది.

"పెద్దయ్య నేనెంత చాకిరీ చేసినా, నన్నూ నా మొగుణ్ణీ 'అలగా జాతి' కిందే చూశాడమ్మా! శానా సార్లు కోపం వొచ్చేది. నా కొడుకులు ఇద్దరూ సిటీలో మంచి బతుకులు బతుకుతున్నారు. నేనెళ్తే సోఫా దిగే పని లేకుండా సూసుకుంటరు. అలగా మనిషి అనే మాట మీ ఇంటో మాటి మాటికీ ఇన్నాను నా గురించి. నా గురించనే కాదులే పార్వతమ్మా, పెద్దయ్య తక్కువ కులపోళ్ళందరినీ అలగావోళ్ళనే అంటాడు. అలగా వాళ్ళ చేత అన్నీ చేయించుకున్నాక, వాళ్ళు అలగా వాళ్ళని గుర్తొస్తదా అయ్యా.. అని అడగాలనిపించింది సానా సార్లు" ఒక్క క్షణం ఆగి, అంది.

"ఆ కంచం నాకొద్దమ్మా! దాన్ని నేను తాకితే అది మైల పడిపోయిద్దని, ఎన్నోసార్లు పెద్దయ్య నీ ముందే అన్నాడు గదూ? అంత గొప్ప కంచం నా కాడ ఉంటే, పెతీ నిమిసం అది పెద్దయ్య హాంకారాన్నే గుర్తు జేసిద్ది నాకు. మీ ఇంట్లో అన్ని సామానుల్లోకీ పెద్ద సిమ్మాసనం ఎక్కి కూసున్నట్టు ఎగిరిపడుద్ది ఆ కంచం. అందుకే దాన్ని చూస్తే నాకు పెద్దయ్యని చూసినట్టే ఉంటది. జీవితాంతం నేను కడగటానికి కూడా దానికి పనికిరాలా. ఇప్పుడు ఏకంగా నా కొంపకొచ్చి కూసుంటే దానికి మర్యాదలు నేనెక్కడ జేసేది? దాన్ని సూత్తేనే నాకసయ్యం" గౌరమ్మ గొంతు ప్రతి వాక్యానికీ పదునెక్కుతున్నట్టు తోచింది

"అది ఎండి కంచం కావొచ్చు గానీ దానికేమీ ఇలవ లేదు. బజాట్లో అమ్మితే డబ్బులొత్తయి గానీ, ఆ డబ్బు నాకు అసుద్దంతో సమానం పెద్దమ్మా! అందుకే దాన్ని కిష్నలో పారేశా! ఎవరికన్నా దొరకనీ. దొరికినోళ్ళకి దాని సెరిత్ర, కత తెలవదు కాబట్టి, వాళ్ళు దాన్ని మన్నన సెయ్యకుండా, కంచంగానే సూత్తారేమో మరి. అసలువురికి దొరక్కుండా ఇసుకలో పూడిపోతే దానిక్కూడా మంచిది."

"ఇదంతా చేసే బదులు ఆ కంచం తీసుకోకుండా ఉంటే సరిపోయేది కదా?" దీనికీ జవాబు గౌరమ్మ దగ్గర ఉండే ఉంటుందని ఊహిస్తూనే అన్నాను.

"ఏం చేస్తున్నారక్కడ? ప్రీతీ.. అత్తయ్యా?" సరోజ కేక వేసింది.

"వస్తున్నాం" బిగ్గరగా అరిచి, గౌరమ్మ వైపు చూశాను.

"దాన్ని ముట్టుకోవాలని కూడా నాకు ఆశ లేదమ్మా! కానీ నదిలో పారెయ్యాలనే ఆలోసిన తోటే ... తీసుకున్నాను."

ఏమనాలో తోచలేదు.

"ఆ కంచం నా కళ్ళెదురుగా ఉన్నంత కాలం, మీ ఇంట్లో ఐనా నా ఇంట్లో అయినా... నేను అలగాదాన్ని అనే విషయం అది నాకు గురుతు సేత్తా ఉంటది."

గౌరమ్మకి ఉన్న క్లారిటీ చుట్టూ బతుకుతున్న వాళ్లలో చాలా మందికి ఉంటే ఎంత బాగుండనిపించింది. అత్తయ్య లేచి నిలబడింది. గౌరమ్మ కూడా వెంటనే లేచింది.

"ఇక రేపటి నుంచీ నన్ను తీసేత్తారేమో, పర్లేదమ్మా, మీరు ఆ ఇంట్లో.. "

అత్తయ్య ఒక మెట్టు దిగి గౌరమ్మని గాఢంగా కౌగిలించుకుంది. ఒక ప్రేమపూర్వక, ఒక క్షమాపణ పూర్వక ఆలింగనం అది. గౌరమ్మ ఒక్క క్షణం కదలకుండా నిలబడి, తిరిగి తనూ, అత్తయ్య భుజాల చుట్టూ చేతులు వేసింది.

ఇద్దరు స్నేహితురాళ్ల కలయికలా ఉంది ఆ దృశ్యం. ఒకరి కలతలు ఒకరు తెలిసిన ఇద్దరు స్త్రీలు వాళ్ళు.

అత్తయ్య భుజం మీద చెయ్యి వేశాను.

ఈసారి వెనక్కి తీసుకునే ఉద్దేశం లేదు.


97043 86363

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# సృష్టిలో తీయనిది

సింగీతం ఘటికాచల రావు
95004 31474



శాండిల్య ఆలోచిస్తున్నాడు. రిటైర్మెంట్‌కు ఇంకా పదేళ్ల పైనే ఉంది. ఇప్పటికే బాగా స్థిరపడి ఉండాల్సింది. కానీ, ఆ దిశగా పొదుపు చర్యలేవీ చేపట్టలేదు. అది తలుచుకుని కొద్దిగా చింతించాడు. అతను చేసిందల్లా అప్పుడప్పుడూ వచ్చిన బోనస్, డీఏ బకాయిలు, పే కమిషన్ వల్ల జీతం పెరిగినప్పుడు మొత్తంగా వచ్చిన డబ్బు ఇలాంటివన్నీ కలిపి సుమారుగా ఐదు లక్షల వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి ఉంచాడు. అంతకుమించి మరేవిధమైనా పొదుపు చర్యలు చేపట్టలేదు. ఇళ్ల స్థలాలు కొనలేదు. బంగారం అసలే కొనలేదు. ప్రస్తుతం అతనుండే ఇల్లు మాత్రమే చెప్పుకోదగ్గ స్థిరాస్తి. అది కూడా పదేళ్ల క్రితం కొన్నది. ఇప్పటికీ దానికి నెలనెలా ఈఎంఐ కడుతూనే ఉన్నాడు. ఇరవై ఏళ్ల వ్యవధి.. అంటే రిటైర్మెంట్ వరకూ కడుతూనే ఉండాలి. ఏదో విధంగా దాని వ్యవధి తగ్గించుకుని అప్పనేది లేకుండా ఉండాలనుకుంటే కుదిరేట్టు లేదు. ఈసారి ఎలాగైనా ఈఎంఐ పెంచి వచ్చే ఐదేళ్లల్లో లోన్ మొత్తం తీర్చెయ్యాలి. ఉద్యోగం ఉండగానే అప్పు తీర్చేసి నిశ్చింతగా ఉండాలి. మదినిండా లెక్కలేనన్ని ఆలోచనలతో సతమతమవుతూ ఆఫీసుకు బయలుదేరాడు శాండిల్య.

ఆఫీసుకు చేరుకోగానే ఎదురుపడ్డాడు సహోద్యోగి వాసుదేవన్. పక్కసీట్లోనే కూర్చుంటాడు. శాండిల్య ప్లానింగ్ వర్క్ చూస్తే వాసు టెండర్ల పని చూస్తుంటాడు. అతనికి స్టాక్ మార్కెట్ పిచ్చి కాస్త ఎక్కువే. అలాగని తాహతుకు మించి పెట్టుబడులు పెట్టలేదు. అలాగని విపణిలో మరీ లెక్కలేనన్ని లాభాలు కూడా కళ్లజూడలేదు. మధ్యేమార్గంగా అతని పెట్టుబడుల కార్యక్రమం జరుగుతూ ఉంది. పెట్టుబడికి కొంత అమౌంట్ తక్కువ అవుతుందని అప్పుడప్పుడూ శాండిల్య దగ్గరకూడా చేబదులు తీసుకునేవాడు. అలా తీసుకునే సొమ్ము తక్కువగానే.. అంటే వందల్లోనే ఉండేది. ఎప్పుడో ఒక్కసారి మాత్రం సుమారు పదివేలు తీసుకున్నాడు. కానీ తీసుకున్నది చెప్పిన సమయానికి తిరిగి ఇచ్చేసేవాడు. శాండిల్యతో పోల్చుకుంటే అతను కాస్త బాగానే స్థిరపడ్డాడని చెప్పాలి. ముఖ్యంగా అప్పులేదు. తాతల కాలం నాటి సొంతిల్లు ఉంది. కాబట్టి వేరే స్థిరాస్తి గురించిన చింత లేదు. కానీ స్టాక్ మార్కెట్ పైనే ఎక్కువగా అతని గురి. దీర్ఘకాలంలో అది ఎక్కువ లాభాలను ఇస్తుందని నమ్మేవాళ్లల్లో అతను కూడా ఒకడు. అందువల్ల మార్కెట్ స్థితిగతులన్నీ ప్రతినిత్యం గమనిస్తూ ఉండేవాడు. అదును చూసి పెట్టుబడి పెట్టేవాడు. అయినా చాలాసార్లు పెట్టుబడి పెట్టిన కంపెనీ షేర్లు ఘోరంగా పతనమయ్యేవి. ఆ సమయంలో శాండిల్య అతన్ని మందలించేవాడు.

ఆ సందర్భంలో ఒకసారి..

''ఎందుకొచ్చిన దురాశ? ఉన్నదాంట్లో తృప్తిపడొచ్చు కదా'' అని అన్నప్పుడు

''నామట్టుకు నష్టమేమీ లేదు. క్రితంలో వచ్చిన లాభం ఇప్పుడు పోయిందనుకుంటా. అయినా రిస్క్ లేని పెట్టుబడి ఎక్కడుంటుంది? ఈ ప్రపంచంలో ఉద్యోగం చేసుకుంటూ కోటీశ్వరుడైన వ్యక్తి ఒక్కడూ లేడు. ఇది అక్షర సత్యం. అదలాగుండనీ.. నాకో రెండు వేలు అప్పివ్వు. వచ్చే నెల జీతం రాగానే ఇచ్చేస్తాను'' అన్నాడు. వాడి జవాబుకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

చాలాసార్లు శాండిల్యను కూడా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టుమని ఒత్తిడి చేశాడు. అయితే శాండిల్య ఒప్పుకోలేదు. శాండిల్య ఉద్దేశంలో స్టాక్ మార్కెట్ అనేది ప్రపంచంలోకెల్లా అతిపెద్ద జూదం. అక్కడ కోటీశ్వరులు ఇంకా కోటీశ్వరులు అవుతారు. పేద మధ్యతరగతివాళ్లు సర్వనాశనమై పోతారు. అందువల్ల దానిగురించి కనీసం ఆలోచించే సాహసం చెయ్యడు.

''నువ్వు చాలా తప్పుగా అర్థం చేసుకున్నావురా. మనం పెట్టుబడి పెట్టే కంపెనీ మంచిదైతే ఇవాళ కాకుంటే రేపైనా మనకు లాభాలు తప్పకుండా వస్తాయి. అక్కడే మన విచక్షణతో పెట్టుబడి పెట్టాలి'' అన్నాడు వాసుదేవన్.

''నేను నమ్మనురా. కంపెనీ ఎంత మంచిదైనా స్టాక్ మార్కెట్ పెట్టుబడి తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది. కాకపోతే ఏమిట్రా? ఎక్కడో అమెరికాలో ఏదో జరిగితే ఇక్కడ మార్కెట్ కుప్పకూలిపోతుందా? మన బడ్జెట్ మొత్తం ఎంత బాగున్నా ఎక్కడో ఏదో ఒక్కచోట ట్యాక్స్ పరిమితి పెంచలేదని మార్కెట్ కూల్చేస్తారా? ఇది అన్యాయం కాదా? మన దేశపు ఆర్థిక మూలాలు, మనం పెట్టుబడి పెట్టే కంపెనీల పనితీరు బాగున్నప్పుడు ప్రపంచ పరిస్థితులు ఎలా ఉంటే ఏంటి? నాకు తెలిసి ఇక్కడ పెట్టుబడి పెట్టి, సంపాదించిన వాళ్లకంటే దివాలా తీసినవాళ్లే ఎక్కువ. దీన్ని మించిన గ్యాంబ్లింగ్ మరొకటి లేదు. అది అధికారికంగా జరుగుతున్న గ్యాంబ్లింగ్''

''నీకు అలా అనిపిస్తే నేనేమీ చెయ్యలేను. నామట్టుకు నాకు తృప్తిగానే ఉంది. నువ్వన్నట్టు కొన్నిసార్లు నష్టాలు వచ్చిన సందర్భాలు లేకపోలేదు. అయినా సరే, దీర్ఘకాలిక పెట్టుబడులకు నేను దీన్నే నమ్ముకుంటాను. సామాన్య పెట్టుబడిదారులు నష్టపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూనే ఉన్నారు''

''చర్యలు తీసుకుంటున్నా స్కాములు జరుగుతూనే ఉన్నాయి కదా. దానికేమంటావు? శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్టుగా.. ఎవరెన్ని చర్యలు తీసుకున్నా మోసపూరితమైన ఉద్దేశం ఉన్నవాడు ఏదో ఒక వంక కనిపెడుతూనే ఉంటాడు. మోసాలు చేస్తూనే ఉన్నాడు. అటువంటి వాళ్లను మార్చలేం''

బాస్ పిలుపు రావడంతో అప్పటికి చర్చ ముగిసింది. ఎవరి పనుల్లో వాళ్లు లీనమయ్యారు.

మరునాడు ఆఫీసుకు వచ్చిన వాసుదేవన్ చాలా అశాంతిగా ఉన్నట్టు కనిపించింది. ఏం జరిగిందో, ఇంట్లో ఏదైనా సమస్య వచ్చిందేమో అనుకుంటూ దగ్గరికెళ్లి ఆరా తీశాడు శాండిల్య.

''అదేం లేదురా. అంతా బాగానే ఉంది'' అన్నాడు కానీ,

అతని ముఖ కవళికలలో మాత్రం మార్పులేదు. కొద్దిసేపు అతనివంక తదేకంగా చూసి వెళ్లి సీట్లో కూర్చుని పని చేసుకోసాగాడు శాండిల్య. అప్పుడప్పుడూ అతనివంక చూసినప్పుడు కొద్దిగా అశాంతిగా కదులుతూ ఉండటం గమనించాడు. మధ్యాహ్నం వరకూ చూసి ఇక ఉండబట్టలేక మళ్లీ లేచి వెళ్లి అడిగాడు.

''సమస్య చెప్పకుండా ఇలా దాటవేస్తే ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? నాకు చెప్పడంలో ఎందుకీ దాపరికం?''

''అదేం లేదురా. నీకు నచ్చని విషయం, నా పెట్టుబడి గురించిన ఇబ్బందులు'' అన్నాడు.

''ఇబ్బంది పడేంత విషయమైతే దాని గురించి ఆలోచించడం ఎందుకు? మన తాహతుకు మించి పెట్టుబడి పెట్టడం మూర్ఖత్వం అనిపించుకోదా?'' అన్నాడు కోపంగా.

శాండిల్యవంక చూసి సన్నగా నవ్వాడు వాసుదేవన్.

''ఒక్కొకరి ఆలోచనాసరళి ఒక్కోవిధంగా ఉంటుంది. ప్రస్తుతం నేను అనుకుంటున్న పెట్టుబడి నాకు సంబంధించి చాలా ముఖ్యం. ఎందుకంటే అది దీర్ఘకాలిక పెట్టుబడి. దానివల్ల లాభమే కానీ నాకు ఎంతమాత్రమూ నష్టం ఉండదు. అందుకే ఏం చెయ్యాలో ఆలోచిస్తున్నాను. ఇంట్లో ఉన్న బంగారమేదైనా అమ్మితే అన్న ఆలోచన కూడా ఉంది''


అతని ఆలోచనకు ఉలికిపడ్డాడు శాండిల్య. పెట్టుబడి గురించి అతనంత తీవ్రంగా ఆలోచిస్తున్నాడన్న విషయం చాలా విచిత్రంగా అన్నది నిర్ణయించుకోవడం తన వంతు. వాడేదో పెద్ద పెట్టుబడి ఆలోచనలో ఉన్నాడన్న విషయం మాత్రం అర్థమైంది. దాపరికం లేకుండా విషయం చెప్పినందుకు సంతోషం కలిగింది. కానీ, అంత పెద్దమొత్తం సర్దడం తన అనిపించింది. ఉన్నదంతా ఊడ్చిపెట్టి ఇలా చెయ్యడం సమంజసమా? అన్న ప్రశ్న ఉదయించింది. అది అతని వ్యక్తిగత విషయం. తన వరకూ రానంతవరకు ఫర్వాలేదు అనుకుని మిన్నకున్నాడు శాండిల్య.

రెండురోజుల తరువాత ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లగానే ఎదురుపడ్డాడు వాసుదేవన్. చూసీ చూడగానే..

''నాకు అర్జంటుగా యాభై వేలు కావాలి. సర్దగలవా? అయితే తిరిగిచ్చేందుకు నాకు కాస్త సమయం పడుతుంది. ఏడాది కూడా పట్టొచ్చు. కచ్చితంగా చెప్పలేను'' అన్నాడు.

తాను విన్నదేమిటో అర్థం చేసుకుని జీర్ణించుకునేందుకు శాండిల్యకు కొంత సమయం పట్టింది. అంతవరకూ వందల్లో అడిగి ఎప్పుడైనా పదివేలు అడిగే అతను.. హఠాత్తుగా తన స్థాయిని యాభై వేలకు పెంచడంతో దిక్కుతోచలేదు. వాడికైనా తనకైనా వచ్చే జీతమే నలభై వేలకు మించదు. అలాంటప్పుడు యాభై వేలు ఎక్కణ్నుంచి తేవాలి? అదే సమయంలో తనకున్న ఏకైక స్నేహితుణ్ని నిరాశ పరచేదెలా? అన్న ఆలోచన కూడా వచ్చింది.

అతనెందుకు అడుగుతున్నాడో దాపరికం లేకుండా చెప్పిన తరువాత ఇవ్వాలా? వద్దా?



'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2025'లో బహుమతి పొందిన కథ.

తాహతుకు మించిన సమాచారం. కాబట్టి వెంటనే జవాబివ్వకుండా.. ''ఆలోచించుకుని రెండు మూడ్రోజుల్లో చెప్తాను'' అన్నాడు.

''అంత వ్యవధి లేదు. నాకు రేపటికల్లా కావాలి. రేపే ఆఖరు తేదీ'' అన్నాడు వాసుదేవన్.

ఆలోచనలో పడిపోయాడు శాండిల్య.

ఇవ్వనంటే ఏమనుకుంటాడో. ఇంతకాలమూ ఇస్తూనే ఉన్నాడు. కానీ, ఎప్పుడూ ఇంతపెద్ద మొత్తం ఇవ్వలేదు. వాడు అడగనూ లేదు. సంకట స్థితిలో ఏం తోచకుండా పోయింది.

ఆ సమయంలో హఠాత్తుగా అతనికి యూట్యూబ్‌లో చూసిన గరికపాటివారి ప్రవచనం ఒకటి గుర్తొచ్చింది. స్నేహాన్ని, స్నేహ ధర్మాన్ని ఎలా కాపాడుకోవడం అన్న విషయమై చెప్పిన మాటలవి. లేదనకుండా ఎంతో కొంత ఇచ్చి, ఇచ్చింది ఇక తిరిగి రాకున్నా ఫర్వాలేదనుకునే మానసిక స్థితికి రావడమే!

ఆ మాటలు ఆ క్షణంలో చాలా అద్భుతంగా తోచాయి. నిజమే.. అలా చెయ్యడమే మంచిది. అనుకుని మనసు స్థిమిత పరచుకున్నాడు.

మర్నాడు ఆఫీసుకు వెళ్లగానే పదివేల రూపాయలు చేతిలో ఉంచి..

''నువ్వు అడిగినట్టు యాభై వేలు ఇచ్చే పరిస్థితులు లేవుగానీ ప్రస్తుతానికి ఇవి ఉంచు. ఇవి నీకెంతవరకూ ఉపయోగపడతాయో తెలీదు'' అన్నాడు. దాన్ని తీసుకుని దానివంకే చూస్తూ..

''మళ్లీ చెప్తున్నాను. తిరిగి ఇచ్చేందుకు టైమ్ పట్టొచ్చు'' అన్నాడు వాసుదేవన్.

''అలాగేలేరా. నీకు తోచినప్పుడే ఇవ్వు'' అన్నాడు ప్రవచనాన్ని మననం చేసుకుంటూ.

తరువాత ఏడాదికి వాసుదేవన్ వేరే డిపార్టుమెంట్‌కు బదిలీ అయి వెళ్లిపోయాడు. పోతూ పోతూ.. ''నేను నీకు పది వేలివ్వాలి. ఇస్తాను'' అని మాత్రం అన్నాడు.

అయితే శాండిల్యకు అప్పుడు గుర్తొచ్చిందది. నిజంగానే తానిచ్చినట్టు మర్చిపోయాడు. కానీ, ఏడాది తర్వాత కూడా వాసుదేవన్ గుర్తుంచుకుని అలా చెప్పడంతో ఆశ్చర్యపోవడమే కాక ఆనందం కలిగింది. మనసులోనే 'నిజమైన స్నేహితుడంటే వీడే' అనుకున్నాడు. తర్వాత ఇద్దరిమధ్యా పెద్దగా సంబంధాలు కొనసాగలేదు. వేరువేరు విభాగాలు కావడంవల్ల కలవడం చాలా అరుదుగా ఉండేది. కలిసినా పది నిమిషాలకన్నా ఎక్కువ మాట్లాడుకునే వాళ్లు కాదు.

* * *

కాలం గిర్రున తిరిగింది. పదేళ్లు గడిచింది. శాండిల్య పదవీ విరమణ సమయం వచ్చింది. అతను ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారమే.. ఇంటి ఈఎంఐ పెంచుకుని ఐదేళ్లల్లోనే అప్పు మొత్తం తీర్చేసుకుని గత ఐదేళ్లుగా అప్పుల్లేని ప్రశాంత జీవనం గడుపుతున్నాడు.

పదవీ విరమణకు కొద్దిరోజుల ముందు శాండిల్య తన ఆఫీసులోని సహోద్యోగులందరికీ ఒక చిన్న విందు ఏర్పాటు చేశాడు. మర్చిపోకుండా వాసుదేవన్‌ను కూడా పిలిచాడు.

సహోద్యోగులందరూ తమకు తోచిన విధంగా చదివింపులు ఇచ్చుకున్నారు. అప్పుడు వాసుదే

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

వన్ వచ్చాడు. అతని చేతిలో ఒక పెద్ద కవర్ ఉంది. కాస్త మందంగానే ఉంది.

దాన్ని శాండిల్యకు ఇచ్చి.. ''ఇప్పుడు కాదు! ఇంటికెళ్లి తెరిచి చూసుకో. అర్థం కాకపోతే రేపు ఆఫీసులో మాట్లాడుకుందాం'' అన్నాడు.

ఇంటికెళ్లి కవర్ తెరిచి చూస్తే.. అందులో ఏదో కంపెనీ షేర్ సర్టిఫికెట్లు ఉన్నాయి. మొత్తంగా చూస్తే లక్షా ఇరవై వేల షేర్లు. శాండిల్య తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. అవన్నీ తన పేరనే ఉన్నాయి. దానిపైన ఒక్కొక్కటి ఒక్క రూపాయి అని ఉంది. అంటే లక్షా ఇరవై వేలు బహుమతిగా ఇచ్చాడా? అనుకుంటూ ఆశ్చర్యపోయాడు శాండిల్య. ఎప్పుడెప్పుడు ఉదయం అవుతుందా? ఆఫీసుకెళ్లి వాసుదేవన్‌తో మాట్లాడుతానా? అనిపించింది.పదవీ విరమణకు ఇక పది రోజులే ఉంది. ఆరోజు ఉదయం ఆఫీసుకు చేరుకోగానే నేరుగా వాసుదేవన్ ఉండే డిపార్టుమెంట్‌కు వెళ్లాడు. శాండిల్యను చూడగానే పిలిచి కూర్చోబెట్టి ప్యూన్‌ను కాఫీ తెమ్మని పురమాయించాడు వాసుదేవన్.

''ఏమిట్రా! ఇన్ని షేర్లు నా పేరనే ఉన్నాయి. ఇదెలా సాధ్యం?'' అనడిగాడు శాండిల్య.

''నేను నీకు పదివేలు ఇవ్వాలన్న విషయం నీకు గుర్తుందా?''.. ఆ ప్రశ్నకు ఉందన్నట్టు తలూపాడు కానీ, అతనెప్పుడో మర్చిపోయాడు.

''నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేదు. ఆరోజు నిన్ను డబ్బులు అడిగింది దీని కోసమే. నువ్వు నీ జీతంలో కూడబెట్టింది చాలా తక్కువని తెలుసు. జీవితంలో మనం కొంతమేరకైనా రిస్క్ తీసుకోవాలి. ఆరోజు నిన్ను అడిగిన మొత్తం ఎక్కువే. అందుకే, తర్వాత ఆచితూచి నాపేరన కూడా కొద్ది మొత్తంలోనే తీసుకున్నాను. నేనీ షేర్లు కొన్నప్పుడు ఇప్పటిలాగా డీమ్యాట్ ఖాతా తప్పనిసరి కాదు. అందువల్ల నీ పేరున కొనగలిగాను. ఇప్పుడు వీటిని అమ్మాలంటే డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. కాబట్టి, ఖాతా ఓపెన్ చేసి వీటిని అమ్ముకోవచ్చు'' అన్నాడు వాసుదేవన్.

అయితే ఇప్పటికీ శాండిల్యకు ఈ షేర్ మార్కెట్ గురించిన ఓనమాలు తెలియవు. అందువల్ల వెంటనే.. ''దానిక్కూడా నేను నీదగ్గరకే రావాలి. వస్తాను'' అన్నాడు.

''ఒక విషయం తెలుసా? నేను మొదట కొన్నది పది రూపాయల వంతుల వెయ్యి షేర్లే. తరువాత ఈ పదేళ్లలో రెండుసార్లు బోనస్ షేర్లని ఇచ్చారు. తరువాత వాటి విలువ తగ్గించి ఒక్క రూపాయి చేశారు. అలా ఇవాళ మన దగ్గర ఒక్కొక్కరికీ ఇన్ని షేర్లు వచ్చాయి'' అన్నాడు.

శాండిల్యకు అంతా కలగా ఉంది. ఇంటికెళ్లాక ఎందుకో ఒకసారి షేర్ మార్కెట్ గురించి గూగుల్‌లో వెతికాడు. కంపెనీ షేర్ల విలువ, వాటి రోజువారీ ధరలు వగైరాలన్నీ చూస్తూ తన దగ్గరున్న ఆ షేర్ విలువ ఎంతుందో చూడాలన్న కుతూహలంతో వేసి చూశాడు. అతని కళ్లు బైర్లు కమ్మాయి. ఆ షేర్ విలువ ఆరోజు వంద రూపాయల పైనే ఉంది. అంటే.. తన దగ్గరున్న షేర్లు అమ్మితే అక్షరాలా కోటీ ఇరవై లక్షలు వస్తాయన్నమాట. కొద్ది క్షణాలు గుండె కొట్టుకోవడం మానేసినట్టు అనిపించింది. పదవీ విరమణ సందర్భంగా తన మిత్రుడు ఇంతటి విలువైన బహుమతి ఇస్తాడని అనుకోలేదు.

పదవీ విరమణ తరువాత ఇద్దరు మిత్రులు పెద్దగా కలిసే సందర్భాలు కలగలేదు. శాండిల్య రిటైరైన ఏడాదికి వాసుదేవన్ కూడా రిటైరయ్యాడు. తరువాత శాండిల్య ఊరొదిలి తమ సొంతూరికే వెళ్లిపోవడం వల్ల ఫోన్లో కూడా పెద్దగా కాంటాక్ట్ లేకపోయింది.

* * *

రెండేళ్లు గడిచాక ఒకరోజు పెన్షన్‌కు సంబంధించిన వివరాలు సరిచూసుకునేందుకు ఆఫీసుకు రమ్మని కబురు రావడంవల్ల చెన్నైకి చేరుకున్నాడు శాండిల్య. అదే రోజున అక్కడికి వాసుదేవన్ కూడా వచ్చాడు. అయితే అతన్ని చూసి అతిపెద్ద షాక్‌కు గురయ్యాడు శాండిల్య.

అతను చక్రాల కుర్చీ పైన ఉన్నాడు. వాసుదేవన్ రిటైరైన కొద్దిరోజులకే జరిగిన ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిన్నందువల్ల ఆ పరిస్థితి వచ్చిందన్నాడు. బాగా బక్కచిక్కిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మిత్రుణ్ని చూడగానే.. ప్రపంచమంతా తలకిందులైనట్టు అనిపించింది శాండిల్యకు. ''ఇంత జరిగినా నాకెందుకు చెప్పలేదురా. ఫోన్ నంబరుందిగా'' అన్నాడు కోపంగా.

''చెప్పినా ప్రయోజనం ఏంట్రా. జీవితం చక్రాల కుర్చీకి అంకితమైంది. ఇప్పటికీ ఆపరేషన్ చేస్తే బాగు పడుతుందని చెప్పారు కానీ, యాభై శాతమే ఛాన్స్ ఉందన్నారు. దానిక్కూడా పాతిక లక్షలు ఖర్చవుతాయట. అంత డబ్బు ఎక్కణ్నుంచి తేగలను? వ్యాపారంలో రిస్క్ తీసుకుంటే డబ్బులు మాత్రమే పోతాయి కానీ, ఆరోగ్యం విషయంలో రిస్క్ తీసుకుంటే ప్రాణానికే ప్రమాదం. ఎలాగోలా బతికుంటే చాలని నా భార్య అన్నది. నూరు శాతం బాగయ్యే అవకాశం ఉందట కానీ, అందుకు యాభై లక్షలు కావాలి. పాతికకే గతిలేనివాణ్ని.. యాభై ఎక్కణ్నుంచి తేగలను?'' అన్నాడు విరక్తిగా. ''అదేమిట్రా. నువ్వు కొని పెట్టిన షేర్లున్నాయిగా''

''దురాశ దుఃఖమునకు చేటన్న సామెత నాకు సరిగ్గా అతికినట్టు సరిపోతుంది. ఉన్నవన్నీ అమ్మి అంతకన్నా మంచిదన్న అత్యాశతో వేరే ఒకే కంపెనీ షేర్లు కొన్నాను. తరువాత కొద్ది రోజులకే యాక్సిడెంట్ కావడంతో సుమారు రెండు నెలలు కోమాలో ఉన్నాను. ఆ సమయంలో కంపెనీ దివాలా తీసి వాటి విలువ దారుణంగా పడిపోయి.. మొత్తంగా లక్షకు చేరుకుంది. ఇప్పుడసలు ట్రేడింగ్‌లోనే లేదు. నాకు తెలివొచ్చాక అదీ పరిస్థితి. ఇంకేం చెయ్యగలను? ప్రస్తుతానికి నాకొచ్చే పెన్షన్‌తో జీవితాన్ని నెట్టుకొస్తున్నాను. షేర్ మార్కెట్ బిజినెస్ మొత్తంగా మానేశాను'' అన్నాడు వాసుదేవన్.

ఆ మాటలు విన్న శాండిల్య కేవలం రెండే నిమిషాలు ఆలోచించాడు.

''నూరు శాతం బాగవుతుందని చెప్పిందెవరు?'' అనడిగాడు.

''ఇక్కడ కాదు. అమెరికా వెళ్లాలి. అయ్యేపని కాదులే'' చప్పరించేశాడు వాసుదేవన్.

''ముందుగా నాకా వివరాలన్నీ ఇవ్వు'' అంటూ అతను వద్దని పలుమార్లు వారిస్తున్నా, బలవంతంగా అతన్నుంచి వివరాలన్నీ సేకరించి, అవిశ్రాంతిగా పనిచేసి.. రెండు వారాల్లోనే అమెరికా ప్రయాణానికి వాసుదేవన్‌ను సిద్ధం చేశాడు.

''నేను నీకిచ్చింది పది వేలే. అది తిరిగి ఇవ్వకున్నా నేనేమీ అనుకునేవాణ్ని కాదు. కానీ, నువ్వు పదివేలను కోటి రూపాయలకన్నా ఎక్కువగానే చేసి తిరిగిచ్చావు. అందులోనుంచి యాభై లక్షలు నీకోసం ఖర్చు చెయ్యలేనా? ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను మునుపటి వాసుదేవన్‌గా చూడటమే ప్రస్తుతం నా లక్ష్యం. ఈ విషయంలో నువ్వింకేమీ మాట్లాడకు'' అన్నాడు శాండిల్య.

అశ్రుపూరిత నయనాలతో..

''ఉన్నదాంట్లో తృప్తిగా జీవించడం ఎలాగో నిన్ను చూసి నేర్చుకోవాలిరా. ఇదే నేను నేర్చుకున్న అతి విలువైన జీవిత పాఠం'' అన్నాడు వాసుదేవన్.

అమెరికాలో రెండు నెలలు వాసుదేవన్‌ను దగ్గరుండి కంటికి రెప్పలా చూసుకున్నాడు శాండిల్య. రెండు నెలల తర్వాత పూర్తిగా కోలుకున్న వాసుదేవన్ టీవీగా నడుచుకుంటూ భారతదేశంలో అడుగుపెట్టాడు.. మిత్రుడితో సహా. ■

## సింగీతం ఘటికాచల రావు



'సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ!' అన్న వాక్యానికి అక్షరరూపమే ఈ కథ. రచయిత సింగీతం ఘటికాచల రావు. స్వస్థలం నెల్లూరు. మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా చేశారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా విరమణ పొందారు. పన్నెండో ఏట ఛందోబద్ధమైన కవిత్వంతో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. 1997లో రాసిన 'ఐదు పైసలు' సింగిల్ పేజీ కథ స్వాతి సపరివార పత్రికకు ఎంపికైంది. అలా, రచయితగా పత్రికల ద్వారా పాఠకులకు పరిచయమయ్యారు. హాస్య, సామాజిక, థ్రిల్లర్, సరసమైన.. ఇలా అన్నిరకాల కథలూ రాశారు. ఇప్పటివరకు 200 కథలు, 18 నవలలు ప్రచురితమయ్యాయి. 'పెంకుల వసారా' కథకు అనిల్ అవార్డ్ కన్సొలేషన్ బహుమతి అందుకున్నారు. పిచ్చుక గూళ్ల కథ.. స్వాతి మాసపత్రికలో అనిల్ అవార్డ్ గెలుచుకుంది. ఈయన మొదటి నవల మనసున మనసై.. స్వాతి మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైంది. పునర్జన్మ (రూ. లక్ష బహుమతి), రాగ విపంచి (సిపి బ్రౌన్ అకాడమీ అవార్డు), అజాత శత్రువు, సారేజహాసే అచ్ఛా నవలలకు వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీలో బహుమతి గెలుచుకోవడం ఇది రెండోసారి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కామెడీ కథ

# శివ పార్వతుల కలియుగ యాత్ర

అయినాపురపు వెంకట జగన్నాథ రావు

**పరమ పవిత్రమైన కైలాస పర్వతం.. ఒకరోజు దేవుడు (శివుడు), దేవమ్మ (పార్వతి దేవి) సోఫాలో కూర్చుని హోమ్ థియేటర్‌లో 'భూమి చానల్'లో వార్తలు చూస్తున్నారు.**

భూలోకంలో మనుషులు మైకులు పట్టుకుని "ధర్మం, మానవత్వం, నీతో" అంటూ పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇస్తున్నారు. అది చూసి శివుడికి ఒక వింత ఆలోచన వచ్చింది.

శివుడు ఆనందంగా "చూశావా పారూ! (శివుడు పార్వతిని ముద్దుగా పిలిచే పేరు) భూలోకంలో నా భక్తులు ఎంతగా మారిపోయారో! ఒకప్పుడు నన్ను చూడటానికి తపస్సులు చేసేవారు, ఇప్పుడు సమాజ సేవలోనే శివుడిని చూస్తున్నారు!" అన్నాడు.

పార్వతి కాఫీ కప్పు ఇస్తూ "స్వామీ! అది ఇన్‌స్టాగ్రామ్ రీల్. దానికి ఫిల్టర్లు ఉన్నట్లే, వాళ్ల హృదయాలకు కూడా ఫిల్టర్లు ఉంటాయి. భూమి మీద మనుషులు చాలా నీతులు మాట్లాడుతున్నారు.. నిజం తెలుసుకోవాలంటే ఒకసారి కిందికి వెళ్లి వాళ్ళని పరీక్షించాలి" అంది.

శివుడు స్టైల్‌గా చిటికేస్తూ "ఒకే! ఇప్పుడే వెళ్తాం" అన్నాడు.

ఇంకేముంది, ఇద్దరూ మధ్య తరగతి సామాన్యుల లాగా ముతక బట్టలు కట్టుకుని, చేతిలో పాత సంచులు పట్టుకుని భూలోకంలో అడుగుపెట్టారు.

అయితే, వాళ్లకు తెలియని విషయం ఏమిటంటే... ఇది సత్యయుగం కాదు, కలియుగం!

మొదట ఒక మెట్రో సిటీ చేరుకున్నారు. కైలాసం నుంచి చాలాసేపు ట్రావెల్ చేశారేమో ఇద్దరికీ కడుపులో ఎలుకలు పరిగెత్తి విపరీతంగా ఆకలి వేసింది. చుట్టూ చూస్తే కార్ల హారన్ల గోల, పొగ, అంతలో ఒక పెద్ద హోటల్ ముందు మెరుస్తున్న డిజిటల్ బోర్డు కనిపించింది. "మా వద్ద స్వచ్ఛమైన సాంప్రదాయ అమ్మ చేతి వంట లభించును.

"అమ్మో! మీ అమ్మగారు ఇక్కడికి వచ్చి వంట చేస్తున్నారా స్వామీ?" అంది పార్వతి అమాయకంగా.

"లేదు పారూ, అది ఒక బిజినెస్ స్ట్రాటజీ!" అంటూ లోపలికి వెళ్లారు.

శివుడు చాలా అమాయకంగా కౌంటర్ దగ్గరకు వెళ్లి, "అయ్యా! మేము పరదేశిలం, ఆకలిగా ఉంది, పిడికెడు అన్నం పెట్టండి.. పుణ్యం వస్తుంది" అన్నాడు.

హోటల్ క్యాషియర్ ఒక లుక్ ఇచ్చి, "పుణ్యమా? ఆ పక్కన గుడి దగ్గర ఉచితంగా దొరుకుతుంది వెళ్ళండి" అన్నాడు.

శివుడు నవ్వి, తన జేబులోంచి ఒక తళతళలాడే మాయా నాణెం తీసి కౌంటర్‌లో ఇచ్చాడు.

క్యాషియర్ ఆ నాణెం చూసి నవ్వి, "సార్! ఇది ఏనాటి కాలం కాయిన్? ఇక్కడ చిల్లర తీసుకోం. ఇక్కడ ఓన్లీ క్యాష్, స్కాన్, ఫోన్ పే లేదా గూగుల్ పే" అన్నాడు.

పార్వతి సర్దిచెప్తూ అమాయకంగా,

"మా దగ్గర ఆ 'పే' లేవు నాయనా.. కావాలంటే ఒక దివ్య శక్తిని నీకు ఇస్తాం, మీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. మా ఇద్దరికి కడుపునిండా అన్నం పెట్టండి" అంది..

అంతే! ఆ హోటల్ క్యాషియర్ సీరియస్ అయి, "ఓహో.. ఇదో కొత్త రకం మోసమా? బిల్లు కట్టకుండా దీవెనలు ఇస్తారా? మీ నాటకాలు సాగవు. మీ ఆధార్ కార్డు చూపించండి, క్యూఆర్ కోడ్ చూపించండి.. లేదంటే మీ ఫోన్ నంబర్ చెప్పండి, లింక్ పంపుతా" అన్నాడు.

చుట్టూ ఉన్న జనం వీళ్లను ఏదో వింతగా చూడసాగారు. కొందరు ఫోన్లలో రికార్డ్ చేయడం మొదలుపెట్టారు. చివరకు పార్వతి తన మెడలో ఉన్న నిజమైన బంగారు గొలుసును తీసి ఇస్తే కానీ ఆ క్యాషియర్ వదల్లేదు.

శివుడు ఆవేదనగా "మనిద్దరికీ పిడికెడు అన్నం కోసం నేనెంతో ప్రేమతో ఇచ్చిన నీ మెడలోని బంగారు గొలుసు ఇవ్వవలసి వచ్చింది. వీళ్ల వ్యాపార బుద్ధి ముందు మన మాయలు కూడా వేస్ట్ పారూ!" అన్నాడు.

పార్వతి నొచ్చుకుంది.

అది చూసి శివుడు "అయ్యో..! బంగారు గొలుసు కోసం బాధపడితే ఎలా? కావాలంటే క్షణంలో నీకు అంతకంటే పెద్దది మరొకటి ఇస్తానులే" అని ప్రేమగా దగ్గరకు తీసుకుని అన్నాడు.

"చాల్లెండి.. స్వామీ!, జోకులు వేసే సమయమా ఇది? మనం వచ్చింది భూలోకంలో వున్న మనుషులను పరీక్షించడానికి కదా" అంటూ శివుడిని నడుము మీద గిల్లి చెప్పింది పార్వతి.



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్‌అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

తను గిల్లిన చోట చేతితో రాసుకుంటూ "దేవమ్మా! నాకో ఆలోచన వచ్చింది. డబ్బులు లేకపోతే ఇక్కడ మనుగడ కష్టం అని తెలిసింది. అందుకని నేను ఉద్యోగంలో జాయిన్ అవుతాను. అప్పుడు సంపాదించి నీకు బంగారు గొలుసు కొనిస్తా" అన్నాడు శివుడు

"మీరు ఉద్యోగం చేస్తారా..!?" అంటూ ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టింది పార్వతి.

"ఇక్కడ ఉన్నన్నాళ్ళు తప్పేటట్లు లేదు పారూ!"

"సరే మీ ఇష్టం. మీకు తెలిసినంత నాకు తెలీదు కదా!" అంటూ తన రెండు కళ్ళూ చక్రాలలాగా తిప్పుతూ అంది పార్వతి.

అనుకుందే తడవుగా ఇద్దరూ ఒక ఆఫీసుకు వెళ్లారు. అక్కడ సెక్యూరిటీ వాడు వీళ్ల గెటప్ చూసి ఆశ్చర్యపోతూ "ఏంటి.. ఇంటర్వ్యూకా? లోపలికి వెళ్లండి" అన్నాడు.

రూమ్‌లోకి వెళ్లగానే అక్కడ ఒక మేనేజర్ కూర్చుని ఉన్నాడు. శివుడిని చూసి, "మీ బయోడేటా ఏది? మీ క్వాలిఫికేషన్ ఏంటి?" అని అడిగాడు.

శివుడు "నేను సృష్టిని, స్థితిని గమనించేవాడిని. లయకారకుడను, సర్వజ్ఞుడను. బ్రహ్మాండాన్ని శాసించగలను" అన్నాడు గాంభీర్యంగా.

మేనేజర్ తల పట్టుకుని, "అయ్యా! ఆ డైలాగులు సినిమాలో బాగుంటాయి సార్. ఇక్కడ జాబ్ రావాలంటే కంప్యూటర్ వచ్చా? కోడింగ్ వచ్చా? కనీసం టైపింగ్ వచ్చా? కంప్యూటర్ కోర్సులు ఏమైనా చేశారా?" అని అడిగాడు.

పార్వతి మధ్యలో అందుకొని, "మాకు ప్రకృతిని రక్షించడం వచ్చు నాయనా.. మనుషుల మనసుల్లోని బాధలు తీర్చడం వచ్చు" అంది.

దానికి ఆ మేనేజర్ వింతగా నవ్వి, "సారీ అండీ, మా కంపెనీకి లాభాలు కావాలి కానీ.. ప్రకృతి రక్షణలు, పర్యావరణాలు మాకొద్దు. మీకు కమ్యూనికేషన్ స్కిల్స్ అస్సలు లేవు. మీరు "నాట్ ఫిట్.. నెక్స్ట్" అంటూ బయటకు పంపించేశాడు.

> **"మీరు ఉద్యోగం చేస్తారా..!?" అంటూ ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టింది పార్వతి.**
> **"ఇక్కడ ఉన్నన్నాళ్ళు తప్పేటట్లు లేదు పారూ!"**
> **"సరే మీ ఇష్టం. మీకు తెలిసినంత నాకు తెలీదు కదా!" అంటూ తన రెండు కళ్ళూ చక్రాలలాగా తిప్పుతూ అంది పార్వతి.**

బయటకు వచ్చిన తర్వాతి రోడ్డు దాటుదామని నిలబడ్డారు. వాహనాలు రాకెట్లల కంటే వేగంగా దూసుకుపోతున్నాయి. ఎవరూ ఆగడం లేదు. శివుడు తన దైవ శక్తులతో చేతిని పైకెత్తి వాహనాలను ఆపాలని చూశాడు.

ఒక బైక్ వాడు సడన్‌గా బ్రేక్ వేసి, "ఏయ్! రోడ్డు నీ ముత్తాతదా? రోడ్డు దాటే ముందు రెండు పక్కల చూసుకోవాలి కదా!" అని నోటికొచ్చినట్టు మాట్లాడి, జుమ్మంటూ వెళ్లిపోయాడు.

పార్వతి కళ్లల్లో నీళ్ల తిరిగాయి. "స్వామీ! మనం ఎవరికైతే వరాలు ఇస్తున్నామో, ఆ మనుషులకు ఇంత కోపమా? కనీసం ఎదుటివాళ్లని గౌరవించే సంస్కారం కూడా లేదా?" అని బాధపడింది.

కొంచెం ముందుకు వెళ్లేసరికి రోడ్డు పక్కన ఒక ముసలివాడు కడుపునొప్పితో బాధపడుతూ పడిపోయి ఉన్నాడు. చుట్టూ వంద మంది ఉన్నారు, కానీ ఎవరూ అతన్ని పట్టించుకోవడం లేదు.

అందరూ ఫోన్లు తీసి "లైవ్ వీడియోలు, రీల్స్" చేస్తున్నారు!

ఇది చూసి శివుడు తట్టుకోలేకపోయాడు. వెంటనే జనాన్ని తోసుకుంటూ వెళ్లి, ఆ ముసలివాడి తల నిమిరి, తన దైవ శక్తితో క్షణంలో అతని కడుపునొప్పి నయం చేశాడు.

ఆ ముసలివాడు హ్యాపీగా లేచి కూర్చున్నాడు. అంతే! చుట్టూ ఉన్న జనం ఒక్కసారిగా గొడవ మొదలుపెట్టారు!

"అరేయ్! వీడు ఎవడో మాయలు చేస్తున్నాడు.. యూట్యూబ్‌లో పెట్టండి, మిలియన్ వ్యూస్ వస్తాయి!"

"బాబా గారూ! మా అబ్బాయికి ఐటీ ఉద్యోగం వచ్చేలా వరం ఇవ్వండి!" అంటూ కాళ్ల మీద వంద మంది పడిపోయారు.

మరికొందరేమో "వీడు నకిలీ బాబా.. హిప్నాటిజం చేస్తున్నాడు. పోలీసులకు ఫోన్ చేయండి జైల్లో పెట్టించండి" అన్నారు.

నిజమైన సహాయం చేసినప్పుడు రాని జనం, ఒక వింత చూడగానే చుట్టుముట్టడం కెమెరాలు మొహానికి పెట్టడం చూసి శివుడు, పార్వతిలకు మతిపోయింది. జనాల తొక్కిసలాట, ఆ కెమెరా ఫ్లాష్ లైట్లు తట్టుకోలేక, ఆఖరికి ఇద్దరూ అక్కడ నుంచి పరుగెత్తారు.

నగరం దాటి, సాయంత్రానికి ఒక చిన్న గ్రామానికి చేరుకున్నారు. అంతలో దట్టమైన మేఘాలు పట్టి, ఉరుములు, మెరుపులతో పెద్ద వర్షం ప్రారంభమైంది. చలికి వణుకుతూ ఇద్దరూ ఒక చిన్న తాటాకు గుడిసె దగ్గర ఆశ్రయం అడిగారు. లోపల ఓ పేద కుటుంబం ఉంది. భార్యాభర్తలు, ఒక చిన్న బాబు, పాప, వాళ్ళ ఒంటి మీద సరిగ్గా బట్టలు లేవు, ఇంట్లో చూస్తే దరిద్రం తాండవిస్తోంది. ఒక పక్క నుంచి గుడిసె కారుతోంది.

కానీ, తడిసి వణుకుతున్న వీళ్లను చూడగానే ఆ ఇంటి మహిళ ఆదరంగా లోపలికి పిలిచింది. తడిసిన వాళ్ల తలలు తూడ్చుకోవడానికి తనకున్న ఒకే ఒక్క మంచి తువ్వాలు ఇచ్చింది.

ఇంట్లో ఉన్నది కొంచెమే గంజి అన్నం. అయినా ఆమె నవ్వుతూ "అయ్యా! ఈ రోజు మేము కొంచెం తక్కువ తింటాం. వర్షంలో వచ్చారు, ఆకలిగా ఉంటుంది... మీరు కూడా మాతో కలిసి ఈ కొద్దిపాటి అన్నం పంచుకోండి" అంటూ ఎంతో ప్రేమగా విస్తరి వేసి వడ్డించింది. ఆ అన్నం అమృతం కంటే గొప్ప రుచి ఉంది.

ఆ చిన్న పిల్లవాడు తనకున్న సగం చాపను దంపతులుగా ఉన్న శివుడు, పార్వతిలకు పక్కకు జరిపి ఇచ్చాడు. ఆ రాత్రంతా ఆ చిన్న పాప భయం లేకుండా వీళ్ళిద్దరి పక్కన కూర్చుని ముద్దు ముద్దుగా కబుర్లు చెబుతూనే ఉంది. నగరంలో కనిపించని అమాయకత్వం, స్వచ్ఛమైన ప్రేమ ఆ పల్లెటూరి గుడిసెలో కనిపించాయి.

- మానవత్వం విజయం పొందాలంటే సాత్వికశక్తి అవసరం.
- మానవత్వంలో పవిత్రమైన చట్టం సమానత్వం.
- మనందరం తెలివైన వాళ్లమే. అయితే తెలివిగా వుండటానికి ప్రయత్నించినంత మాత్రాన ప్రయోజనం లేదు. కొద్దిగానైనా దయాదాక్షిణ్యాలు చూపడానికి ప్రయత్నించండి.
- ఉన్నత మానవత్వం తెలివితేటలలో కాక చిత్తవృత్తిలో నివసిస్తుంది.

పార్వతి కళ్లలో ఆనందబాష్పాలు తిరిగాయి. ఆమె శివుడి వైపు చూసి, "స్వామీ! ఇంకా భూమి మీద మానవత్వం పూర్తిగా చనిపోలేదు. ఈ పేద హృదయాలలో ఇంకా బతికే ఉంది. నా గొలుసు పోయినా పర్లేదు స్వామీ.. ఈ ప్రేమ ముందు అది చాలా చిన్నది" అంది ఎమోషనల్‌గా.

శివుడు ఆ పిల్లల తలపై చెయ్యి వేసి దీవిస్తూ మెల్లగా అన్నాడు.

"నిజమే దేవి! సంపద అనేది చేతిలో, బ్యాంకులో, గూగుల్ పేలలో ఉంటుంది. కానీ దయ, మానవత్వం మాత్రం కేవలం ఇలాంటి నిర్మలమైన హృదయంలోనే ఉంటాయి. కోట్లు ఉన్నవాడు కాదు, ఉన్నదానిలో పెట్టే వీళ్లే నా నిజమైన భక్తులు. ఈ గుడిసె ఇకపై ఎప్పటికీ దరిద్రం చూడదు!" అని మనసులోనే ఆశీర్వదించాడు. ఆ క్షణమే ఆ ఇల్లు ధనధాన్యాలతో నిండిపోయేలా వరం ఇచ్చాడు.

తెల్లవారింది. వర్షం తగ్గింది. మనుషుల ప్రవర్తనను పూర్తిగా అర్థం చేసుకున్న పార్వతి, "స్వామీ! ఇక్కడ మనుషులు మనుషుల్లా లేరు.. అందరూ 'సోషల్ మీడియా' రోబోల్లా మారిపోయారు. ఇంకాసేపు ఉంటే మనల్ని కూడా ఒక 'ట్రెండింగ్ రీల్' చేసి, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ పెట్టి వైరల్ చేసేలా ఉన్నారు. పదండి, కైలాసానికి వెళ్లి హ్యాపీగా నెట్‌వర్క్ లేని చోట ప్రశాంతంగా ఉందాం" అంది నవ్వుతూ.

శివుడు గట్టిగా నవ్వి, "నిజమే దేవి.. వీళ్లకు నా మీద భక్తి కంటే, దేవుడి భయం కంటే... 'డేటా ప్యాక్' అయిపోతుందనే భయమే ఎక్కువ ఉంది. ఇక సెలవు!" అంటూ ఇద్దరూ గాల్లోకి లేచి అదృశ్యమయ్యారు.

> **శివుడు గట్టిగా నవ్వి, "నిజమే దేవి.. వీళ్లకు నా మీద భక్తి కంటే, దేవుడి భయం కంటే... 'డేటా ప్యాక్' అయిపోతుందనే భయమే ఎక్కువ ఉంది. ఇక సెలవు!" అంటూ ఇద్దరూ గాల్లోకి లేచి అదృశ్యమయ్యారు.**

రాకెట్ వేగంతో కైలాసానికి చేరుకుని, ఫోన్ల గోల లేని ఆ ప్రశాంతతను చూసి ఇద్దరూ ఊపిరి పిల్చుతున్నారు!

సోఫాలో కూర్చుని అలసట తీర్చుకుంటుండగా, శివుడు నవ్వుతూ పార్వతి వైపు చూసి, "చూశావా పారూ, భూలోకంలో విచిత్రం! ఈ కలియుగ మనుషులకి "వైఫ్ కన్నా వైఫై ఎక్కువ ముఖ్యం అయిపోయింది!" అన్నాడు.

దానికి పార్వతి కూడా నవ్వి, " బాగుంది మీ వరస! అలాగే అక్కడి ఆడవాళ్లకి హస్బెండ్ కన్నా బ్రాడ్ బ్యాండ్ మోక్షం ఎక్కువైపోయింది స్వామీ!" అంది చమత్కారంగా.

ఆ మాటలకు ఇద్దరూ గట్టిగా నవ్వుకున్నారు.

కైలాసం నుంచి భూమికి, భూమి నుంచి మానవ హృదయాల లోతుల వరకు సాగిన ఆ 'శివపార్వతుల కలియుగ యాత్ర' ఒక తియ్యటి చిరునవ్వుతో, అంతకంటే గొప్ప ఆలోచనతో ముగిసింది!

## వర్షాకాలంలో ఆకుకూరలు తినకూడదా?

వర్షాకాలంలో ఆకుకూరలు (తోటకూర, గోంగూర, మెంతికూర, పాలకూర మొ॥) తినకపోవడమే అంటుంటారు. దీని వెనుక బలమైన శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. తేమ ఎక్కువగా ఉండే ఈ వాతావరణంలో బ్యాక్టీరియా, ఫంగస్, పరాన్నజీవులు వేగంగా పెరుగుతాయి. ఆకులపై ఇవి సులభంగా చేరతాయి. దీని వల్ల విరేచనాలు, వాంతులు లాంటి సమస్యలు రావచ్చు. ఆకుకూరలు నేలకు దగ్గరగా పెరుగుతాయి కాబట్టి, వర్షపు నీటిలోని బురద, క్రిములు వాటి ఆకులకు సులభంగా అంటుకుంటాయి.

**పురుగులు, వాటి గుడ్లు:** ఈ సీజన్‌లో ఆకుకూరల వెనుక చిన్న చిన్న పురుగులు, కంటికి కనిపించని వాటి గుడ్లు ఎక్కువగా ఉంటాయి. మనం ఎంత బాగా కడిగినా కొన్నిసార్లు ఇవి వదిలిపోవు. ఇవి పొరపాటున కడుపులోకి వెళ్తే తీవ్రమైన కడుపునొప్పి, ఇన్‌ఫెక్షన్లు వస్తాయి.

**జీర్ణశక్తి తగ్గడం:** వర్షాకాలంలో మన శరీరంలో జీర్ణక్రియ మందగిస్తుంది. ఆకుకూరల్లో పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల, వాటిని అరిగించుకోవడానికి జీర్ణాశయం ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు వస్తాయి.

**కలుషితమైన నీరు:** వానాకాలంలో మురుగునీరు, వరద నీరు పొలాల్లోకి చేరే అవకాశం ఉంది. ఆకుకూరలు ఆ కలుషిత నీటిని పీల్చుకోవడం వల్ల వాటిలో ఈకోలి సాల్మొనెల్లా వంటి ప్రమాదకర బ్యాక్టీరియాలు చేరతాయి. ఇవి ఫుడ్ పాయిజనింగ్, డయేరియా (విరేచనాలు)కి దారితీస్తాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** శుభ్రమైన నీటిలో 2-3 సార్లు బాగా కడగాలి. అవసరమైతే ఉప్పు నీరు/వెనిగర్ కలిపిన నీటిలో 10-15 నిమిషాలు నానబెట్టి మళ్లీ కడగాలి. తాజాగా ఉన్న ఆకుకూరలనే కొనాలి. పాడైనవి లేదా పసుపు రంగు పట్టినవి తీసుకోకూడదు. వండిన తర్వాత ఎక్కువసేపు బయట ఉంచకుండా వెంటనే తినడం మంచిది. ఆకుకూరలను పచ్చిగా (సలాడ్స్ రూపంలో) అస్సలు తినకూడదు. వాటిని హై ఫ్లేమ్‌లో బాగా ఉడికించి లేదా ఫ్రై చేసి మాత్రమే తినాలి.

వర్షాకాలంలో హోటల్స్ లేదా రోడ్‌సైడ్ బండ్ల మీద దొరికే ఆకుకూరల వంటకాలు (ఉదాహరణకు: పాలక్ పనీర్, పుదీనా చట్నీ) తినకపోవడం చాలా ఉత్తమం. ఈ కాలంలో ఆకుకూరలకు ప్రత్యామ్నాయంగా సొరకాయ, బీరకాయ, పొట్లకాయ, దొండకాయ వంటి తీగజాతి కూరగాయలను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది!

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం.
రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త,
నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
*sunmagvaartha@gmail.com*

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
4 | 12 ఆదివారం, జూలై 2026

కథ

"పదిమంది ప్రాణాలు కాపాడే నాన్నకు ఏమీ కాదమ్మా! నువ్వు బాధపడకు" పెద్దదానిలా ఓదార్చింది 13 ఏళ్ల స్వర్ణలత".

"మీ నాన్నగారు వచ్చేలోపు నువ్వు, అక్క కలిసి దీపాలు పెట్టేయండి" అని చిన్న కూతురుకి చెప్పి,

"అమ్మా శాంతా! దీపాలు పెడుదువు గాని రామ్మా!" అని పెద్ద కూతురుని బిగ్గరగా పిలిచింది.

ఆ కేక వింటూ పెరట్లోని బావి దగ్గరకు వెనక వీధి నుండి శబ్దం చేయకుండా వచ్చిన సత్తిరాజు, నెమ్మదిగా నీళ్లు తోడుకుని,పై షర్ట్ తీసేసి, గాయాలు కడుక్కోసాగాడు. బాధకు "అమ్మా" అనే శబ్దం చిన్నగా చేస్తూ, ఒళ్లంతా కడుక్కుని, మసి పూర్తిగా పోయిందని నిర్ధారించుకున్నాక అక్కడే, దండంమీద ఉన్న టవల్ తీసుకుని, పెరటి గుమ్మం నుంచి లోపలికి నిశ్శబ్దంగా వెళ్లి, మంచి బట్టలు వేసుకుని భార్యాపిల్లలు ఉన్న హాల్లోకి నడిచాడు.

"నాన్న వచ్చారు. నాన్న వచ్చారు" అంటూ గంతులేస్తూ వచ్చిన అబ్బుల్ని దగ్గరికి తీసుకుని" టపాకాయలు కాల్చేద్దామా?" అని అడిగాడు రాజు.


గబగబా తలఊపిన కొడుకు బుగ్గమీద ముద్దు పెట్టి...

"రండమ్మా! నువ్వు రావే" అంటూ టపాకాయలు సంచి తీసుకుని, అబ్బులు చేయి పట్టుకుని, వీధిలోకి నడిచాడు.

ఆడపిల్లలు ఇద్దరు సంతోషంగా మతాబులు కాలుస్తున్నారు. పిల్లవాడు చిచ్చుబుడ్డి వెలిగించడానికి భయపడుతున్నాడు. వాడు చెయ్యి పట్టి చిచ్చుబుడ్డి వెలిగిస్తూ...







# బడబాగ్ని రాజు

శశి, 9553809850

"రేయ్ మన రాజు ఎక్కడున్నాడో చూడండి రా! మంటలు పెరిగిపోతున్నాయి. పక్క ఇళ్లకి కూడా అంటుకుంటున్నాయి" కేకేశారు జనాల గుంపులోంచి ఒకరు.

"తగలబడుతున్న ఇళ్లలో మనుషులు ఉన్నారు. త్వరగా పరిగెత్తండి రా" అరిచారు మరొకరు.

"రేయ్ ఇంటికి ఒకరు, పొలానికి ఒకరు వెళ్లండి రా! ఎందుకైనా మంచిది" అరిచాడు వెంకటేష్ పరిగెడుతున్న కుర్రాళ్లని చూసి.

అప్పటివరకు చిన్నారుల నవ్వులతో, దీపాల కళకళలతో, కుర్రకారుల తారాజువ్వల జోరుతో, సంతోషానికి సుస్థిర స్థానంగా ఉన్న, ఆ పల్లె, తిరుపతిపురం ఒక్కసారి ఉలిక్కిపడింది.

పక్కాగృహాలు అంతగా లేని ఆ పల్లెలో తారాజువ్వలు, సిసింద్రీలు పడి తాటాకు ఇళ్లపై మంటలు అంటుకున్నాయి. హాహాకారాలు చెలరేగాయి.

వార్త వినడంతోనే పెద్దపులిలా లంఘించాడు రాజు.

మంటల్లోకి దూసుకువెళ్లి, లోపల వాళ్లని ఒక్కొక్కరినే జాగ్రత్తగా తీసుకువస్తున్న రాజును చూసి,

"తాతా! ఎవరీయన? ఈయనకు నిప్పు కాలదా? అలా ఎలామంటల్లోకి వెళ్తున్నారు?" అడిగాడు. దీపావళి పండక్కి తాతగారి ఇంటికి వచ్చిన సూరిబాబు మనవడు అర్జున్.

"ఆయన మా ఊరు దేవుడు బాబు! ఇప్పుడే కాదు, ఎప్పుడు ఊళ్లో మంటలు చెలరేగినా, ఇళ్లకు నిప్పు అంటుకున్నా, ఏమాత్రం తొనుకు, బెనుకు లేకుండా మంటల్లోకి ధైర్యంగా దూకి, మంటలకు ఎవరూ బలవకుండా కాపాడుతూ ఉంటాడు.

వేసవిలో, దీపావళి సమయంలో, ఎక్కడో అక్కడ మంటలు అంటుకోవటం, ఈయన మంటల్లోకి దూకి జనాల్ని కాపాడటం ఎన్నో ఏళ్లుగా జరుగుతోంది బాబు."

"మరి ఆయనకి నిప్పు కాలదా? ఏమీ అవ్వదా?"

"ఎందుకు కాలదు బాబు? కాలుతుంది. ఆ నిప్పుల తాలూకా మచ్చలు ఆయన వంటి నిండా ఉంటాయి అయినా ఆ నిప్పుకాయన భయపడి ఆగిపోడు."

"ఓ ఫైర్‌మాన్ భలే భలే"

"ఒక్క నిప్పు నుండి కాపాడటమే కాదు, మన ప్రాంతంలో నీటి బావులు వాడకం ఎక్కువ. వాటి లోతు కూడా చాలా ఎక్కువ. వాటిల్లో పిల్లలు ఆడుకుంటూ పడిపోతూ ఉంటారు. వాళ్లని కూడా ప్రాణాలకి తెగించి బావిలోకి దూకి రక్షిస్తూ ఉంటాడు."

"సూపర్ మాన్! సూపర్ మాన్!" అంటూ గంతులేసాడు ఐదేళ్ల అర్జున్.

ఇంటి యజమాని రంగయ్యను కూడా, భుజాల మీద వేసుకువస్తున్న రాజును చూసి, గ్రామస్తులు గబగబా ఎదురువెళ్లి, రంగయ్యను అందుకుని, రెండిల్లు అవతల అరుగుమీద పడుకోపెట్టారు. కొంతమంది జనం, రంగయ్యకు అంతకుముందే కాపాడి అక్కడ కూర్చోబెట్టిన, రంగయ్య భార్య, పిల్లలకు ఉపచారాలు చేయటంలో మునిగిపోయారు.

మరికొంతమంది రాజును

(మిగతా 5వ పేజీలో)

## కవి యానం

కవి చుక్కాని పట్టుకున్నాడు
చింతన నావను నడిపిస్తున్నాడు,
దిక్సూచి చూస్తున్నాడు
దిశానిర్దేశాల వెలుగులు పంచుతున్నాడు॥

కవి విషయాలు వెదుకుతున్నాడు
విశ్వమంతా విహరిస్తున్నాడు,
అనుభవాల ముత్యాలను ఏరుకుంటున్నాడు
అక్షరహారాలను అల్లుతున్నాడు॥

కవి ప్రకృతిని పలకరిస్తున్నాడు
పరవశ గీతాలు రాస్తున్నాడు,
పల్లెల పొలాల పరిమళాలను పంచుతున్నాడు
కవితాపుటల్లో పరమతున్నాడు॥



కవి మనుషులను గమనిస్తున్నాడు
మనసుల లోతులు కొలుస్తున్నాడు,
నవ్వుల్లోని మాధుర్యాన్ని చాటుతున్నాడు
కన్నీళ్లలోని కారుణ్యాన్ని ఆవిష్కరిస్తున్నాడు॥

కవి కాలంతో పాటు నడుస్తున్నాడు
కథలను కవితలుగా మలుస్తున్నాడు,
సమాజ స్పందనలను గ్రహిస్తున్నాడు
సత్యస్వరాలను వినిపిస్తున్నాడు॥

కవి ప్రయాణం సాగిస్తున్నాడు
ప్రపంచాన్ని పాఠశాలగా చేసుకున్నాడు,
ప్రతి అడుగును అనుభవంగా మలుస్తున్నాడు
ప్రతి క్షణాన్ని అక్షరబద్ధం చేస్తున్నాడు॥

కవి కవితలు కూర్చుతున్నాడు
కల్పనలకు రెక్కలు తొడుగుతున్నాడు,
భావాలకు భాషను ఇస్తున్నాడు
భవ్యదివ్య కావ్యాలను విరచిస్తున్నాడు॥

కవి కలం కదిలిస్తున్నాడు
కవనజల్లులు కురిపిస్తున్నాడు,
కవి హృదయం విప్పుతున్నాడు
కొత్త లోకాలు చూపిస్తున్నాడు॥

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# బడబాగ్ని రాజు

(కథ-4వ పేజీ తరువాయి)

చుట్టుముట్టారు.

"అంత దూకుడు ఎందుకురా రాజు? కొంచెం చూసుకోవాలి కదా? నీకు ఏమైనా అయితే నీ భార్య, పిల్లలు ఏమైపోతారో ఆలోచించుకోవాలి కదా?" మెత్తగా మందలించాడు జనార్దన్‌రావు.

× × ×

"అమ్మా! నాన్న ఏరి? ఎప్పుడు వస్తారు? అందరూ చిచ్చుబుడ్లు, మతాబులు కాల్చేస్తున్నారు. నువ్వేమో నాన్న వచ్చాక కాల్చుకుందువు గాని! అని అన్నావు. ఇంకా ఎంతసేపు? అమ్మ" వంటింట్లో అమ్మ కొంగును పట్టుకుని పేచి పెట్టాడు చిన్నవాడైన అబ్బులు.

"ఏ సమాజ సేవకో వెళ్లుంటారు. ఇవ్వాళ అసలే దీపావళికదా!" విసుగ్గా అంది నాగరత్నమ్మ.

"ఎందుకమ్మా అలా అంటావ్? నాన్నగారు చేసేది మంచి పనే కదా!" వెనకేసుకొచ్చింది రెండో కూతురు స్వర్ణలత.

"మీ నాన్నగారు చేసేది మంచిపని అని నాకు తెలుసు చిన్న పాప.

ప్రతిసారి ప్రమాదంలోకి దూసుకెళ్తారు. ఆయనకేమవుతుందో అని నా భయం. మొన్న వేసవిలో పొలం దగ్గర రాముడిల్లు తగలబడితే నీకు గుర్తుందా? ఆ ఇంటిల్లపాదిని రక్షించారు. కానీ కాలేదూలం మీదపడి భుజం మీద పెద్ద గాయం అయింది. మానటానికి చాలారోజులు పట్టింది. మీ నాన్న ఎంత ఇబ్బంది పడ్డారో గుర్తుందా? చిన్న చిన్న దెబ్బలు అయితే పర్వాలేదు. పెద్ద దెబ్బ అయితే ఎంత ఇబ్బంది పడాలి? ఎంత బాధ పడాలి? ఆయన బాధను చూసి మనం కూడా బాధపడాలి. ఆయన క్షేమంగా ఇంటికి రావాలని రోజూ నేను దేవుని వేడుకుంటాను"

"పదిమంది ప్రాణాలు కాపాడే నాన్నకు ఏమీ కాదమ్మా! నువ్వు బాధపడకు" పెద్దదానిలా ఓదార్చింది 13 ఏళ్ల స్వర్ణలత".

"మీ నాన్నగారు వచ్చేలోపు నువ్వు, అక్క కలిసి దీపాలు పెట్టేయండి" అని చిన్న కూతురుకి చెప్పి,

"అమ్మా శాంతా! దీపాలు పెడుదువు గాని రామ్మా!" అని పెద్ద కూతురుని బిగ్గరగా పిలిచింది.

ఆ కేక వింటూ పెరట్లోని బావి దగ్గరకు వెనక వీధి నుండి శబ్దం చేయకుండా వచ్చిన సత్తిరాజు, నెమ్మదిగా నీళ్ల తోడుకుని,పై షర్ట్ తీసేసి, గాయాలు కడుక్కోసాగాడు. బాధకు "అమ్మా" అనే శబ్దం చిన్నగాచేస్తూ, ఒళ్లంతా కడుక్కుని, మసి పూర్తిగా పోయిందని నిర్ధారించుకున్నాక అక్కడే, దండంమీద ఉన్న టవల్ తీసుకుని, పెరటి గుమ్మం నుంచి లోపలికి నిశ్శబ్దంగా వెళ్లి, మంచి బట్టలు వేసుకుని భార్యాపిల్లలు ఉన్న హాల్లోకి నడిచాడు.

"నాన్నవచ్చారు. నాన్నవచ్చారు" అంటూ గంతులేస్తూవచ్చిన అబ్బుల్ని దగ్గరికి తీసుకుని" టపాకాయలు కాల్చేద్దామా?"అని అడిగాడు రాజు.

గబగబా తలఊపిన కొడుకుబుగ్గమీద ముద్దు పెట్టి...

"రండమ్మా! నువ్వు రావే" అంటూ టపాకాయలు సంచి తీసుకుని, అబ్బులు చేయి పట్టుకుని, వీధిలోకి నడిచాడు.

ఆడపిల్లలు ఇద్దరు సంతోషంగా మతాబులు కాలుస్తున్నారు. పిల్లవాడు చిచ్చుబుడ్డి వెలిగించ డానికి భయపడుతున్నాడు. వాడు చెయ్యి పట్టి చిచ్చుబుడ్డి వెలిగిస్తూ...

"బట్టలను నూతి దగ్గరే పడేశాను. నాగరత్నమ్మ పొద్దుటే ఆ కాలిన బట్టలు చూసి, గొడవ చేస్తుందేమో" అని ఒక్క క్షణం మనసులో భయపడి,"తెల్లవారితే ఎలాగో విషయం తెలుస్తుందిగా అప్పుడు చూద్దాంలే" అనుకుని నవ్వుతున్న పిల్లల్ని సంతోషంగా చూశాడు సత్తిరాజు.

భర్త క్షేమంగా పిల్లలతో కలిసి ఇంట్లో ఉండటం చూసిన, నాగరత్నమ్మ చిరునవ్వుతో ఆయన్ని ప్రేమగా చూసి, తృప్తిగా నిట్టూర్చింది.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురం అనే కుగ్రామంలో1934 - 2021 మధ్యలో జీవించి, యావజ్జీవితం జనుల ప్రాణ రక్షణకే ధార పోసిన గుత్తికొండ సత్తిరాజు గారి యధార్థ జీవిత గాథ ఆధారంగా రాసిన కథ)


## స్వీకారం





సెల్‌నానీలు-చలపాక ప్రకాష్
పేజీలు:56, వెల: రూ.50/-
ప్రతులకు: చలపాక ప్రకాష్, 1-4/3-36, సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-520012,ఎ.పి., సెల్‌నం.92474 75975
మరియు విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ అన్ని బ్రాంచీలలో

కవిత్వం కురిసింది-చెన్నాప్రగడ శర్మ
పేజీలు:112, వెల: రూ.120/-
ప్రతులకు: సిహెచ్. వి.ఎస్.ఎస్.శర్మ డోర్‌నం.29-19-8/1, సుబ్రహ్మణ్య టవర్స్, దొర్నకల్ రోడ్, సూర్యారావుపేట విజయవాడ-520002, ఎ.పి.
సెల్: 94405 87567



డా. కపిలవాయి లింగమూర్తివ్యాసాంతరంగం (పుస్తక పరిచయాలు-సమీక్షలు) ఆరవభాగం
సంపాదకులు: కపిలవాయి అశోక్‌బాబు ప్రొఫెసర్ కె.కృష్ణమూర్తి
పేజీలు: 273, వెల: రూ.300/-



డా. కపిలవాయి లింగమూర్తి చారిత్రక వ్యాసాలు
తెలంగాణచరిత్ర-సంస్కృతి-క్షేత్ర-గ్రామచరిత్రలు ఏదవభాగం
సంపాదకులు:కపిలవాయి అశోక్‌బాబు
పేజీలు: 260, వెల: రూ.300/-

ఈ రెండు పుస్తకాలకోసం: కపిలవాయి అశోక్‌బాబు, ప్లాట్‌నం.404, సి బ్లాక్ వైదేహి నివాస్ గోల్డెన్‌పామ్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్ హైదరాబాద్-500044 మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాల్లో

## మీకు తెలుసా?

ఇష్టమైన పదార్థం ఎదురుగా కనిపించినా, దాని వాసన తగిలినా మనకు వెంటనే నోరు ఊరుతుంది. ఇది అప్రయత్నంగా జరిగే చర్య, మనిషికి కలిగే అనుభవాలు మెదడులో నమోదవుతుంటాయి. మనం ఒకసారి తిని, బాగా ఇష్టపడిన వంటకం వాసన, రంగు మెదడులో నమోదు అవుతాయి. మరోసారి ఆ వాసన తగలగానే గత అనుభవాన్ని మెదడు నెమరు వేసుకుంటుంది. దీని ఫలితంగానే మనకు నోరు ఊరుతుంటుంది.

× × ×

తొలి యానిమేషన్ చిత్రం హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్. ఈ చిత్రాన్ని 1906లో జె.స్టువర్టు బ్లాక్టన్ అనే అమెరికన్ తీశాడు.



సూర్యుడు, నక్షత్రాలు వంటి సహజ కాంతి జనకాల నుంచీ, మనం కల్పించిన కొవ్వొత్తి, టార్చిలైట్ వంటి కృత్రిమ కాంతి జనకాల నుంచి వెలువడి దృశ్యానుభవం కలిగించే శక్తి రూపమైన భౌతికరాశినే "కాంతి" అంటాం. కాంతికి కొన్నిధర్మాలు వున్నాయి. పరావర్తనం, వక్రీభవనం, విక్షేపణం, పరిక్షేపణం, వ్యతికరణం, వివర్తనం, ధృవణం అనే ధర్మాలు వున్నాయి. కాంతి ఒక యానకంలో నుంచి మరో యానకంలోకి వెళ్ళినప్పుడు వక్రీభవనమో పరావర్తనమో చెందుతుంది. ఈ రెండు ప్రక్రియల వల్లనే కాంతి మన దృష్టికి అనేకానేక విచిత్రాలను ప్రదర్శిస్తుంది.

× × ×



గబ్బిలాలు ఒకదానితో మరొకటి మాట్లాడు కుంటాయి. వాటి ధ్వనితరంగాలు మనకి వినపడవు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 6 | 8 | | | | 9 | | 2 |
| | | | 3 | | 1 | | | |
| | 3 | | 6 | 2 | | | | |
| | | 9 | | | | 1 | | 6 |
| | | 1 | | | | 3 | 7 | |
| | 4 | 3 | 5 | | | | | 9 |
| | | | 8 | | 2 | 6 | | |
| | | | 9 | | 5 | | 2 | 3 |
| 2 | | 6 | | 3 | | 7 | | |

× × ×

పత్రికలలో కన్పించే "సుడొకు" అనే అంకెల ఆట 1895 నుండి వుంది. జపాన్‌లో దీనికి ఒక రూపం 1984లో ఏర్పడింది. సుడొకు అంటే "ఏక అంకె' అని అర్థం.

× × ×

తరంగాలు ఏదైనా చిన్న అవరోధాన్ని తాకినపుడు అవి ఆ అవరోధం అంచుల దగ్గర వంగి ప్రయాణిస్తాయి. దీనినే వివర్తనం అని అంటారు. ఒక గదిలోని మాటలు వేరొక గదిలోకి వినిపించడానికే వెంట్రుక, బ్లేడు వంటి పదార్థాల అంచుల మీద ఏక వర్ణకాంతి పడినప్పుడు వాటి [illegible]య ఛాయాలలో కొన్ని వెలుగు, చీ[illegible]ం ఏర్పడడానికీ కారణం - వివర్తనం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చిన్న కథలు

## కొబ్బరినీళ్లు

తిరుమలయ్య మాస్టారు పిల్లలతో చాలా స్నేహంగా నడచుకొంటూ పాఠాలు చెబుతారు.

ఆరోజు ఎనిమిదవ తరగతిలో "పైనుండే కొబ్బరి కాయలోకి నీళ్ల ఎలా వస్తాయని?" అభిరామ్ వ్యగ్యంగా అడిగాడు.

ఈ విషయం విరామ సమయంలో పక్కనున్న లెక్కల మాస్టారుతో చెప్పాడు తిరుమలయ్య.

"మీరేమి సమాధానం చెప్పారు?"

"ఒక సైన్సు మాస్టారుగా కొబ్బరి చెట్టు గురించి వివరంగా చెప్పాను" అన్నాడు తిరుమలయ్య. ఆ తరువాత అభిరామ్ నోరు మూసుకొన్నాడు.

"వాడు చాలా అల్లరి వెధవ, నాతో ఆడుకోవాలనుకొన్నాడు. అర్థం కాలేదు సార్!" అన్నాడు. "మనం వాడి వయసులో వున్నప్పుడు ఇలాంటి ప్రశ్న వేస్తే అప్పటి మాస్టారు కంట్లో నీరు వచ్చేలా మనకు తొడపాయసం పెట్టేవారు. తొడపాయసం పెడితే కంట్లో నీరు ఎలా వచ్చిందని ప్రశ్నించేవారు". "ఇప్పుడలా చేస్తే వాడు, వాడి తల్లిండ్రులు, బంధువులు కలసి వచ్చి మనకు తొడపాయసం పెట్టకుండానే మనల్ని బాధపెడతారు" అన్నాడు తిరుమలయ్య.

"వాడికేమని సమాధానం చెప్పారు." "మూడు రోజుల్లో నీకు అర్థం అయ్యేలా చెబుతానని" అన్నాను తిరుమలయ్య.

మరుసటి రోజు సాయంత్రం అభిరాం ఉంటున్న వీధిలోనికి వెళ్ళాడు తిరుమలయ్య. అనుకొన్న విధంగానే ఇంటి అరుగు మీద కూర్చున్న అభిరాంను చూసాడు. వీడియో గేమ్స్ ఆడుతున్న అభిరాం, తన దగ్గరకు వచ్చిన తిరుమలయ్యను గమనించలేదు. అభిరాం చేతిలోని స్మార్ట్ ఫోన్ లాక్కొని "రేపు ఉదయం మీ నాన్నను బడికి వచ్చి తీసుకెళ్లమను" అంటూ అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయాడు.

ఏడుస్తూ తల్లితో చెప్పాడు మాస్టారి విషయం. "మీ మాస్టారు కొబ్బరి కాయలో నీరు ఎలా వస్తుందో చెప్పినా అర్థం కాలేదని వ్యంగ్యంగా అడిగావుగా, సెల్‌ఫోన్ తీసుకెళ్తే నీ కంట్లో నీరు ఎలా వచ్చిందని? అడగడానికి తీసుకెళ్తున్నట్లు మీ నాన్నతో ముందుగానే ఫోనులో చెప్పారు, మాస్టారు" అంది తల్లి. కన్నీళ్ళతో గుడ్లప్పగించి తల్లివైపు చూసాడు అభిరాం.

– ఓట్ర ప్రకాష్ రావు

## సహాయం

అజయ్ మనసు స్వచ్ఛమైనది, అతనికి ఎల్లప్పుడూ ఇతరులకు సహాయం చేయడం అంటే ఇష్టం. ఇతరులకు చేసే సహాయం ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక రూపంలో మన దగ్గరకు తిరిగి వస్తుంది.. అని అజయ్ తల్లిదండ్రులు చెప్పిన మాటలు అతని మనస్సులో నాటుకుపోయాయి. కానీ అతని స్నేహితులు రవి, సునీల్ మాత్రం స్వార్థపరులు.

"ఎవరికి వాళ్ళే చూసుకోవాలి, ఇతరులకు సహాయం చేస్తే మనకు నష్టమే కాని ఏం లాభం వుండదు" అని చెప్పేవారు. అజయ్ వారి మాటలు వినేవాడు కాదు.

ఒకరోజు అజయ్ తన స్నేహితులతో స్కూలుకు వెళ్తుండగా దారిలో ఒక వృద్ధుడు కనిపించాడు. అతనికి చాలా దాహంగా ఉంది. ఎంతో బలహీనంగా నడుస్తున్నాడు.

అజయ్ తన చేతిలో ఉన్న ఒకే ఒక్క దానిమ్మ పండును చూశాడు. అది అమ్మ తన కోసం ఇచ్చింది. వృద్ధుడి పరిస్థితి చూసి అజయ్‌కు ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా పండును ఆ వృద్ధుడికి ఇచ్చాడు.

వృద్ధుడు ఎంతో ఆత్రంగా ఆ పండును తిని "చాలా ధన్యవాదాలు. నువ్వు చేసిన మేలు నీకు తప్పకుండా తిరిగి వస్తుంది" అని ఆశీర్వదించాడు.

అజయ్ నవ్వుతూ ముందుకు సాగాడు. రవి, సునీల్ ఈ విషయం చూసి, "చూశావా, నీ పండు పోయింది. నీకు ఏం లాభం వచ్చింది?" అని ఎగతాళి చేశారు. అజయ్ వారి మాటలు పట్టించుకోలేదు.



మరుసటి రోజు, అజయ్ స్కూల్‌లో సైకిల్ రేస్ ఉంది. రేస్ కోసం సైకిల్ మీద వెళ్తుండగా దారిలో అజయ్ సైకిల్ చైన్ ఊడిపోయింది. అతను చాలా నిరాశపడ్డాడు.

అయితే అతని స్నేహితులు రవి, సునీల్ "మాకు స్కూలుకు లేటైపోతోంది. నువ్వు తాపీగా బాగు చెసుకొని స్కూలుకు రా, అని అజయ్‌ను ఒంటరిగా వదిలేసి వేగంగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయారు.

అజయ్‌కు ఏడుపొక్కటే తక్కువ. సరిగ్గా అప్పుడు ఒక అద్భుతం జరిగింది. ఒక తెలియని వ్యక్తి హఠాత్తుగా అక్కడికి వచ్చి అజయ్ పక్కనే సైకిల్ దగ్గర మోకాలిపై కూర్చుని చైన్‌ను రక్కున బాగు చేసాడు.

అజయ్ ఆశ్చర్యంగా చూస్తూ, "సార్, మీరెందుకు నా సైకిల్ బాగు చేస్తున్నారు?" అని అడిగాడు.

ఆ వ్యక్తి చిరునవ్వుతో తలెత్తి, "నిన్న నువ్వు ఆ తాతయ్యకు హెల్ప్ చేయడం నేను చూశాను. నీలోని దయను చూసి నాకు చాలా సంతోషంగా అనిపించింది. మంచి మనసున్నవాళ్లకు హెల్ప్ చేయడం నాకిష్టం" అని చెప్పాడు.

అజయ్ స్కూలుకు చేరుకుని, సమయానికి రేసులో పాల్గొని, గెలిచాడు. రవి, సునీల్‌లు ఆశ్చర్యంగా చూశారు.

గెలిచిన అజయ్, "చూశారా, నిన్న నేను చేసిన మంచి పని ఈ రోజు నాకు సహాయం చేసింది. మనం ఇతరులకు చేసిన మంచి ఎప్పుడూ వ్యర్థం కాదు, అది మనకు కష్టకాలంలో తిరిగి వస్తుంది," అని అన్నాడు. మనం ఇతరులకు చేసిన సహాయం, ప్రేమ ఎప్పుడూ తిరిగి వస్తాయి. మంచి పనులు చేయడానికి భయపడకూడదు. ఎందుకంటే మనం చేసే మంచి మనల్ని ఎల్లప్పుడూ కాపాడుతుంది.

– సి.హెచ్.ప్రతాప్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

**కథాకళి** FEED ME A STORY

# భయం అంచులో...

● మల్లాది వెంకట కృష్ణమూర్తి

కర్పూరవల్లి ఏర్ ఇండియా విమానం దిగి న్యూయార్క్ ఏర్‌పోర్ట్‌కి చేరుకున్నాక, ఇమిగ్రేషన్ ముగించుకుని లగేజ్ కేరసోల్ దగ్గరకి వెళ్ళింది.

ఓ కుక్క కిందకి దింపిన సూట్‌కేస్‌లను వాసన చూడటం గమనించింది. ఆ కుక్క ఆవిడ సూట్‌కేస్ దగ్గరకి వచ్చి వాసన చూసి, ఓదాని మీద ముందు కాళ్ల ఉంచి నిల్చుంది. వెంటనే యూనిఫాంలోని సెక్యూరిటీ గార్డ్ తన జేబులోంచి ఏదో తీసి ఆ కుక్క నోటికి అందించి దాన్ని నిమిరాడు. ఆవిడ అతన్ని నవ్వుతూ చూస్తూ అడిగింది.

''నైస్ డాగ్. వాట్స్ హిజ్ నేమ్?''

''ఈ రెండు సూట్‌కేసులు మీవేనా?'' అతను కర్పూరవల్లిని అడిగాడు.

''అవును.''

''మీ సూట్‌కేసులని మీరే పేక్ చేసారా?''

''అవును. నేనే.''

''ఈ సూట్‌కేసుల్లో ఏమేం ఉన్నాయో మీకు గుర్తుందా?'' అతని తర్వాతి ప్రశ్న.

''ఉంది. నా బట్టలు, మందులు, బహుమతి వస్తువులు.''

''మీరు నా వెంట రావాలి.'' అతను ఆజ్ఞాపిస్తున్నట్లుగా చెప్పి ఎడమ భుజం దగ్గరున్న వైర్‌లెస్ సెట్‌లో ఎవరికో ఏదో చెప్పాడు.

కొద్ది క్షణాల్లో యూనిఫాంలోని ఇద్దరు సెక్యూరిటీ పోలీసులు ట్రాలీతో అక్కడికి చేరుకున్నారు. వాళ్ళు ఆవిడ సూట్‌కేసులను జాగ్రత్తగా ట్రాలీ మీదకి ఎక్కించి నడిచారు.

''నాతో రండి.'' ఆ గార్డ్ ఆవిడతో చెప్పాడు.

''ఎందుకు?'' ఆవిడ అతని వెంట నడుస్తూ అడిగింది.

అతను ఆవిడ ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

'ఇన్‌స్పెక్షన్' అని రాసున్న తలుపులోంచి లోపలికి తీసుకెళ్ళాడు.

''మీరు ఒంటరిగా ప్రయాణిస్తున్నారా?'' లోపల కూర్చున్న ఓ అధికారి ప్రశ్నించాడు.


''అవును.''

''అమెరికాకి ఎందుకు వచ్చారు?''

''నా కూతురితో గడపడానికి. మీరీ ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారు?'' కర్పూరవల్లి ప్రశ్నించింది.

అక్కడికి మరొక కుక్కని తెచ్చారు. అది కూడా సూట్‌కేసుల చుట్టూ తిరిగి





ఇందాకటి సూట్‌కేస్ మీద ముందు కాళ్ళు పెట్టింది. దాని శిక్షకుడు కూడా దానికి బహుమతిగా తినడానికి డాగ్ బిస్కెట్ ఇచ్చి, దాన్ని దువ్వి తీసుకెళ్ళిపోయాడు. ఆవిడకి ఏం జరుగుతోందో అర్థం కాక అయోమయంలో పడింది.

''మీకు ఏదైనా టెర్రరిస్ట్ సంస్థ మీద సానుభూతి ఉందా?'' ఆ అధికారి ప్రశ్నించాడు.

''లేదు.'' ఆవిడ తుళ్ళిపడి జవాబు చెప్పింది.

గార్డ్ ఆవిడ హేండ్‌బేగ్‌ని తీసుకుని అందులోని వస్తువులన్నీ బల్ల మీద పోశాడు.

''ఈ సూట్‌కేస్‌లో మీరు ఏం తీసుకొస్తున్నారు? అంగీకరిస్తే తక్కువ శిక్ష పడుతుంది. మా అంతట మేమే కనుక్కుంటే శిక్ష పెరుగుతుంది.'' అధికారి చెప్పాడు.

''శిక్షా? బయటే ఉంటాడు. మా అల్లుడికి ఫోన్ చేస్తాను.'' కర్పూరవల్లి భయంగా చెప్పింది.

''తర్వాత. నా ప్రశ్నకి జవాబు చెప్పండి.''

''నేనే నిషిద్ధ వస్తువులు తీసుకురాలేదు.'' ఆవిడ భయంగా చూస్తూ చెప్పింది.

ఇద్దరు గార్డ్‌లు ఆ సూట్‌కేసులు తెరిచి ఒక్కొక్క సామాను బయటకి తీయసాగారు.

**'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే**
**ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.**
**kathakalisakshi@gmail.com**

ప్రతి డ్రెస్ లైనింగ్ తడిమి, లోపల ఏదైనా ఉంచి కుట్టారా అని తనిఖీ చేయసాగారు. కర్పూరవల్లి భయంగా, ఆశ్చర్యంగా జరిగేది చూస్తోంది.

ఆవిడ మొబైల్ తీసుకుని పాస్‌వర్డ్ అడిగి తెరిచి, అందులోని కాంటాక్ట్ నంబర్లలోని వారి పేర్లు ఒకొక్కటీ అడిగి వారు ఏమవుతారు అని ప్రశ్నించాడు. అవన్నీ ఇండియాలోని పేర్లు. కొన్ని పేర్లు అతనికి నోరు తిరగలేదు కూడా. ఆవిడలో భయం అధికం అవసాగింది. వాళ్ళు వెతుకుతూంటే అధికారి ఆవిడని ప్రశ్నించసాగాడు.

''అమెరికాకి ఎందుకు వచ్చారు? మీ అల్లుడు ఏం చేస్తూంటాడు? మీ అమ్మాయి ఏం చేస్తుంది? ఇదివరకు ఎప్పుడైనా అమెరికాకి వచ్చారా? మీరు వచ్చిన పని ఏమిటి? ఇండియాలో ఏం చేస్తూంటారు?''

చివరికి ఆ పెట్టెలో వారు వెతికేది కనిపించింది. వెంటనే ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు.

''వీటిని ఎందుకు కొన్నారు?'' ఓ గార్డ్ ఒకటి తీసి చూపిస్తూ ప్రశ్నించాడు.

''బహుమతిగా కొన్నాను.''

''ఎవరికి?''

''మా అల్లుడికి. కిందటిసారి ఇండియా వచ్చినప్పుడు అతను తెచ్చినవి వాళ్ళ స్పాటీకి బాగా నచ్చాయట. వీటిని కొని తెమ్మని మెసేజ్ ఇచ్చాడు.''

వాళ్ళు ఆ పేకెట్స్‌ని విప్పి క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలో డ్రగ్స్ గాని, పేలుడు పదార్థాలు కాని లేవని రూఢీ చేసుకున్నాక వివిధ జాతుల కుక్కల బొమ్మలున్న డాగ్ ఫుడ్ పాకెట్స్ చూపించి నవ్వుతూ చెప్పారు.

''వియార్ సారీ. చిన్న పొరపాటు. మా రెండు కుక్కలు తమ ఆహారాన్ని పసికట్టాయి. మేం ఇంకేదో అని ఊహించాం.''

వాళ్ళు బయటికి తీసిన వస్తువులని లోపల ఉంచి మూత మూస్తే అది మూసుకోలేదు. అది గమనించి ఆవిడ మళ్ళీ సర్ది ఒక గార్డ్‌ని కోరింది.

''మా వారు నాతో రాలేదు. దయచేసి మీరు దీని మీద నిల్చుంటే జిప్ వేస్తాను.''

**కిసుక్కు**

**డాక్టర్:** నేను చెప్పినట్లుగా రోజూ వాకింగ్ చేస్తున్నారా?
**అయోమయం:** చేస్తున్నా డాక్టర్.
**డాక్టర్:** ఎన్నిసార్లు వాకింగ్ చేస్తున్నారు?
**అయోమయం:** రోజూ సోఫా నుంచి ఫ్రిజ్ వరకు ముప్పయిసార్లు వాకింగ్ చేస్తూనే ఉన్నా!


14 వ పేజీలో.. 28-6-2026 సంచిక 'కథాకళి'కి పేరు సూచించిన పాఠకుల పేర్లు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథానిధి (5.7.26) సమీక్ష :

# సామాజిక రుగ్మతలపై అక్షరాల తిరుగుబాటు

భూక్యా గోపి నాయక్, 99891 59196




సాహిత్యం ఆకాశం నుంచి ఊడిపడదు, అది సమాజపు భౌతిక పరిస్థితుల నేల నుంచి మొలకెత్తుతుంది. వర్గ సమాజంలో మనిషి అనుభవిస్తున్న అస్తిత్వ వేదన, సామాజిక దోపిడీ, పతనమవుతున్న మానవ సంబంధాలు, యాంత్రికమవుతున్న బతుకు చిత్రాలు... ఇవన్నీ కథా సాహిత్యానికి ముడిసరుకులు. ఒక కథ కేవలం వ్యక్తుల మధ్య జరిగే సంఘటనల సమాహారం మాత్రమే కాదు. అది ఆనాటి చారిత్రక, ఆర్థిక, సామాజిక గతితార్కిక వైరుధ్యాలకు సజీవ సాక్ష్యం. అందుకే కథ కాలక్షేపం కాదు. కాలం తన ఒంటిమీద మోసుకెళుతున్న గాయాలను అక్షరాల్లో భద్రపరిచే సామాజిక జ్ఞాపకం. ఒక సమాజం ఏం ఆలోచిస్తోంది? దేనికి భయపడుతోంది? ఎక్కడ మోసపోతోంది? ఏ బంధాన్ని కోల్పోతోంది? ఏ విలువ కోసం తపిస్తోంది? అనే ప్రశ్నలకు సమకాలీన కథల్లో సమాధానాలు దొరుకుతాయి. అందుకే ఆదివారం అనుబంధాల్లో ప్రచురితమయ్యే కథలను విడివిడిగా కాకుండా ఒకే కాలపు సామాజిక పత్రాలుగా చదవాల్సిన అవసరం ఉంది.

మానవీయ సౌందర్యశాస్త్ర కోణం నుంచి సాహిత్యాన్ని దర్శించినప్పుడు, ఒక కథ సమాజంలో నిరంతరం జరుగుతున్న మార్పులను ఎంత వాస్తవికంగా ప్రతిబింబించింది, శిల్పపరంగా ఎంతటి వైవిధ్యాన్ని ప్రదర్శించింది అన్నదానిపైనే దాని చారిత్రక విలువ ఆధారపడి ఉంటుంది. ఈ సునిశిత విమర్శనాత్మక దృక్పథంతో చూసినప్పుడు, 5 జూలై 2026 నాటి వివిధ దినపత్రికల ఆదివారం అనుబంధాల్లోని 13 కథలతో కె.ఎ. మునిసురేష్ పిళ్లె సమర్పించిన "కథానిధి" సంకలనం మన సమకాలీన సామాజిక లోగిళ్లకు ఒక నిలువుటద్దంలా నిలుస్తుంది.

ఈ కథలన్నింటినీ కలిపి చదివినప్పుడు ఒకే ఒక అంతస్సూత్రం కనిపిస్తుంది—మారుతున్న ప్రపంచంలో మనిషి తన మానవత్వాన్ని ఎలా కాపాడుకోవాలి?

మధ్యతరగతి స్వార్థం, ఐటీ రంగపు అభద్రత, గిరిజనులను మోసగించడం, రాజ్యహింస, మూఢనమ్మకాలు, పితృస్వామ్య అహంకారం—ఇలా ఆధునిక మానవుడు ఎదుర్కొంటున్న ప్రతి సామాజిక పార్శ్వాన్నీ ఈ 13 కథలు స్పృశించాయి. ఈ కథల వెనుక ఉన్న తాత్విక లోతులను, శిల్పగత వైరుధ్యాలను నిష్కర్షగా విశ్లేషించుకుందాం.

ఈ సమీక్ష వ్యాసాన్ని పీడీఎఫ్ కాకుండా, టెక్స్ట్ రూపంలో చదవదలచుకున్న వారు.. ఈ కింది వెబ్ సైట్ ను విజిట్ చేయండి.

www.adarsini.com (click చేయండి)

యూట్యూబ్‌లో వినదలచుకున్న వారు ఇక్కడ క్లిక్ చేయండి

## 1. శ్రామిక జీవన సౌందర్యం వర్సెస్ పెట్టుబడిదారీ శూన్యత

'జాజులు పూచే వేళలు'
(రచన: వాడ్రేవు వీరలక్ష్మీదేవి - ఆంధ్రజ్యోతి ఆదివారం)

వాడ్రేవు వీరలక్ష్మీదేవి కథల్లో సాధారణంగా కనిపించే

ప్రత్యేకత మనిషి అంతరంగంలోని సున్నితమైన కదలికను పట్టుకోవడం. 'జాజులు పూచే వేళలు' అనే శీర్షికే ఒక కవితాత్మక అనుభూతిని కలిగిస్తుంది.

వినియోగదారీ సంస్కృతిలో కూరుకుపోయిన ఆధునిక సంపన్న వర్గాల జీవితాల్లోని డొల్లతనాన్ని, కష్టించి పనిచేసే శ్రామిక వర్గాల జీవితాల్లోని నిండుదనాన్ని అత్యంత సహజంగా, గతితార్కిక కాంట్రాస్ట్ పద్ధతిలో చిత్రించిన అద్భుతమైన కథ ఇది. భాగ్యలక్ష్మి అనే వంటమనిషి ఒక 'గేటెడ్ కమ్యూనిటీ'లోని ఐదు ఇళ్లలో వంట చేస్తుంది. భర్త షణ్ముగం రోడ్డు ప్రమాదంలో కాలు విరగ్గొట్టుకున్నా, అతన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటూ, రోజూ మల్లెపూలు, కనకాంబరాలు తలలో పెట్టుకుని తన శ్రమజీవనాన్ని సంతోషంగా గడుపుతుంది. మరోవైపు, అనిత, రఘువీర్ అనే సాఫ్ట్‌వేర్ దంపతుల ఇంట్లో వంట కుక్కర్ పేలిపోయినా, అనిత ఏమాత్రం పట్టించుకోకుండా "బయట తినేస్తాం" అని యాంత్రికంగా వెళ్ళిపోవడం వారి సంబంధాలలోని శూన్యతకు ప్రతీక. అమెరికా మోజు కోసం అనిత తన భర్తకు విడాకులు ఇవ్వడం ద్వారా, డబ్బు ఉంటేనే బంధాలు నిలబడతాయనే పెట్టుబడిదారీ భ్రమను రచయిత్రి పటాపంచలు చేశారు.

ఆధునిక సాఫ్ట్ వేర్ జంటల మధ్య లోపిస్తున్న కమ్యూనికేషన్ ను ఎండగట్టడంలో కథా శిల్పం విజయవంతమైంది. శ్రమను నమ్ముకున్న భాగ్యలక్ష్మి జీవితంలోని స్పష్టత, సంపన్నులైన అనిత-రఘువీర్ ల జీవితంలో లేకపోవడాన్ని రచయిత్రి అత్యద్భుతంగా అల్లి, ఒక దృఢమైన వర్గ దృక్పథాన్ని పాఠకులకు అందించారు.

ఇందులో రచయిత్రి సంఘటనల కంటే అనుభూతులకు ప్రాధాన్యం ఇస్తారు. కథలోని నిశ్శబ్దాలు కూడా సంభాషిస్తాయి. పాత్రలు చెప్పని మాటలను పాఠకుడు వినగలిగినప్పుడు కథ విజయవంతమవుతుంది. 'జాజులు పూచే వేళలు'లో ఈ అంతర్లీన ధ్వని ప్రధాన బలం.

అలాగే నేటి కథల్లో వేగం పెరిగింది. మలుపులు, షాక్ ముగింపులు, సంచలన అంశాలు కథను ఆక్రమిస్తున్న సమయంలో మానవ హృదయంలో నెమ్మదిగా జరిగే మార్పును కథగా మలచడం ఒక సాహిత్య అవసరం. ఈ కోణంలో ఈ కథ ప్రత్యేకంగా నిలుస్తుంది.

## 2. నయా ఉదారవాద వంచనపై సబాల్టర్న్ తిరుగుబాటు

'కైతవ భంజని'
(రచన: వాడపల్లి పూర్ణ కామేశ్వరి - ఈనాడు ఆదివారం)

ఈ వారం కథల్లో అత్యంత తీవ్రమైన సామాజిక ప్రశ్నను ముందుకు తెచ్చిన కథల్లో 'కైతవ భంజని' ఒకటి. కథలోని నీలి ఒక వ్యక్తి మాత్రమే కాదు. నగర నాగరికత ముందు అమాయకంగా నిలబడిన ఆదివాసీ యువతి ప్రతిరూపం. గాలికొండ పొలిమేర దాటని పచ్చని అమాయకత్వం ఆమెది. వెదురు బుట్టలే ప్రపంచంగా జీవించే రంగడు, సీతాలు దంపతులకు లేకలేక కలిగిన బిడ్డ నీలి. కూతురు చదివి 'పెద్ద ఆఫీసరు' కావాలన్న తండ్రి కలలో ఆదివాసీ సమాజపు కొత్త ఆకాంక్ష కనిపిస్తుంది.

ఇక్కడ రచయిత్రి చాలా ముఖ్యమైన సామాజిక పరివర్తనను పట్టుకున్నారు. ఒకప్పుడు అడవి, కొండ, సంత, వెదురు బుట్టల మధ్య పరిమితమైన గిరిజన జీవితం ఇప్పుడు విద్య ద్వారా నగరం వైపు చూస్తోంది. తల్లికి నగరం భయం. తండ్రికి నగరం అవకాశం. ఈ రెండు దృక్పథాల మధ్య నీలి ప్రయాణం ప్రారంభమవుతుంది.

"మన బతుకులిట్టా లోయలోనే ఇంకిపోవాలేటి!" అన్న రంగడి ఆవేదనలో తరతరాల సామాజిక వెనుకబాటుతనం ఉంది. చదువు ద్వారా తన కూతురు తమ బతుకు గీతను దాటాలని కోరుకునే తండ్రి ఆశ ఉంది. తేనె, పసుపు కొమ్ములు అమ్మి పలకా బలపం కొనిపెట్టే తండ్రి కేవలం కథా పాత్ర కాదు. భారతదేశంలోని లక్షలాది అణగారిన తండ్రుల ప్రతినిధి.

కానీ నీలిని మోసం చేసేది నగరం కాదు. ఆమె 'నమ్మకం'.

జ్యోతి అనే మహిళ నీలికి ఆశ్రయం ఇస్తుంది. భాష, నగర జీవితం, మంచి చెడులు నేర్పుతుంది. అక్కలా ఆదరిస్తుంది. అందుకే జ్యోతి చూపించిన శ్రీధర్‌ను నీలి ప్రశ్నించకుండా పెళ్లి చేసుకుంటుంది. "నువ్వేం చెప్పినా నా మంచికేగా అక్కా" అనే నీలి మాటే కథలోని అసలు విషాదానికి బీజం.

మనిషిని శత్రువు మోసం చేస్తే అది నేరం. నమ్మిన మనిషి మోసం చేస్తే అది జీవితాంతం మానని గాయం.

శ్రీధర్‌కు అప్పటికే జ్యోతితో వివాహమైందని నీలికి తెలియదు. సుధా కాలనీలోని ఇంట్లో పెళ్లి ఫోటో చూసిన క్షణం కథ ఒక్కసారిగా మానసిక విషాదంలోకి జారుతుంది. తన భర్త పక్కన పెళ్లికూతురుగా జ్యోతిని చూసిన నీలి ప్రశ్న—"జ్యోతక్క భర్తే ఇప్పుడు నా...?"—పూర్తికాకుండానే పాఠకుడి గుండెల్లో పూర్తవుతుంది.

కథలో అత్యంత క్రూరమైన కోణం జ్యోతి సమర్థన.

తమకు ఇరవై ఏళ్లుగా పిల్లలు లేరని, శ్రీధర్ ద్వారా ఒక బిడ్డ కావాలని, ఆ సమయంలో నీలి వచ్చిందని ఆమె చెబుతుంది. "నీ అవసరం నాకు అవకాశమైంది" అనే భావన ఆధునిక సమాజంలోని దోపిడీ మనస్తత్వానికి భయంకరమైన నిర్వచనం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఇక్కడ నీలి శరీరం ఒక మహిళ అవసరానికి, ఒక పురుషుడి మోసానికి సాధనమవుతుంది. ఆమె అనుమతి ఎక్కడ? ఆమె నిర్ణయం ఎక్కడ? ఆమె జీవితం మీద ఆమెకున్న హక్కు ఎక్కడ?

ఈ ప్రశ్నలే కథను సాధారణ కుటుంబ కథ స్థాయి నుంచి స్త్రీ స్వేచ్ఛ, ఆదివాసీ హక్కులు, శరీర రాజకీయాల చర్చలోకి తీసుకెళ్తాయి.

అయితే కథ చివర్లో నీలి బాధితురాలిగా మిగలదు. తిరుగుబాటు చేస్తుంది. గిరిజన హక్కుల పరిరక్షణ వ్యవస్థను ఆశ్రయిస్తుంది. జ్యోతి మాటలను రికార్డు చేయిస్తుంది. "మోసం ఎవరిని చేసినా తప్పే. అందునా అమాయకమైన గిరిజన తెగలను మోసం చేసి తేలికగా తప్పుకోవాలనుకోవడం అవివేకం" అనే అధికార ప్రతినిధి మాటలతో కథ న్యాయపరమైన దిశలో ముగుస్తుంది. నీలి ఫోనులో వినిపించే మహిషాసురమర్దిని స్తోత్రం ప్రతీకాత్మకంగా ఆమె పరివర్తనను సూచిస్తుంది.

అమాయక నీలి——ప్రశ్నించే నీలిగా మారింది.

ఇదే కథ విజయం.

అయితే విమర్శక దృష్టితో చూస్తే చివరి భాగంలో చట్టపరమైన వివరణ కొంత కథన సహజత్వాన్ని తగ్గిస్తుంది. అధికారిని ప్రవేశపెట్టి సమస్యకు వేగంగా పరిష్కారం చూపడం వల్ల కథలోని మానసిక సంఘర్షణ కొంత వెనక్కి వెళ్లింది. నీలి స్వయంగా ఆధారాలు సేకరించి, పోరాట మార్గాన్ని నిర్మించుకున్నట్లయితే పాత్ర మరింత శక్తిమంతంగా ఎదిగేది. అయినప్పటికీ గిరిజన యువతిపై జరిగే మోసాన్ని కథావస్తువుగా ఎంచుకోవడం అభినందనీయం.

## 3. రాజ్యహింస - అంతరాత్మల ఘర్షణ

**'కాలసర్పం'**

**(రచన: పండరినాథ్ ప్రభల - తెలుగుప్రభ)**

రాజ్యహింసను, ఎన్కౌంటర్ల పేరుతో జరిగే బూటకపు హత్యలను విమర్శనాత్మకంగా ప్రశ్నించిన సైకలాజికల్ థ్రిల్లర్ ఈ కథ. శంకర్ అనే పోలీసు ఆఫీసర్ 'ఎన్కౌంటర్ స్పెషలిస్ట్'గా పేరుతెచ్చుకుని, పైవాళ్ల ఆదేశాల మేరకు ఎంతోమందిని ఫేక్ ఎన్కౌంటర్లలో చంపేస్తుంటాడు. కానీ, వ్యవస్థను ప్రశ్నించే రఫీ అనే ఒక నిజాయితీ గల జర్నలిస్టును చంపాల్సి వచ్చినప్పుడు శంకర్ అంతరాత్మ తొలిసారిగా భయపడుతుంది. చనిపోయే ముందు రఫీ "సార్, నేను ఏ తప్పూ చేయలేదు" అని అనబోయిన మాట శంకర్ ను నిద్రపోనివ్వకుండా వెన్నాడుతుంది. చివరికి రఫీ ఎన్కౌంటర్ కు సంబంధించిన ఆధారాలు బయటపడి శంకర్ స్వయంగా విచారణను ఎదుర్కొంటాడు.

అధికార వ్యవస్థ అండ చూసుకుని విర్రవీగే ఒక మనిషి, చివరికి తన అంతరాత్మ చేతిలోనే ఎలా శిక్షించబడతాడో రచయిత కళ్లకు కట్టినట్లు చూపారు. తప్పును ప్రశ్నించే జర్నలిస్టుల గొంతు నొక్కే వ్యవస్థ దుర్మార్గాన్ని ఈ కథ బలంగా ఎండగట్టింది. వస్తువుపరంగా ఇది ఒక సాహసోపేతమైన రచన.

## 4. ఆధునిక దాంపత్యాలు — స్త్రీల సహానుభూతి

**'నీవని... నేనని...'**

**(రచన: పి.ఎ.యస్.సుధాకరరావు - సాక్షి ఫన్డే)**

కార్పొరేట్ వాతావరణంలో పనిచేసే మహిళల మధ్య ఉండే సంఘీభావాన్ని, ఆధునిక దాంపత్యాల్లోని అపార్థాలను సున్నితంగా ఆవిష్కరించిన కథ ఇది. మాలతి అనే కఠినమైన ఆఫీస్ బాస్, తన దగ్గర పనిచేసే నందిని పరధ్యానంగా ఉండటం గమనించి ఇంటికి తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇస్తుంది. నందిని తన భర్త ప్రభాకర్ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని చెప్పినప్పుడు, మాలతి తన సొంత విడాకుల అనుభవాన్ని ఉదాహరణగా చెప్పి, నందినికి ఒక నెల పెయిడ్ లీవ్ మంజూరు చేస్తుంది. భర్త దగ్గర "ఉద్యోగానికి రిజైన్ చేశాను" అని అబద్ధం చెప్పి అతనిలో మార్పు తీసుకురావాలని సూచిస్తుంది. భార్య తనకోసం ఇంత త్యాగం చేసిందా అని ప్రభాకర్ పశ్చాత్తాపపడతాడు.

ఆఫీస్ బాస్ లు కఠినంగా ఉంటారనే మూసను బద్దలు కొడుతూ, ఒక స్త్రీ తోటి స్త్రీకి మానసిక అండగా నిలబడటాన్ని ఈ కథ అందంగా చిత్రించింది. అయితే, తాత్వికంగా చూస్తే భర్తను మార్చడానికి భార్య తన ఉద్యోగాన్ని వదులుకున్నట్లు నాటకం ఆడటం కొంత పాతకాలపు సెంటిమెంటల్ ధోరణిలా కనిపిస్తుంది. ఆధునిక ప్రజాస్వామ్య దాంపత్యంలో ఇరువురు కూర్చుని సమస్యను పరిష్కరించుకునే కోణాన్ని స్పృశించి ఉంటే కథ మరింత అభ్యుదయకరంగా ఉండేది.

## 5. నిరుద్యోగ సంక్షోభం — వ్యవస్థాపక స్ఫూర్తి

**'దోస్తులు'**

**(రచన: ఉమామహేశ్వరి - ప్రజాశక్తి స్నేహ)**

ఐటీ రంగంలో లేఆఫ్స్ వల్ల ఉద్యోగాలు కోల్పోయిన యువత పడే మానసిక క్షోభను, ఆ తర్వాత వారు సాగించిన కలెక్టివ్ విజయ ప్రస్థానాన్ని ఈ కథ తెలియజేస్తుంది. క్రిష్, శ్యాం, పండు, టింకు అనే సాఫ్ట్ వేర్ స్నేహితులు

ఉద్యోగాలు కోల్పోయి సొంతూరికి వస్తారు. పండు ఆత్మహత్యకు సైతం ప్రయత్నిస్తాడు. కానీ వీరంతా ఒకటై, తమ టెక్నికల్ స్కిల్స్ ను ఉపయోగించి యూట్యూబ్ ఛానల్, కోడింగ్ క్లాసులు, స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్ ప్రారంభించి సక్సెస్ అవుతారు.

ఈ కథలో నిరుద్యోగం అనే సామాజిక మహమ్మారికి ఆత్మహత్య పరిష్కారం కాదని, శ్రమశక్తిని ఉమ్మడిగా పెట్టుబడిగా పెడితే అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పే ఆదర్శ వంతమైన కథ ఇది. శిల్పపరంగా కథ కాస్త డాక్యుమెంటరీ శైలిలో సాగినప్పటికీ, కథా వస్తువు నేటి సామాజిక అవస రాలకు అద్దం పడుతుంది.

## 6. పితృస్వామ్య మూలాలు – ఆత్మాభిమానం

'తనూజాత్మజ'

(రచన: వింజమూరి శ్రీవల్లి - నమస్తే తెలంగాణ బతుకమ్మ)

మగపిల్లాడే వంశోద్ధారకుడు అనే పాతకాలపు పితృస్వామ్య అహంకారాన్ని బద్దలుకొట్టిన ఉదాత్తమైన కథ ఇది. రామారావుకు మగపిల్లలంటే ఇష్టం, కూతుళ్లు భారమనే భావన ఉంటుంది. అతని సహోద్యోగి సూర్యనారాయణకు కూతురు (తనూజ) ఉంటుంది. రిటైర్ అయ్యాక, రామారావును అతని కొడుకు సరిగా పట్టించుకోడు. కానీ సూర్యనారాయణ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అతని కూతురు తనంతట తానే అకౌంట్లో డబ్బులు వేసి తండ్రి ఆత్మాభిమానాన్ని నిలబెడుతుంది. ఇది చూసిన రామారావుకు కనువిప్పు కలిగి, తప్పు తెలుసుకుని సూర్యనారాయణకు క్షమాపణ లేఖ రాస్తాడు.

ఇందులో"ఆత్మజ" అంటే కూతురు అని, ఆమె కేవలం ఆస్తి కాదని, ప్రేమకు, ఆత్మీయతకు ప్రతిరూపమని రచయిత్రి ఎంతో ఆర్ద్రంగా చెప్పారు. కుమారుల పట్ల ఉన్న అంధ మోజును లాజికల్ గా విమర్శించిన విధానం బాగుంది.

## 7. మానవీయ విలువల పునరుజ్జీవనం

ఈ కోవలో రెండు అద్భుతమైన కథలున్నాయి.

'అనురాగమే చిరునామా'

(రచన: మనస్విని - ప్రజాశక్తి స్నేహ):

గిరిధర్ అనే ఐఏఎస్ ఆఫీసర్ కథ ఇది. డబ్బు, హోదా కోసం పాకులాడి తనను బాల్యంలో పట్టించుకోకుండా హాస్టల్ కే పరిమితం చేసిన సొంత తల్లిదండ్రులను (విజయేంద్ర, రాజ్యలక్ష్మి) అతను ఎదిరిస్తాడు. తనను ప్రేమగా పెంచిన స్వీపర్లు యాదమ్మ, లక్ష్మయ్యల మేనకోడలు మౌనికను పెళ్లి చేసుకుంటాడు. రక్త సంబంధం కన్నా, శ్రమజీవులు పంచిన వాత్సల్యమే గొప్పదని ఈ కథ చాటిచెప్పింది.

'చివరిచూపు'

(రచన: చందలూరి నారాయణరావు - వార్త):

రాజు అనే వ్యక్తి తన క్లాస్ మేట్ తండ్రి (పంతులుగారు) చనిపోయినప్పుడు కుల, మత పట్టింపులు పక్కనపెట్టి స్వయంగా కాటికాపరిగా నిలబడతాడు. గతం లో రాజు భార్య గర్భవతిగా ఉన్నప్పుడు ఆ పంతులుగారు వెయ్యి రూపాయలు ఇచ్చి ఆదుకోవడమే ఆ కృతజ్ఞతకు కారణం. ఆధునిక సమాజంలో పతనమవుతున్న మానవత్వానికి ఈ కథ ఒక వెలుగురేఖ.

## 8. విద్యావ్యవస్థ, కళ – అసలైన ప్రతిభ అన్వేషణ

'వైకల్యం'

(రచన: ఎనుగంటి వేణుగోపాల్ - వార్త)

తల్లిదండ్రులు తమ కలలను పిల్లల మీద రుద్దే ధోరణిని వ్యతిరేకించిన కథ ఇది. రాధిక తన కూతురు గీతికను పెద్ద సింగర్ చేయాలనుకుంటుంది, కానీ గీతిక పాటల పోటీలో విఫలమై తనకు ఆసక్తి లేదని చెబుతుంది. అప్పుడు రాధిక నిరాశపడకుండా, అద్భుతమైన గాత్రం ఉన్న రాజు అనే గుడ్డి యాచకుడికి శిక్షణ ఇప్పించి జాతీయ స్థాయి గాయకుడిగా తీర్చిదిద్దుతుంది. శారీరక వైకల్యం కళకు అడ్డుకాదని, సమాజం ఆదరిస్తే అద్భుతాలు జరుగుతాయని ఈ కథ గొప్ప సామాజిక బాధ్యతను నెరవేర్చింది.

## 9. తరాల అంతరం - ఆధునిక యువత పరిణతి

'చేరని తీరం'

(అనువాదం: చింతపట్ల సుదర్శన్ - విశాలాంధ్ర):

ఈ అస్సామీ మూల కథ, తల్లిదండ్రుల అనుమానాలకు, యువత జవాబుదారీతనానికి మధ్య ఉన్న గీతను అద్భుతంగా గీసింది. ఒక తండ్రి తన ఇరవయ్యేళ్ల కూతురు ఐరేణిని శనివారం కాలేజీ తర్వాత అనుమానంగా వెంబడిస్తాడు. ఆమె జిరాక్స్ షాపుకు వెళ్లి, మెడికల్ షాపులో మందులు కొని, ఒక నర్సింగ్ హోమ్ లో ఉన్న తన స్నేహితురాలు రూబీ వాళ్ల అమ్మను పరామర్శించడానికి బాధ్యతగా వెళ్తుంది. కూతురి పరిణతిని చూసి తండ్రి గర్వపడటం ఇందులో ముగింపు. యువతను ఎప్పుడూ అనుమానించే పెద్దల సైకాలజీ మీద ఇదొక సున్నితమైన విమర్శ.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

## 10. మూఢనమ్మకాలు, గ్రామీణ నాస్టాల్జియా

**'మాఊరి రైలుబండి'**
**(గన్నవరపు నరసింహమూర్తి - నవతెలంగాణ సోపతి)**

పల్లెటూరి వాతావరణంలో నడిచే ఒక ప్యాసింజర్ రైలు (నత్త బండి) ప్రయాణాన్ని అత్యంత హాస్యభరితంగా వర్ణించిన కథ. ఇడ్లీల కోసం, టికెట్ కలెక్టర్ గొడవ కోసం, పాలు తక్కువ పోశాడని స్టేషన్ మాస్టర్ చేసే గొడవ కోసం ఆ రైలు ఎక్కడ పడితే అక్కడ ఆగుతుంది. గ్రామీణ భారత దేశపు సామాజిక చిత్రపటానికి ఇదొక సజీవ సాక్ష్యం.

**'గొలుసు ఉత్తరం'**
**(రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి - సాక్షి ఫన్డే):**

చైన్ లెటర్స్ వల్ల కలిగే అనర్థాలపై మల్లాది మార్క్ సస్పెన్స్ కథ ఇది. జాగృత్ అనే వ్యక్తి పంపిన ఒక గొలుసు ఉత్తరం వల్లనే తన భార్య చనిపోయిందని భ్రమపడిన ఒక వ్యక్తి, జాగృత్ కు విషం ఇవ్వడం మూఢభక్తిలోని ప్రమాదాన్ని ఎత్తిచూపుతుంది.

**'దేవుడు పంపించాడా'**
**(రచన: యామిజాల జగదీశ్ - వార్త)**

"నన్ను దేవుడు పంపాడు" అని చెప్పుకునే దొంగ బాబాల భ్రమలను బద్దలు కొట్టిన మినీ కథ ఇది. మానసిక రోగుల ఆసుపత్రి నేపథ్యంలో సాగిన ఈ కథ కళ్లు తెరిపించే హాస్యాన్ని, వ్యంగ్యాన్ని పండించింది.

**సాహిత్యం అనేది సమాజపు ఆత్మకు** పట్టే అద్దం. 5 జూలై 2026 నాటి 'కథానిధి' సంకలనంలోని ఈ 13 కథలు ఆ సత్యాన్ని నూటికి నూరుపాళ్లూ నిరూపించాయి. ఒక వైపు నయా ఉదారవాద విధానాలు సృష్టిస్తున్న అభద్రతను, మరోవైపు పితృస్వామ్య, కుల, వర్గ అహంకారాలను ఈ కథలు నిలదీశాయి. అక్షరాలు కేవలం కాగితాలపై అచ్చుగుద్దిన సిరా మరకలు కావు, అవి దోపిడీని ప్రశ్నించే, మనిషి అంతరంగాన్ని ప్రక్షాళన చేసే జీవనదులు అనడానికి ఈ కథలే సజీవ సాక్ష్యాలు. శిల్పపరంగా ఎక్కడో ఒకట్రెండు కథలు భావవాద, నాటకీయ ధోరణులకు లోనైనప్పటికీ, వస్తుపరంగా ప్రతి కథా బలమైన సామాజిక ప్రయోజనాన్ని ఆశించిందే. తెలుగు కథాస్రవంతి ఇలా నిరంతరం ప్రగతిశీల ఇతివృత్తాలతో, సామాజిక స్పృహతో ప్రవహించడం హర్షించదగ్గ పరిణామం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్‌అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# గురుస్థానంలో ఉండేవారు జాగ్రత్త వహించాలి


**యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే**

ఉత్తమ పురుషులు చేసే పనులనే సామాన్యులు ఆచరిస్తారు. వారినే ప్రమాణంగా గ్రహిస్తారని భగవద్గీత చెప్తోంది. సాక్షాత్తు శ్రీకృష్ణుడు.. 'ముల్లోకాలలో నేను చేయవలసిందేమీ లేదు, సాధించదగినదీ, సాధించవలసినదీ లేదు. అయినా నేను కర్మను విడిచి పెట్టను. ఒకవేళ నేను కర్మను విడిచిపెట్టాననుకో, అసంఖ్యాక జనం నన్నే అనుసరించి సోమరులవుతారు. ఆ కారణంగా లోకనాశనం తప్పదు' అని స్వయంగా పలికాడు.

అజ్ఞానంతో ఉన్నవాడు తను చేసిన పనికి ప్రతిఫలాన్ని ఆశిస్తాడు. అదే జ్ఞాని అయినవాడు ప్రతిఫలం ఆశించకుండా లోక క్షేమం కోసం పని చేసి తీరతాడు. జనక మహారాజు వంటి రాజర్షులు వారు చేయవలసిన కర్మను అంటే పనులను నిరంతరం విడిచిపెట్టకుండా ఆచరించి, ఆత్మసిద్ధిని అందుకున్నారు. (ఉపశ్రీ భగవద్గీత నుంచి)

జనక మహారాజు రాజ్యంలో ఉండే సామాన్య ప్రజలు సైతం వారు చేయవలసిన ధర్మబద్ధమైన పనులకు దూరం కాకుండా, వాటి మీదే మనసు నిలిపి ఉంచటమే జనక మహారాజు లక్ష్యం. పరిపాలకులు సత్యమార్గంలో నడిస్తే, ప్రజలు కూడా సత్యమార్గంలోనే నడిచితీరతారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న నాయకులు - గురువులు - మార్గదర్శకులు.. ఆదర్శవంతమైన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను కలిగి ఉండాలి.

మానవులు ప్రధానంగా అనుకరణ స్వభావులు. ఇతరులను చూసి అనుకరించడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ప్రజలంతా పరిపాలకులను, శిష్యులు గురువులను, పిల్లలు పెద్దలను అనుసరిస్తారు. 'శ్రేష్ఠులైనవారు చేస్తున్నారు కనుక అది సరి అయినది అయి ఉంటుంది' అని దానిని ఆచరణకు స్వీకరిస్తారు. పెంపుడు జంతువులు.. తమ యజమానిని అనుకరిస్తాయి. ఏది చెప్తే అది చేస్తాయి. అలా అవి మానవులను అనుకరించి తదుపరి జన్మల్లో మానవ జన్మలెత్తుతాయని పరిశోధనలు చెబుతున్నాయి.




'యథా రాజా తథా ప్రజా' 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అని సామెతలు అందరికీ తెలిసినవే. ఒక గొర్రె ఎటు నడిస్తే, మిగిలిన గొర్రెలన్నీ దాని వెనుకే నడుస్తాయి.. అని కూడా తెలిసిందే. అజ్ఞానులైన మార్గదర్శకులు చేసే పని వల్ల, అతడిని అనుసరించేవారంతా గొర్రెలలాగే ప్రవర్తిస్తారు.

పెద్దవాళ్లే తప్పు చేస్తే, పిల్లలు ఆ తప్పును అనుకరించకుండా ఎలా ఉంటారు.

ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెప్తారు.

అనగనగా ఒక ఊరిలో ఒక అజ్ఞాని ఉన్నాడు. తనను తాను గొప్పవాడు అనుకున్నాడు. ఒకసారి ఒక రాగి చెంబు తీసుకుని గంగా తీరానికి స్నానానికి వెళ్లాడు. చెంబును గట్టు మీద ఉంచి స్నానం చేయాలనుకున్నాడు. చెంబును గట్టున పెట్టినప్పుడు ఎవరైనా ఎత్తుకుపోతే ఎలా? అని ఆలోచన చేసి, ఆ చెంబుని ఒడ్డున ఇసుకలో పాతిపెట్టి, పై భాగాన్ని ఇసుకతో శివలింగాకృతితో చేసి, స్నానానికి నదిలోకి దిగాడు. మూడు మునకలు వేసి ఒడ్డుకు వచ్చి చూసేసరికి, అక్కడ వందల సంఖ్యలో శివలింగాలు కనిపించాయి. తాను అలా చెంబును ఒడ్డున పాతిపెట్టడం చూసిన అక్కడివారు, 'స్నానం చేయడానికి ముందు ఇలా చేయాలేమో' అనుకుని అతడిని అనుసరించారు. ఆ అజ్ఞాని ఎందుకు అలా చేశాడో ఆలోచించకుండా, అతడు చేసినట్లే చేయాలేమో అని భావించారు. 'శాస్త్ర ప్రామాణికంగా చెప్పినవాటిని మాత్రమే ఆచరించాలి' అని భగవద్గీత చెప్పినదానిని అనుసరించకుండా, అయోగ్యులు చెప్పిన అంశాలను, అజ్ఞానులు అనుసరించిన మార్గాన్ని అనుసరించడం వల్ల ఏమాత్రం మేలు చేకూరదు. శాస్త్రం చెప్పిన విధివిధానాలనే శాస్త్రప్రమాణంగా ఆచరించాలని చెప్తారు పెద్దలు.

రామాయణంలో రాముడు సత్యానికి, ధర్మానికి కట్టుబడి, శాస్త్ర వచనాలను అనుసరించడం వల్లే నేటికీ రాముడు మనకు ఆదర్శప్రాయంగా నిలబడ్డాడు. రాముడు అనుసరించిన మార్గం నిత్యం అనుకరణీయం.

- డా. పురాణపండ వైజయంతి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# దయాగుణం

రామయ్యకు నిజాయితీగల వ్యాపారి అని పేరుంది. ఆయనకు జయంతుడు, వర్ధనుడు, గోపాలుడు అని ముగ్గురు కొడుకులున్నారు. వయసురీత్యా వ్యాపార బాధ్యతలను కొడుకులకు అప్పగించాలనుకున్నాడు రామయ్య. అందుకోసం ఒక పరీక్ష పెట్టాలనుకున్నాడు.

ఒకరోజు ముగ్గురు కొడుకులను పిలిచి "నాయనలారా! నా తరువాత మన వ్యాపారాన్ని, కుటుంబ బాధ్యతలను ఎవరికి అప్పగించాలో నిర్ణయించడానికి మీకొక చిన్న పరీక్ష పెడతాను. ఇందులో మీ బుద్ధికుశలతను నిరూపించుకోవాలి" అన్నాడు.

తండ్రి పెట్టే పరీక్షకు ముగ్గురు కొడుకులు సమ్మతించారు.


రామయ్య ఒక్కొక్కరికీ గ్లాసు పాలు చేతికిచ్చి "మీ చేతిలో ఉన్న ఈ పాల విలువను సరిగ్గా ఒక గంటలో పెంచి చూపించాలి. ఎవరు ఆ పని చేయగలరో, వారే నా వారసుడు" అని ప్రకటించాడు.

ముగ్గురూ ఒక్కో పాల గ్లాసు తీసుకుని ఆలోచిస్తూ అక్కడ నుంచి వెళ్ళిపోయారు. సరిగ్గా గంట తరువాత ముగ్గురు ఇంటికి చేరుకున్నారు.

ముందుగా పెద్దకొడుకు జయంతుడు "నాన్నగారూ! ఈ చరాచర సృష్టికి మూలమైన ఆ పరమేశ్వరుడికి ఈ పాలను భక్తితో నైవేద్యంగా సమర్పించాను. దేవుడి ప్రసాదంగా మారిన పాల విలువ ఇప్పుడు వెలకట్టలేనిది!" అంటూ చేతిలోని పాల గ్లాసును భక్తితో తండ్రికి చూపించాడు.

రెండో కొడుకు వర్ధనుడు "నాన్నగారూ! ఈ పాల అసలు వెల మార్కెట్లో పది రూపాయలు మాత్రమే ఉంటుంది. కానీ నేను మన వీధి చివర ఉన్న హోటల్‌కు వెళ్లి, ఇవి చిక్కని గేదె పాలని అబద్ధం చెప్పి ఇరవై రూపాయలకు అమ్మాను. ఒక గంటలో ఈ పాల విలువను రెట్టింపు చేశాను!" అని గర్వంగా జేబులోంచి డబ్బు తీసి చూపించాడు.

చివరగా చిన్నకొడుకు గోపాలుడు తలదించుకుని "నాన్నగారూ! నేను గ్లాసు



పట్టుకుని బయటకు వెళ్లగానే వీధి అరుగు మీద భిక్షాటన చేస్తూ ఆకలితో అల్లాడిపోతున్న ఒక పిల్లవాడిని చూశాను. ఆ సమయంలో నా చేతిలో ఉన్న పాల విలువను నా స్వార్థం కోసం పెంచడం కన్నా, ఆకలితో ఉన్న ఒక అభాగ్యుడి ప్రాణం కాపాడేందుకు ఇవ్వడం ముఖ్యమనిపించింది. వెంటనే పాలగ్లాసు అతడికి ఇచ్చేశాను. పాలు తాగగానే అతడి కడుపు నిండి, ఆనందంతో నాకు రెండు చేతులు జోడించి నమస్కరించాడు. క్షమించండి నాన్నగారూ... నేను పాల విలువను ధనరూపంలో పెంచలేకపోయాను" అంటూ ఖాళీ పాలగ్లాసును చూపించాడు.

రామయ్య ముగ్గురు కొడుకుల మాటలు విని "జయంతుడి భక్తి గొప్పదే, కానీ భక్తి మాత్రమే ఉంటే లోకజ్ఞానం తెలియదు. వ్యాపారాన్ని నడపలేడు. ఇక వర్ధనుడు లాభం కోసం మోసం చేసి పాలు అమ్మేశాడు. మోసం ఉన్నచోట వ్యాపారం ఎంతోకాలం నిలబడదు. కాబట్టి అతను విలువలతో కూడిన వ్యాపారం అస్సలు చేయలేడు.

కానీ గోపాలుడు ఒక వ్యక్తి ఆకలిని తీర్చాడు. ఒక వస్తువు నిజమైన విలువ దాని ధరలో కాదు. అది సరైన సమయంలో ఒకరికి ఉపయోగపడటంలో ఉంటుంది. మన కుటుంబ బాధ్యతలు తీసుకోవాలన్నా, సమాజంలో నిజాయతీగా వ్యాపారం చేయాలన్నా పరోపకారగుణం, దయా హృదయం చాలా ముఖ్యం. కాబట్టి చిన్నవాడైనా గోపాలుడే నా తరువాత అన్ని బాధ్యతలను చూసుకోవడానికి అర్హుడు" అని ప్రకటించాడు రామయ్య.

- **అవ్యాన్**, గుడివాడ

## పదాల పజిల్


ఇచ్చిన ఆంగ్ల పదాలు పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.



| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| B | N | D | I | P | I | N | U | D | Y | E | G | V | V |
| B | A | S | K | E | T | O | L | B | L | I | H | W | U |
| W | S | P | M | B | T | U | T | H | X | B | V | Q | D |
| S | M | O | D | O | N | F | G | E | P | I | B | G | S |
| V | I | H | R | N | Y | Z | P | G | H | B | U | T | R |
| O | R | R | C | N | S | B | O | G | D | L | N | R | K |
| Q | A | E | H | E | O | I | D | H | T | E | N | A | U |
| C | C | S | I | T | E | J | J | U | L | Z | Y | D | S |
| G | L | D | C | G | H | S | U | N | D | A | Y | I | P |
| V | E | G | K | I | Z | G | U | T | J | G | N | T | R |
| E | P | B | P | F | P | A | R | A | D | E | N | I | I |
| G | F | Y | L | T | O | J | A | A | U | W | I | O | N |
| W | F | U | D | S | C | N | H | G | S | D | O | N | G |
| C | R | O | S | S | Z | I | X | W | W | S | R | G | V |

| | | | |
|---|---|---|---|
| BONNET | BUNNY | GIFTS | BASKET |
| TRADITION | PARADE | SPRING | CROSS |
| CARROT | SUNDAY | GRASS | EGG HUNT |
| MIRACLE | DYE | BIBLE | CHICK |

## దారి చూపించండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# మొసలి కన్నీరు

ఒకరోజు సాయంత్రం తాతయ్య వరండాలో కుర్చీలో కూర్చుని ఉండగా, మనవరాలు ఉజ్వల, మనవడు శరత్ పరుగున వచ్చి ఆయన పక్కన చేరారు. ''తాతయ్యా.. ఇందాక టీవీలో ఒకాయన రాజకీయ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని అంటుంటే విన్నాం. అసలు మొసళ్లు కూడా మనలాగే ఏడుస్తాయా?'' అని అడిగింది ఉజ్వల సందేహంగా. తాతయ్య నవ్వి, ''అవునమ్మా! మొసళ్లు ఏడుస్తాయి. కానీ ఆ ఏడుపు వెనుక ఒక వింత కథ, ఒక శాస్త్రీయ నిజం ఉన్నాయి. చెప్తాను వినండి'' అంటూ కథ మొదలుపెట్టాడు.

అనగనగా ఒక పెద్ద మడుగులో ఒక ముసలి మొసలి ఉండేది. అది చాలా తెలివైనది, అంతకంటే ఎక్కువ మోసకారి. ఒకరోజు ఒక జింక దాహంతో ఆ మడుగు దగ్గరకు వచ్చింది. ఒడ్డున కదలకుండా పడి ఉన్న మొసలిని చూసి జింకకు అనుమానం వచ్చింది. అది రాయా లేక మొసలా అని తేల్చుకోలేక జింక అక్కడే ఆగిపోయింది. జింక తనని గమనిస్తోందని గ్రహించిన మొసలి, తను రాయిలాగే నటించాలని నిశ్చయించుకుని అస్సలు కదలకుండా బిగుసుకుపోయింది. సరిగ్గా అప్పుడే ఒక పావురం ఎగురుకుంటూ వచ్చి, మొసలిని రాయి అనుకుని దాని తల మీద వాలింది. అది చూసిన జింక, ''పావురమే దాని మీద వాలిందంటే అది ఖచ్చితంగా రాయే అయి ఉంటుంది'' అని నమ్మి, నిశ్చింతగా నీళ్లు తాగడానికి ముందుకు వెళ్లింది.

జింక తల దించి నీళ్లు తాగుతున్న సమయంలో, మొసలి ఒక్కసారిగా నోరు తెరిచి జింక మీద దాడికి లేచింది. ఆ ఊహించని పరిణామానికి పావురం భయపడి టపటపామని రెక్కలు ఆడిస్తూ ఒక్కసారిగా పైకి ఎగిరిపోయింది. ఆ రెక్కల చప్పుడు విని జింక అప్రమత్తమై, మొసలి నోటికి చిక్కకుండా ఒకే గెంతుతో అడవిలోకి పారిపోయింది. ఆహారం దొరకలేదని మొసలి



నిరాశతో ఒడ్డుకు వచ్చి కళ్ల వెంట నీళ్లు కార్చసాగింది. అప్పుడే అక్కడికి ఒక నీటి ఏనుగు వచ్చింది. మొసలి కళ్లలో నీళ్లు చూసి అది బాధపడుతోందని భ్రమపడి, ''ఏమైంది మిత్రమా! ఎందుకు ఏడుస్తున్నావు?'' అని జాలితో అడిగింది.

మొసలి మెల్లగా తన కపట బుద్ధితో.. ''మిత్రమా! నాకు చాలా జబ్బుగా ఉంది. సింహం మాంసం తింటేనే నా జబ్బు తగ్గుతుందని ఒక వైద్యుడు చెప్పాడు. కానీ నాకు వేటాడే శక్తిలేక ఇలా ఆకలితో అలమటిస్తున్నాను'' అని అబద్ధం చెప్పింది. అమాయకపు నీటి ఏనుగు కరిగిపోయి, ''సరే, ఏడవకు నేను ఎలాగైనా నీ కోసం సింహం మాంసం తెచ్చిపెడతాను'' అని మాట ఇచ్చింది. ఇదంతా చెట్టు చాటు నుంచి వింటున్న జింక బయటకు వచ్చి, ''నీటి ఏనుగు మిత్రమా! ఆ మొసలి కన్నీళ్లు చూసి మోసపోకు. అది నిన్ను ప్రమాదంలో పడేయాలని చూస్తోంది. సింహం నీళ్ల కోసం వచ్చినప్పుడు నువ్వు దానితో పోరాడితే, మీ ఇద్దరిలో ఎవరు చనిపోయినా ఈ మొసలికి లాభమే. కష్టపడకుండా దానికి ఆహారం దొరుకుతుందని ఇలాంటి నాటకం ఆడుతోంది'' అని అసలు నిజాన్ని బయటపెట్టింది.

తాతయ్య పిల్లల వైపు చూస్తూ, ''చూశారా పిల్లలూ! నిజానికి మొసళ్లు మనలా ఏడవ్వు. శాస్త్రీయంగా చూస్తే, మొసళ్లు ఆహారాన్ని నమిలేటప్పుడు, వాటి దవడలను బలంగా కదిలించినప్పుడు వాటి దవడ కండరాలు కంటి దగ్గర ఉండే గ్రంథుల మీద గట్టిగా ఒత్తిడి తెస్తాయి. ఆ ఒత్తిడి వల్ల కళ్ల నుంచి నీరు దానంతట అదే బయటకు వస్తుంది. ఇది ఒక సహజమైన శారీరక ప్రక్రియ మాత్రమే, అంతేకానీ అది జాలిపడి కార్చే కన్నీరు కాదు. అందుకే ఎవరైనా లోపల చెడు ఆలోచనలు పెట్టుకుని, పైకి ఏడుస్తూ నటించే వాళ్లను చూసి మన పూర్వీకులు మొసలి కన్నీరు అనే జాతీయాన్ని సృష్టించారు'' అని వివరించాడు.

అది విన్నాక ఉజ్వల, శరత్‌లు.. ''ఓహో! ఇదా అసలు విషయం..'' అని ఒక కొత్త విషయాన్ని తెలుసుకున్న సంతోషంతో చప్పట్లు కొట్టారు.

-డా. పోతగాని సత్యనారాయణ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్‌అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



పిల్లల కథ

# నిజమైన నాయకత్వం

• ముద్దు హేమలత

అనగనగా ఒక అడవిలో ఒక సింహం ఉండేది. అది చాలా శక్తిమంతమైనది, కానీ శక్తికి మించిన గర్వం దాని సొంతం. ప్రతిరోజూ ఉదయాన్నే ఆ సింహం చేసే భయంకరమైన గర్జనలకు అడవిలోని చెట్లు సైతం వణికిపోయేవి. ‘ఈ అడవికి నేనే సర్వాధికారిని, నా మాటే వేదవాక్కు’ అని అది విర్రవీగుతూ, మిగిలిన జంతువులను చులకనగా చూసేది. జంతువులన్నీ దాని నీడ కనిపిస్తేనే ప్రాణభయంతో చెల్లాచెదురైపోయేవి.

ఒక మధ్యాహ్నం మండుతున్న ఎండలో ఒక ఏనుగు చెరువు దగ్గర ప్రశాంతంగా నీళ్లు తాగుతోంది. సరిగ్గా అదే సమయానికి అక్కడికి వచ్చిన సింహం, ఏనుగును చూడగానే అహంకారంతో ఊగిపోయింది. ‘ఓయ్ నల్ల బండా! నా దారికి అడ్డుగా నిలబడతావా? నేనెవరో తెలుసా? వెంటనే ఇక్కడి నుండి తప్పుకో!’ అని గర్జించింది. ఏనుగు చాలా సంస్కారవంతురాలు కాబట్టి, ఎంతో వినమ్రంగా ‘క్షమించు రాజా, దాహం వేసి ఇప్పుడే వచ్చాను, నీళ్లు తాగి వెళ్ళిపోతాను’ అని బదులిచ్చింది. కానీ సింహం శాంతించలేదు, ‘క్షణంలో నా కంట పడకుండా వెళ్ళిపోకపోతే నీ అంతం చూస్తాను’ అని హెచ్చరించింది. ఏనుగు ఏమీ మాట్లాడకుండా, ఆ గర్విష్ఠి సింహానికి తలవంచి అక్కడి నుండి మౌనంగా వెళ్ళిపోయింది.

మరుసటి రోజు అడవిలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కారుమబ్బులు కమ్మి, భయంకరమైన తుఫాను మొదలైంది. ఉరుములు, మెరుపుల ధాటికి అడవి అంతా అతలాకుతలమైంది. పెనుగాలికి ఒక భారీవృక్షం వేళ్లతో సహా పెకలించుకుపోయి, సరిగ్గా గుహ బయట ఉన్న సింహం మీద పడింది. ఆ బరువుకు సింహం కింద పడిపోయి, కదలలేని స్థితికి చేరుకుంది. ‘ఎవరైనా కాపాడండి! చనిపోతున్నాను!’ అని ఎంత ఆక్రందన చేసినా, దాని గర్వానికి భయపడి ఏ జంతువూ దరిదాపుల్లోకి రాలేదు.

అదే సమయంలో అడవిలో వైద్యం చేసే ఎలుగుబంటి సింహం పడుతున్న యాతనను చూసి చలించిపోయింది. వెంటనే సింహం దగ్గరకు వెళ్లి, ఆ భారీ చెట్టును పక్కకు జరపడానికి తన శక్తినంతా ధారపోసి ప్రయత్నించింది. కానీ ఒక్క ఎలుగుబంటి వల్ల అది సాధ్యం కాలేదు. అప్పుడు ఎలుగుబంటికి ఏనుగు గుర్తుకు వచ్చింది. సింహం చేసిన అవమానాన్ని మరచిపోయి, అడవి రాజు ప్రాణాలు కాపాడమని ఏనుగును వేడుకుంది. ఏనుగు క్షణం కూడా ఆలోచించకుండా అక్కడికి చేరుకుని, తన బలమైన తొండంతో ఆ భారీ వృక్షాన్ని ఒక్క ఊపున పక్కకు విసిరేసింది.

ప్రాణాలు దక్కించుకున్న సింహం కళ్లలో నీళ్లు తిరిగాయి. ‘గజరాజా! నిన్ను నిన్ను అంతగా అవమానించినా, నా ప్రాణాలు ఎందుకు కాపాడావు?’ అని పశ్చాత్తాపంతో అడిగింది. అప్పుడు ఏనుగు చిరునవ్వుతో ‘రాజా! ఇతరులను భయపెట్టడం అధికారం కాదు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన శక్తి’ అని హితవు పలికింది. ఎలుగుబంటి కూడా తోడై ‘ప్రేమతో సాధించలేనిది ఏదీ లేదు’ అని వివరించింది. ఆ మాటలతో సింహం అహంకారం పూర్తిగా నశించిపోయింది.

అయితే, అడవిలో శాంతి నెలకొంటున్న తరుణంలో ఒక కొత్త ముప్పు పొంచి వచ్చింది. కొంతమంది వేటగాళ్లు అత్యాధునిక ఆయుధాలతో అడవిపై దాడి చేయడానికి సరిహద్దుల్లో తిష్ట వేశారు. గతంలో అయితే సింహం ఒంటరిగా వెళ్లి వారితో పోరాడి గాయపడేది, కానీ ఇప్పుడు అది ఏనుగు, ఎలుగుబంటితో కలిసి యుద్ధ తంత్రాన్ని రచించింది. పక్షులు ఆకాశం నుండి వేటగాళ్ల కదలికలను గమనించాయి, కోతులు చెట్లపై నుండి రాళ్లు రువ్వాయి, ఎలుగుబంటి తేనెటీగల గుంపును వారిపైకి ఉసిగొల్పింది. చివరగా సింహం, ఏనుగులు కలిసి చేసిన మెరుపు దాడికి వేటగాళ్లు ప్రాణభయంతో అడవి విడిచి పారిపోయారు.

అడవిలో మునుపెన్నడూ లేని ఐక్యత కనిపించింది. సింహం తన గర్వాన్ని వదిలి, ఏనుగును తన మంత్రిగా, ఎలుగుబంటిని రాజ్య వైద్యుడిగా నియమించుకుంది. ప్రతి జంతువు సమస్యను స్వయంగా విని పరిష్కరించే నాయకుడిగా సింహం పేరు తెచ్చుకుంది. అడవిలో క్రూరత్వం పోయి అనురాగం పెరిగింది, బలహీనమైన జంతువులకు రక్షణ దొరికింది. శక్తికి వివేకం తోడైతే, అధికారం సేవగా మారితే ఎంతటి మార్పు వస్తుందో తెలుసుకుంది సింహం.

## హితవచనం

**అకులీనోపి మూర్ఖోపి భూపాలం యోత్ర సేవతే**
**అపి సంమానహీనోపి స సర్వత్రాభిపూజ్యతే**

రాజసేవలో తరించేవాడైతే చాలు, వాడు అమర్యాదస్తుడైనా, మూర్ఖుడైనా, గౌరవానికి తగనివాడైనా, అంతటా గౌరవం పొందుతాడు.

# అల్లరి

ALLARI



## చెప్పుకోండి

- కతకత కంగు. తోలు తీసి మింగు?
  **- అరటి పండు**
- నీలం చీర. మధ్యలో వెన్నముద్ద. అక్కడక్కడా అన్నపు మెతుకులు?
  **- ఆకాశంలో చంద్రుడు, నక్షత్రాలు**
- బంగారు భరిణలో రత్నాలు. పగులగొడితేగాని బయటికి రావు?
  **- దానిమ్మపండు.**


## పెద్దల మాట



మనసు చెప్పినట్టు మనం వినడం కాదు, మనం చెప్పినట్టు మనసు వినేలా చేసుకోవాలి!

**- గౌతమ బుద్ధుడు**

## రంగులేయండి



**చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.**

# మంచి పని

... సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

నరసింహపురంలో ఉండే రాము ఐదో తరగతి చదువుతున్నాడు. పుట్టిన రోజున తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బును తనకు నచ్చిన వస్తువును కొనుక్కుందామని దాచుకున్నాడు. అది వేసవికాలం. ఒకరోజు తాను పొదుపు చేసిన డబ్బును మిత్రులకు చూపిద్దామని వారి ఇంటికి వెళ్లాడు రాము. అక్కడికి మామిడి పండ్లు అమ్మకానికి వచ్చాయి. రాము తాను దాచుకున్న డబ్బుతో కొన్ని మామిడి పండ్లు కొని.. మిత్రులకు కొన్ని ఇచ్చి, తాను కొన్ని తిన్నాడు. తర్వాత తల్లిదండ్రుల కోసం రెండు పండ్లు పట్టుకొని, మిత్రులతో కలిసి తన ఇంటికి వస్తున్నాడు. అప్పటికి మధ్యాహ్నమైంది. తమ ముందు నడుస్తున్న ఒక వృద్ధుడు దారిలో అకస్మాత్తుగా స్పృహ తప్పి కింద పడిపోయాడు. రాముతోపాటు అతని మిత్రులు ఆ వృద్ధుని వెంటనే పైకి లేపి నీడన కూర్చోబెట్టారు. రాము పరిగెత్తుకొంటూ వెళ్లి కొన్ని నీళ్లు, కొబ్బరి బొండాం కొనుక్కొని వచ్చాడు. నీళ్లను అతని ముఖంపై చల్లి.. కొబ్బరి బొండాం నీళ్లు తాగించాడు. ఒక ఆటో మాట్లాడి ఆ వృద్ధున్ని వైద్యుని దగ్గరికి తీసుకెళ్లారు. వెంటనే చికిత్స అందడంతో ఆ వృద్ధుడు కోలుకున్నాడు. అప్పుడు ఆ పెద్దాయన.. 'బాబూ! మీ దయవల్ల వడదెబ్బ నుంచి కోలుకున్నాను. నాకు ప్రాణదానం చేశారు' అని అన్నాడు. దానికి రాము.. 'తాతా! ఈ ఎండలో నువ్వు నెత్తికి తువ్వాలు చుట్టుకోకుండా ఎక్కడికి బయలుదేరావు? మేమే తలపై టోపీలు పెట్టుకున్నాం. నీ ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకోవద్దా?' అని అడిగాడు. అప్పుడు తాత.. 'నా నెత్తికి తెల్లని తువ్వాలు చుట్టు కొనే బయలుదేరాను. దారిలో ఒక మహిళ చిన్న పాపను ఎత్తుకొని వస్తున్నది. ఆ పాపకు వడదెబ్బ సోకుతుందని.. నా తలకు చుట్టుకున్న తువ్వాలను అడిగింది. నేను దాన్ని ఆమెకు ఇచ్చాను' అని చెప్పాడు. ఇంటికి వెళ్లేముందు తన చేతిలో ఉన్న రెండు పండ్లనూ ఆ తాతకే ఇచ్చాడు రాము. ఇంటికి వచ్చిన తర్వాత జరిగినదంతా తల్లిదండ్రులకు చెప్పాడు. అప్పుడు వాళ్లు.. 'రామూ! నువ్వు చేసిన మంచి పని గురించి ఇరుగుపొరుగు వాళ్లు మాకు ముందే చెప్పారు లే! వాళ్లు నిన్ను, నీ మిత్రులను చూశారట. మాకు కీర్తి తెచ్చే గొప్పపని చేశావు. మాకు ఎంతో సంతోషం. నీకు మళ్లీ డబ్బు ఇస్తాంలే! నువ్వేం కంగారు పడకు' అని అన్నారు. దాంతో రాము తాను చేసిన మంచి పని తన తల్లిదండ్రు లకు నచ్చినందుకు ఎంతో సంతోషించాడు.




## మీకు తెలుసా?



మిక్కీ మౌస్, బగ్స్ బన్నీ, సింప్సన్స్ వంటి అనేక కార్టూన్ పాత్రల చేతులకు నాలుగు వేళ్లే ఉంటాయి. యానిమేషన్ ప్రపంచంలో ఇదో సంప్రదాయం కూడా! ఎందుకంటే, ఐదు వేళ్లకన్నా నాలుగు వేళ్లు గీయడం, యానిమేట్ చేయడం చాలా సులభం. ఇక చిన్నగా ఉండే కార్టూన్ పాత్రల చేతికి ఐదు వేళ్లు గీస్తే.. అవి ఇరుకుగా అయిపోయి, చూడటానికి 'అరటిపండ్ల గెల' మాదిరిగా వింతగా కనిపించేవట. అదే నాలుగు వేళ్లు గీయడం వల్ల చేయి స్పష్టంగా, అందంగా, భావాలను పలికించడానికి సులభంగా ఉంటుందని ఈ ఏర్పాటు.

## పూరించండి

**బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.**



O_l



O_oe

## పద్యం - భావం

**కానివాని చేతఁగాసు వీసంబిచ్చి**
**వెంటఁదిరుగువాఁడె వెట్టివాఁడు**
**పిల్లి తిన్న కోడి పిలిచిన పలుకునా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం:** వడ్డీ కోసం హీనులకు డబ్బు ఇచ్చి.. తిరిగి వసూలు చేసుకోవడానికి వాని వెంట తిరిగే వాడు వెర్రివాడు. పిల్లి తిన్న కోడిని పలకరిస్తే.. అది ఎన్నటికీ పలుకదు కదా!?

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నెమలీక

## క్షమిస్తే పోయేదేముంది?

- కె.వి.సుమలత, 9492656255

రాము, శ్రీను అనే ఇద్దరు ప్రాణ స్నేహితులు ఒకే బడిలో, ఒకే తరగతి చదువుతున్నారు. రాముకి మొక్కలంటే ప్రాణం. ఒకరోజు తను తిన్న మామిడి పండు టెంకను వాళ్ళ ఇంటి వెనుక పెరట్లో ఎంతో ఆశగా నాటాడు. ప్రతిరోజూ బడి నుండి రాగానే ఆ మొక్క చుట్టూ ఉన్న కలుపు తీసి, ప్రేమగా నీరు పోసేవాడు. రాము సంరక్షణలో ఆ చిన్న మొక్క క్రమేపి పచ్చగా ఎదుగుతోంది.

ఒక రోజు సాయంత్రం రాము, శ్రీను కలిసి ఆ పెరట్లోనే ఆడుకుంటున్నారు. ఆట జోరులో శ్రీను బంతిని చాలా బలంగా కొట్టాడు. దురదృష్టవశాత్తూ ఆ బంతి వెళ్ళి సరిగ్గా ఎదుగుతున్న మామిడి మొక్కకు తగిలింది. అంతే... ఆ దెబ్బకు మొక్క మధ్యలోని ప్రధాన కాండం మొదట్లోకి విరిగి కిందకు వాలిపోయింది.

అది చూసి రాము గుండె పగిలినంత పనైంది.

“శ్రీనూ... ఎంత పని చేశావ్! నా ప్రాణం లాంటి మొక్కను ఎందుకు ఇలా విరిచేసావు? ఇప్పుడు అది చచ్చిపోతుంది కదా!” అంటూ ఏడుస్తూ గట్టిగా అరిచాడు.

శ్రీను భయంతో, బాధతో వణికిపోతూ... “క్షమించు రామూ! నేను కావాలని చేయలేదు. ఆటలో బంతి అలా వెళ్ళింది కానీ, నీ మొక్కను బాధపెట్టాలనే ఉద్దేశం నాకు అస్సలు లేదు” అని బ్రతిమాలాడు.



కానీ కోపంతో ఊగిపోతున్న రాము, “నీతో ఇక జీవితంలో మాట్లాడను! నువ్వు ఇక్కడి నుండి వెళ్లిపో!” అంటూ శ్రీనును వెనక్కి తోసేసాడు. శ్రీను తన తప్పుకు ఎంత ప్రాధేయపడినా, కన్నీరు పెట్టుకున్నా రాము మనసు కరగలేదు.

ఆ రోజు నుండి రాము, శ్రీనుతో మాట్లాడటం పూర్తిగా మానేశాడు. బడిలో కూడా ఎప్పుడూ పక్కపక్కనే కూర్చునేవాళ్ళు కాస్తా, ఇప్పుడు దూరంగా కూర్చోవడం మొదలుపెట్టారు. శ్రీను పలకరించాలని చూసినా రాము మొహం తిప్పుకునేవాడు.

కొన్ని రోజుల తరువాత రాముకి తీవ్రమైన జ్వరం వచ్చింది. కళ్ళు తెరవడానికి కూడా ఓపిక లేనంత నిస్సత్తువ ఆవహించింది. దాంతో వారం రోజుల పాటు బడికి వెళ్ళలేకపోయాడు. వారం తర్వాత జ్వరం తగ్గి కాస్త కోలుకున్నాక, బడికి వెళ్ళాలని రాము తన పుస్తకాల బ్యాగు తెరిచాడు.

ఆశ్చర్యం! తను బడికి వెళ్లని ఆ వారం రోజుల హోం వర్కులు, నోట్స్ అన్నీ పూర్తిగా రాసి ఉన్నాయి. ఆ చేతివ్రాత చూడగానే రాముకి అది తన స్నేహితుడు శ్రీనుదేనని వెంటనే అర్థమైపోయింది.

రాము మనసులో ఏదో తెలియని అలజడి మొదలైంది. వెంటనే అమ్మను వెతుకుతూ పెరట్లోకి పరుగెత్తాడు. అక్కడ అతనికి మరో పెద్ద ఆశ్చర్యం ఎదురైంది. విరిగిపోయిన ఆ మామిడి మొక్క, చనిపోలేదు సరే కదా... కొత్త చిగుర్లతో పచ్చగా కళకళలాడుతోంది! అమ్మ దానికి ఎంతో ప్రేమగా నీళ్ళు పోస్తోంది.

“అమ్మా! ఇది... ఇది ఎలా సాధ్యమైంది...?” ఆశ్చర్యంతో నోట మాట రాక మొక్కను చూపిస్తూ అడిగాడు రాము.

అమ్మ నవ్వుతూ, “రామూ... నీకు జ్వరం వచ్చిన రోజు నుండి శ్రీను ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడికి వస్తున్నాడు. నువ్వు లేకపోయినా ఈ మొక్క ఎండిపోకూడదని దీనికి ఎంతో జాగ్రత్తగా నీళ్ళు పోసి కాపాడాడు. అంతేకాదు, నువ్వు చదువులో వెనకబడకూడదని రోజు బడిలో ఏం జరిగిందో తెలుసుకుని, నీ నోట్సులన్నీ తనే కూర్చుని రాసాడు” అంది.

అమ్మ మాటలు వినగానే రాము కళ్ళు నీటితో నిండిపోయాయి. కోపంతో తను చేసిన తప్పు, శ్రీను చూపించిన నిఖార్సయిన స్నేహం అతనికి అర్థమయ్యాయి. కళ్ళు తుడుచుకుంటూ, పశ్చాత్తాపంతో ఆ మొక్క పక్కనే ఉన్న ఒక రాయి మీద చాక్ పీస్ తో పెద్ద అక్షరాలతో ఇలా వ్రాసాడు.

“క్షమాగుణం స్నేహానికి మూలం”

ఆ వాక్యాన్ని, కొడుకు మారిన మనసును చూసి అమ్మ కళ్ళు ఆనందంతో మెరిసాయి. ఆ మరుసటి రోజు నుండి రాము, శ్రీనుల స్నేహం ఆ మామిడి మొక్కలాగే మరింత బలంగా చిగురించింది.

◆◆

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# సూరిగాడు

బాలల కథ

ఎస్‌కె. అనిసా తబస్సుమ్
85220 97112

ఇంకా జల్లు కురుస్తూనే ఉంది. వాకిలి మొత్తం బురదతో నిండిపోయింది. ఇంకా ఎన్ని రోజులు.. అన్నట్టు వాన చినుకులను భారంగా మోస్తున్నాయి పూల మొక్కలు. ఇంటి చూరు మీద నుంచి సర్రున వాన నీరు జారుతుంది. అదే వరండాలో ఒక పక్కకి కూర్చొని, చూరు మీద నుంచి జారుతోంది. వాన నీటిని తదేకంగా చూస్తున్నాడు సూరి. మరి అలా చూడక ఇంకేం చేస్తాడు!! అప్పటికే కడుపునిండా అన్నం తిని మూడురోజులు అయింది. ఆకలికి తట్టుకోలేక ఇంట్లో ఒక పక్కన పడేసిన కొన్ని నూకలు మిగిలితే వాటితోనే గంజి కాచుకొని తాగుతున్నారు. సూరి ఇంట్లో తాను, అతని తల్లితండ్రులు, చెల్లి ఉంటున్నారు. ఇదే అతని కుటుంబం. సూరి కూలి పనికి వెళ్ళేవాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తారు. అతని చెల్లి సుగుణకు వచ్చే శ్రావణమాసం లగ్గం పెట్టుకున్నారు.

ఇంతలో సూరి తల్లి బయటకు వచ్చి, వరండాలో ఉన్న గుంజను పట్టుకొని, విరక్తి-నిరాశ కలగలిసిన భావంతో 'ముసురు.. మాయదారి ముసురు వారం నుంచి పడతానే ఉండే. మనయా రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులాయే, ఇలాగే ఉంటే బతికి బట్టకట్టేది ఎలాగా. ఇక ఆ దేవుడే కనికరించాలా!' అంటూ గుమ్మానికి ఆనుకొని చతికిలబడింది.

సూరి వాళ్ళ కుటుంబానికే కాదు, దాదాపు ఊర్లో అన్ని కుటుంబాలది ఇదే పరిస్థితి. ఇందుకు గల కారణం, సూరి వాళ్ళ ఊరి పక్కనే ఒక వాగు ప్రవహిస్తుంది. గట్టిగా నాలుగు రోజులు కుండపోత వాన పడితే వాగు పొంగి ఇళ్లు, వాకిలి, పశువుల కొట్టం, పొలాలూ.. ఊరు మొత్తం నీట మునిగిపోతుంది. దిగువుగా ఉన్న ఇళ్ళలోకైతే, ఇంటి లోపలి నీళ్లు వచ్చేస్తాయి. పొలాలు నీట మునిగి, రైతు బిడ్డలకు కన్నీళ్లను మిగులుస్తాయి. వాకిలి దాకా నీళ్లతో మునిగి



ఉండడంతో ఎవరూ బయటికి కదలలేని పరిస్థితి. ఇంకా పొయ్యిలో కట్టె ఎలా వెలుగుతుంది.. సూరి వాళ్ళ ఇంటి పక్కనే ఒక చిన్న కుటుంబం ఉంది. ఇంట్లో పొయ్యి వెలిగించి, ఎన్ని రోజులు అయిందో.. ఆకలికి పసిపిల్లల ఏడుపులు వినిపిస్తూనే ఉన్నాయి. ఆటల్లో పడి ఆకలి మర్చిపోతారని బయటికి పంపుదామన్నా వీలుకాని పరిస్థితాయే.

రెండు, మూడురోజుల నుంచి వర్షం తగ్గడంతో ఇళ్ల ముందున్న నీరు తగ్గిపోయింది. ఆలోచనలోంచి బయటకు వచ్చిన సూరి, చినుకు జల్లులు లెక్కజేయకుండా 'పొలం చూసొస్తానే యమ్మా' అంటూ వరండాలో నుంచి అడుగు బయటపెట్టాడు. మడమల దాకా బురద.. చెప్పులు పనికిరావని అర్థం చేసుకొని, చెప్పులు తీసి, వరండాలో ఒక పక్కకి విసిరి కొట్టి, నడక మొదలుపెట్టాడు. ఎలాగో పొలం చేరుకున్నాడు. నిరాశతో పొలమంతా కలియచూశాడు. ఏమీ మిగలకుండా పొలమంతా నాశనమైంది. పొలంలో మొత్తం వర్షం నీళ్లు. ఆ నీళ్లలోనే ఎన్నో నత్తలు, చేపలు కనిపిస్తున్నాయి. హఠాత్తుగా సూరికి అమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ''ప్రకృతి మనకు ఏదీ ఊరికే ఇవ్వదు. అన్నీ మనకు ఇస్తది. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవాలా!, ఏమిచ్చినా అది మన మంచికే, మనం కూడా దాన్ని అంతే గౌరవించాలి, జాగ్రత్తగా కాపాడుకోవాలి' అని.

సూరి వెంటనే తన ప్యాంటును మోకాళ్ళదాకా మడుచుకున్నాడు. పొలంలోకి దిగి, గబాగబా గంప నిండా నత్తలు, చేపలు పట్టాడు. అటునుంచి అటే చుట్టూ పక్క గ్రామంలోకి వెళ్లాడు. వాటిని అమ్మి, వచ్చిన డబ్బుతో సరుకులు తీస్కొని ఇంటిదారి పట్టడు. ఇంటికి చేరాక కొన్ని సరుకులు పిల్లలున్న పక్కింట్లో ఇచ్చాడు. ఆ రోజు సాయంత్రానికి ఇంట్లో ఒక పక్కన మూడు ఇటుకలు పేర్చి, నిప్పు ముట్టించి ఘుమ ఘుమలాడే చేపల పులుసు, నత్తల వేపుడు చేసి ఇంట్లో అందరికీ వడ్డించింది సూరి తల్లి.

'ఆహా! ఎన్ని రోజులైంది నోటికి రుచి తగిలి' అంటూ సూరి నాన్న అన్నాడు.

'నీ చేతి వంటే వంటే వీరమ్మా!' అని మనసారా ఆస్వాదిస్తూ అన్నాడు సూరి.

అందరూ కడుపు నిండా తిని, ఆదమరిచి నిద్రపోయారు.

ఆ రాత్రి పిల్లల ఏడుపులు కూడా వినిపించలేదు.




బూదాల షైనీ
8వ తరగతి,
మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల,
వద్ది మడుగు (గ్రామం),
కొనకనమిట్ల, మార్కాపురం జిల్లా.





గంటేడ కుందన
5వ తరగతి,
శ్రీజన్ స్కూల్,
పార్వతీపురం.

డా. గంగిశెట్టి శివకుమార్
9441895343



# అసూయ

హరితారణ్యానికి రాజు కేసరి అనే సింహం. దానికి మంత్రి హస్తి అనే ఏనుగు. హస్తి బాగా ముసలిది అయ్యాక కేసరిని అనుమతి అడిగి, విశ్రాంతి తీసుకోసాగింది. అడవిలో బాగా తెలివైన వారెవరా అని ఆలోచించి కేసరి ఎలుగుబంటిని తనమంత్రిగా నియమించుకుంది. ఎలుగుబంటిని మంత్రిగా నియమించుకున్నప్పటి నుండి దానిమీద మిగిలిన అడవి జంతువులకంతా అసూయ ఎక్కువ యిపోయింది.

ఒకరోజు తోడేలు కేసరిని కలిసి, 'మహారాజా! పోయి పోయి ఎలుగుబంటిని మంత్రిగా చేసుకున్నారే! అదొక వికారి. ఒళ్ళంతా వెంట్రుకలే!' అన్నది.

ఆ విషయం కేసరి, ఎలుగుబంటితో అన్నది. ఎలుగుబంటి ఆశ్చర్యపోయింది. తోడేలు తనకు బాల్యమిత్రుడు. అతడే తనను అలా అన్నాడే అని బాధపడింది. తర్వాత కొద్దిరోజులకు కుందేలు కేసరిని కలిసి 'రాజా! మీరేమిటీ? ఎవరూ దొరకనట్టు ఎలుగుబంటిని మంత్రిగా పెట్టుకున్నారు. జాగ్రత్త!. సమయం చూసి ముంచేయగలదు' అన్నది. ఆ మాట కేసరి ఎలుగుబంటితో అన్నది 'అరే ఏమిటీ? కుందేలు అలా అన్నదా? కనపడగానే ''ఎలుగు మామా'' అంటూ ఆప్యాయంగా పలకరిస్తుందే' అని ఎలుగుబంటి బాధపడింది.

తర్వాత జింక కేసరిని కలిసి, 'ప్రభూ! జాగ్రత్త! ఎలుగుబంటి అసలే మంచి జంతువుకాదు' అన్నది. ఈ విషయం కూడా కేసరి ఎలుగుబంటితో చెప్పింది. ఎలుగుబంటి బాధ అంతా ఇంతా కాదు. తనను జింక చూసినప్పుడల్లా ''అన్నా..'' అంటూ ఆప్యాయత చూపిస్తుంది. అలాంటి జింకే ఇలా అన్నదంటే ఏమనుకోవాలి? అనుకుంటూ కనిపించినజంతువుకల్లా తోడేలు, కుందేలు, జింక చేసిన పని చెప్పి బాధపడసాగింది.

ఆ సంగతి హస్తి ఏనుగుకి తెలిసింది. ఎలుగుబంటిని కలిసింది. 'ఎంత మనకు దగ్గరవార యినా మనకు ఏదైనా గొప్ప మేలు జరిగినపుడు అసూయపడడం సహజం. ఆ అసూయ ద్వేషాన్ని కలిగించి, చెడుగా మాట్లాడేటట్టు చేస్తుంది. అది విని మనం బాధపడకూడదు. మన పని మనం చేసుకుంటూ పోవాలి. అంతే తప్పా.. వారి మాటలు గురించి ఆలోచించి, మనసు పాడు చేసుకోకూడదు. అంతలో అక్కడకు వచ్చింది కేసరి సింహం. 'ఈ విషయం తెలియజేయడానికే నిన్ను ఎవరేమన్నా వెంటనే నీకు చెప్పాను. మన పనే.. వాటి విమర్శలకు సమాధానం చెబుతుంది' అన్నది కేసరి. మంచి పాఠం నేర్చుకున్నానని ఎలుగుబంటి సంతోషించింది.

చిరుమువ్వలు

యు. విజయశేఖరరెడ్డి
9959736475

# నెమళ్ల దిన్నె..!

ఒక పెద్ద చెరువు ఒడ్డున ఎక్కువగా నెమళ్లు చేరేవి. అక్కడ వాటికి మంచి ఆహారం దొరికేది. అందుకని ఆ ఊరికి "నెమళ్ల దిన్నె" అని పేరు వచ్చింది. ఒకసారి ఒక నెమలి చెరువు వద్దకు వెళుతుండగా అటు పక్కగా పాము కనిపించడంతో దానిని వెంబడించింది. కానీ ఆ పాము సరసరమని పాకుతూ పక్క పొలం వైపు వెళ్లింది. ఒంటరిగా పొలంలోకి వచ్చిన నెమలిని వేటగాడు చూశాడు. వల వేసి దానిని బంధించాడు.



'అయ్యా! నన్ను ఏం చేస్తావు? అని అంది నెమలి.

'నిన్ను సంతలో అమ్మి డబ్బు సంపాదిస్తాను' అని అన్నాడు వేటగాడు.

నెమలి బాగా ఆలోచించింది. 'ఎలాగైనా ఈ వేటగాడి చేతిలో నుంచి తప్పించుకోవాలి' అనుకుంది. 'నీకు సంతలో కంటే ఎక్కువ డబ్బులు వచ్చేలా చేస్తాను. నన్ను వదిలేస్తావా?' అని అంది నెమలి.

'నాకు డబ్బు ఎక్కువగా వస్తే అలాగే వదిలేస్తాను. డబ్బు వచ్చే మార్గమేమిటో చెప్పు' అన్నాడు వేటగాడు.

'నేను వర్షం వస్తేగానీ పురి విప్పి నాట్యం చేయను. నీకు డబ్బులు రావాలి కదా. అలా వీధుల్లో తీసుకెళ్లు. నేను పురివిప్పి నాట్యం చేస్తాను. నా నాట్యం చూసిన వారు నీకు డబ్బులు ఇస్తారు' అని అంది నెమలి.

'సరే పద..!' అని వేటగాడు నెమలిని వల నుండి విడిపించి, ముందుగా ఒక వీధిలోకి తీసుకెళ్ళాడు. నెమలి పురివిప్పి, నాట్యం చేసింది. చూసిన వాళ్ళంతా చిల్లర డబ్బులు ఇచ్చారు. అలా ఆరు వీధుల్లో తిప్పాడు వేటగాడు. చిల్లర డబ్బులు బాగా పోగయ్యాయి. వాటిని మూట గట్టుకున్నాడు.

'అయ్యా! అన్నట్టుగానే నీకు బాగా డబ్బు ముట్టింది కదా?' అంది నెమలి.

'అవును. ఊహించిన దానికంటే ఎక్కువ డబ్బులు వచ్చాయి. ఇక నిన్ను వదిలిపెట్టను. రోజూ ఇలాగే చుట్టుపక్కల ఊళ్లల్లో ప్రదర్శన చేయిస్తాను. డబ్బు సంపాదిస్తాను' అన్నాడు వేటగాడు.

ఆ మాటలకు నెమలికి కోపం వచ్చింది. 'ఇక నేను వెళ్ళి వస్తాను' అని నెమలి ఎగిరిపోయింది. వేటగాడు నిరాశగా నెమలివైపు చూశాడు. ఆ నెమలి.. నెమళ్ల దిన్నెకు తన నేస్తాల చెంతకు చేరుకుంది. 'ఎక్కడకు వెళ్లావు?' అని అడిగిన తన నేస్తాలకు జరిగిందంతా చెప్పింది. "అందుకే ఒంటరిగా ఎక్కడికీ వెళ్లకూడదు. ఈ మనుషులు అంతే. అత్యాశపడతారు' అని ఆ నెమలిని మందలించాయి తోటి నేస్తాలు.

'ఇంకెప్పుడూ వెళ్ళను' అని చెప్పింది ఆ నెమలి.



## చిన్నప్పుడు

అల్లరి చేశాను చిన్నప్పుడు
హరమూ చేశాను ఎల్లప్పుడు!!

అమ్మ చంకన నేనుండాలని
అన్న మాతో నడుస్తుండాలని!!

లక్కపిడత ఎప్పటికి నాదని
అక్క దాన్ని ముట్టుకోరాదని!!

పంచదార చిలక కావాలని
పంజరంలో పెట్టుకోవాలని!!

పాత లంగా ఇక నా కొద్దని
పట్టు లంగాయే కడు ముద్దని!!

చందమామా దిగి రావాలని
అందరితో ఆడుకోవాలని!!

అమ్మమ్మ వద్దకు పోవాలని
ఆమె ఒళ్ళో పడుకోవాలని!!

తాత బొజ్జపైన ఎక్కాలని
చేతుల్తొ బుగ్గలు నొక్కాలని!!

**'బాలబంధు'**
**అలపర్తి వెంకటసుబ్బారావు.**
**(కేంద్ర సాహిత్య అకాడమీ**
**బాలసాహిత్య పురస్కార గ్రహీత)**
**9440805001.**

## ఐఐటీ ఖరగ్ పూర్ లో స్పిక్‌మాకే..



ఈ వేసవికాలంలో స్పిక్‌మాకే కార్యక్రమంలో పాల్గొనటానికి ఐఐటీ ఖరగ్పూర్ వెళ్లడం నాకు చాలా ఆనందంగా అనిపించింది. మొదట్లో అంత దూరం వెళ్లి, ఆరు రోజుల పాటు నా కుటుంబాన్ని వదిలి, ఎలా ఉండగలనోనని భయంగా అనిపించింది. అక్కడ మొదటిరోజు నాకు చాలా కొత్తగా, కొంచెం గందరగోళంగా అనిపించింది. కానీ తర్వాతిరోజు నుంచి ప్రతి కార్యక్రమానికి ముందుగానే వెళ్లాలని చాలా ఆసక్తి కలిగింది. నేను హ్యాండ్లూమ్ వీవింగ్‌లో పాల్గొన్నాను. కాటన్ బట్టలను ఎలా నేస్తారు, వాటిపై అందమైన డిజైన్లను ఎలా తయారు చేస్తారు అనే విషయాలను నేర్చుకున్నాను. నాకు సంగీతం కూడా వచ్చి ఉంటే ఇంకా బాగుండేదని అనిపించింది. అయినప్పటికీ, నేను హ్యాండ్లూమ్‌ను ఎంతో శ్రద్ధగా, ఉత్సాహంగా నేర్చుకున్నాను. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం తర్వాత వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేకమైన నాటకాలు, కళా ప్రదర్శనలు జరిగేవి. ఎంతో మంది గొప్ప కళాకారులు తమ కళలను ప్రదర్శించడం చూసి, చాలా ఆనందం కలిగింది.




రాత్రి జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో అందమైన నృత్యాలు, సంగీత ప్రదర్శనలు చూశాను. అందులో నాకు కూడియట్టం చాలా నచ్చింది. ఆ నృత్యంలోని ముద్రలు, కళ్ల కదలికలు, భావ వ్యక్తీకరణలు చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

మాకు హెరిటేజ్ టూర్ కూడా ఏర్పాటు చేశారు. అక్కడ ఒక గ్రామాన్ని సందర్శించాము. ఆ గ్రామంలో ప్రజలు బట్టలపై, ఇతర వస్తువులపై చేతితో అందమైన చిత్రాలు వేస్తున్నారు. ప్రతి వస్తువుపై చేతితో పెయింటింగ్స్ వేస్తుండటం చూసి చాలా ఆశ్చర్యపోయాను. కార్యక్రమంలో నాకు చాలామంది కొత్త స్నేహితులు పరిచయమయ్యారు. వారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. వారంతా రకరకాల భాషలు మాట్లాడుతున్నారు. మొదట వారితో మాట్లాడటం కొంచెం కష్టంగా అనిపించింది. కానీ ఇంగ్లీష్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించాను. చివరగా, ఈ ఏడు రోజుల ప్రయాణం నాకు ఎన్నో కొత్త అనుభవాలు, కొత్త స్నేహితులు, మరపురాని జ్ఞాపకాలను ఇచ్చింది. ఈ స్పిక్‌మాకే శిబిరం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక మంచి అనుభవం.



**సి. దీపు కార్తికేయ**
**8వ తరగతి,**
**అరవింద మోడల్ స్కూల్,**
**మంగళగిరి, గుంటూరు జిల్లా.**

## దొంగబుద్ధి



మాధవరం అనే ఊరిలో రంగయ్య, వీరయ్య అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. రంగయ్య మంచి స్వభావం గలవాడు. కానీ వీరయ్యకి ఆశ ఎక్కువ. ఒకరోజు వీరిద్దరూ కలిసి పొలానికి వెళ్లారు. పొలం పని ముగించుకుని వస్తూ ఉండగా మార్గం మధ్యలో వారికి ఒక డబ్బు సంచి దొరికింది. వెంటనే రంగయ్య 'వీరయ్యా! ఇక్కడ ఎవరో డబ్బు సంచని పోగొట్టుకొని వెళ్లారు. మనం వెంటనే వెళ్లి పోలీసులకి చెప్పి, ఆ డబ్బుని వారికి అప్పగించడం మంచిది' అన్నాడు. అది విని వీరయ్య కోపంగా 'నీకు డబ్బు అవసరం లేకపోతే తీసుకోవద్దు. నేను తీసుకుంటాను' అని అన్నాడు. దానికి రంగయ్య 'ఎవరిదో పాపం డబ్బు పోగొట్టుకున్నారు. వారి డబ్బు మనకి ఎందుకు? వారికి అప్పజెప్పడమే మంచిది' అని బాధగా అక్కడ నుండి వెళ్లిపోతాడు. కానీ వీరయ్య మాత్రం రంగయ్య మాట వినలేదు. డబ్బు సంచిని తీసుకుని ఇంటికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత డబ్బును పోగొట్టుకున్న వ్యక్తి ఆ ప్రాంతానికి వచ్చి వెతికాడు. కానీ డబ్బు సంచి కనిపించలేదు. వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, జరిగిన విషయం చెప్పి కంప్లైంట్ ఇచ్చాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి, పోగొట్టుకున్న స్థలం వద్దకు వెళ్లి, మొత్తం వెతికారు. లాభం లేకపోయింది. పక్క గ్రామానికి వెళ్లి, ప్రజలను పంచాయతీ దగ్గరకు పిలిపించి, డబ్బు సంచి గురించి ఆరా తీశారు. కానీ ఎవరూ ఏమీ సమాచారం ఇవ్వలేదు. తర్వాత పోలీసులు అందరి ఇళ్లల్లో శోధించారు. ఆ క్రమంలో వీరయ్య ఇంట్లో డబ్బు సంచి దొరుకుతుంది. వీరయ్యను పోలీసులు తీసుకువెళ్లి, శిక్షించారు.

**నీతి: పరాయి సొమ్ముతో ప్రమాదం పొంచి ఉంటుంది.**



**ఎ. ప్రత్యూష**
**6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పారసాం, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా.**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఏమి జీవితమో అనే నిస్పృహ అభివృద్ధిని ఆటంకపరుస్తుంది. ఆహా ఏమి జీవితం అనుకుంటూ ఆశావాదంతో గడపడమే అభివృద్ధికి మూలాధారం.
* అబ్రహాం లింకన్






కథ

# బంధు ప్రీతి...!

కృష్ణాపురంలో సుధాముడు గురుకుల పాఠశాలను నడిపిస్తున్నాడు. తీరిక సమయాలలో పిల్లలకు నీతి కథలను చెబుతుంటాడు. 'గురువు గారూ!... ఈ రోజు ఎలాంటి కథను చెబుతున్నారు?' అన్నారు పిల్లలు ఎంతో ఆసక్తిగా.

'బంధువులకు సంబంధించిన కథ చెబుతాను వినండి' అన్నాడు సుధాముడు.

పార్వతిపురంలో శివయ్య, చంద్రయ్య, రామయ్య అనే అన్నదమ్ములు ఉండేవారు. వారిలో శివయ్య వ్యాపారం చేస్తూ బాగా సంపాదించాడు. చంద్రయ్య పచారికొట్టు పెట్టి కొద్దిగా సంపాదించాడు. చిన్నవాడు రామయ్యకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది అది సాగుచేసు కుంటున్నాడు. ఆ అన్నదమ్ముల ఇళ్లు కొద్ది దూరంలో ఉండేవి.

బంధువులు వచ్చినప్పుడు ముందుగా శివయ్య ఇంటికి వెళ్లేవారు. శివయ్య అతని భార్య పార్వతి బంధువులను పలుకరించి పిండివంటలతో భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఆ బంధువులు వెళ్లేప్పుడు చీర, పంచెలు పంచి ఇంట్లో నుంచే సాగనంపేవారు.

బంధువులు రెండవరోజు చంద్రయ్య ఇంటికి వెళ్లేవారు. చంద్రయ్య భార్య సుమతి కూడా బంధువులకు చక్కని వంటలు చేసి పెట్టేది. వారు వెళ్లేప్పుడు ఆడవారికి మాత్రమే చీర పెట్టేది సుమతి. వారిని ఇంటి గడప దాటి సాగనంపేవారు.





మూడవ రోజు బంధువులు చిన్నవాడైన రామయ్య దగ్గరకు వెళ్లేవారు. రామయ్య అతని భార్య సీతమ్మ వారిని ఎంతో ఆప్యాయంగా పలుకరించేవారు. సీతమ్మ ఉన్నంతలోనే చక్కని వంటలుచేసి పెట్టేది. 'ఆహా! ఇలాంటి భోజనం తిని ఎన్ని రోజులయ్యిందో' అనేవారు.

బంధువులు వెళతాము అంటే రేపు వెళుదురు గానీ అని ఆపేవారు.

వారి ఆప్యాయతకు ఇంకో రోజు ఉండిపోయేవారు. వారు వెళ్లేప్పుడు సీతమ్మ ఆడవారికి రవికతో పాటు తాంబూలంలో పండ్లు పెట్టి ఇచ్చేది. రామయ్య, సీతమ్మలు గడప దాటి వారిని ఎద్దుల బండిలో కూర్చోబెట్టి వారు బయలుదేరాక బండి కనబడేంత వరకు చేతులు ఊపుతూ బయటనే ఉండి తరువాత ఇంట్లోకి వచ్చేవారు.

'ఇదీ కథ... పిల్లలూ ఇప్పుడు చెప్పండి... ఈ ముగ్గురు అన్నదమ్ములలో బంధుప్రీతి ఎవరికి ఎక్కువగా ఉంది?' అని అడిగాడు సుధాముడు.

'గురువు గారూ!... రామయ్య కుటుంబానిదే అసలైన బంధుప్రీతి. ఉన్నంతలో ప్రేమను పంచారు' అని చెప్పారు పిల్లలు.

'అవును పిల్లలూ మనము ఎంత ప్రేమను పంచితే అంతే ప్రేమను ఇతరుల నుండి పొందుతాము' అని చెప్పాడు సుధాముడు.

యు.విజయశేఖర రెడ్డి,
9959736475

## దారి కనుక్కోండి!

ఇక్కడ కనిపిస్తున్న కుక్కకు దొరకకుండా కనిపించే ఈ గజిబిజి దారి గుండా పిల్లి దిగువకు ఎలా చేరుకుంటుందో ఆ దారి కనుక్కోండి!



## బాలానందం




ఆదివారం నాడు ఆటలన్నీ ఆడేద్దాం
సోమవారం నాడు పాఠాలే చదివేద్దాం
మంగళవారం నాడు మహనీయులను కొలిచేద్దాం
బుధవారం నాడు బహుమతులే గెలిచేద్దాం
గురువారం నాడు గురువులనే పూజిద్దాం
శుక్రవారం నాడు సిరులనే కురిపిద్దాం
శనివారం నాడు చిరునవ్వులే చిందిద్దాం
ఆదివారానికే ఆహ్వానమే పలికేద్దాం

గుండాల నరేంద్రబాబు,
సెల్ : 9493235992

## తేడాలను గుర్తించండి!

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో కొన్ని తేడాలున్నాయి. అవేమిటో గుర్తించండి!



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



బాలల కథ

# బుడత

## అసూయ తెచ్చిన చేటు

విల్లుపురాన్ని వీరబ్రహ్మం పాలించేవాడు. వీరబ్రహ్మానికి ఓ కొడుకు వున్నాడు. అతడిని సమీపంలోని గురుకులంలో చేర్చారు. వీరబ్రహ్మం చాలా అసూయపరుడు. తన కొడుకు వీరప్పకు విద్య వంటబట్టలేదు. గురువు వద్దకు వెళ్లి " ఎలాగైనా నా కొడుక్కి మాత్రమే విద్య వచ్చేలా మిగిలిన వారు విద్యా వంతులు కాకూడదు. అని ఆదేశించాడు.

రాజు మాటకు గురువు ఎదురు చెప్పలేదు. రాజు ఆదేశం శిరసా వహించాడు. ప్రతి రోజూ గు రు కులంలో రాజు కుమారుడు వీరయ్యను మాత్రమే తన వద్దకు పిలుచుకుని విద్య నేర్పేవాడు. . అతనికి ఎంత చెప్పినా బుర్ర గోక్కుని " నాకు ఏమీ అర్థం కాలేదు అని తల అడ్డం తిప్పేవాడు.

గురుకులంలో మిగిలిన విద్యార్థులలో సూరయ్య ఏకసందాగ్రాహి.. " రాజు కుమారుడు తప్ప మిగిలిన విద్యా ర్థులపై వివక్ష చూపడం ఏమిటి?-- అని గురువును ప్రశ్నించాడు. అయినా గురువు రాజ శాసనాన్ని పాటించాడు.

ఈ విషయాన్ని రాజదృష్టికి తీసుకెళ్లాడు. ఇది విన్న రాజు గురుకులానికి వచ్చి " నా కొడుకు మాత్రమే చదవాలి.. మిగిలివారు అసమర్థులు..ఇది రాజ ఆజ్ఞ .. అని చెప్పి మిగిలిన విద్యార్థులను అక్కడి నుండి ఇంటికి తరిమివేశాడు.

గురువుపక్షపాత బుద్ధికి మిగిలిన విద్యార్థులు విస్మయం చెందారు. వారిలో సూరయ్య తనలో దాగిన ప్రతిభతో రోజూ గురుకులం బయట వుండి గురువు బోధించే పాఠాలు విని విద్యావంతు డయ్యాడు. తన తెలివి తేటలతో గాలిలో ఎగిరే విమానాన్ని తయారు చేశాడు. అటవీ ప్రాంతంలో ఆ విమానాన్ని ఎక్కి విహరించసాగాడు సూరయ్య.

అప్పటికే గగనతలంలో విహరిస్తున్న విగంగాన్ని నడపడంలో మంచి నైపుణ్యం సంపాదించాడు.

ఇది వీరబ్రహ్మం చెవిన పడింది. వెంటనే రాజభటుల సాయంతో అతడిని పిలిపించాడు. అతను రూపొందించిన విమానాన్ని తన అనుమతి లేనిదే నడపకూడదని, ఏపని చేయకూడదని, నైపుణ్యం కలిగిన పనులు రాజు, అతని కుమారులు మాత్రమే చేయాలని అప్పుడే ప్రజలకు ఉపయోగపడుతుందని చెప్పి ఆ విమానాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

దాన్ని తయారు చేసింది తన కుమారుడే అని గొప్పలు చెప్పుకో సాగాడు రాజు వీరబ్రహ్మం.

అయితే రాజు తీరు సూరయ్య ఊరి ప్రజలకు నచ్చలేదు. అప్పటికే గిరిజన ప్రాంత ప్రజలను, కొండలు, గుహలు దాటించి ప్రయాణ సాధనంగా వినియోగిస్తున్న ఆ విమాయాన్ని రాజు లాక్కుని తన



కుమారుడు తయారు చేశాడని గొప్పలు చెప్పుకోవడం గిరిజను లకు మింగుడుపడలేదు.

ఓ రోజు వీరబ్రహ్మం స్వయంగా ఓ పర్వతం వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రకృతి అందాలు తిలకిస్తుంటే కుండపోత వర్షం కురిసిం ది. వీరబ్రహ్మం ఏమి చేయాలో దిక్కుతోచడంలేదు. కొం డపై పడిన వర్షానికి బాగా తడిచి ముద్దయ్యాడు. లోయలోని నీళ్లలో చిక్కున్నాడు. ఆ సమయంలో విమానం వుంటే ఎక్కి ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు కదా? అనుకున్నాడు. కాని దాన్ని నడపడం తెలియకపోవడంతో రక్షించుకోలేకపోయాడు. తన స్వార్థంతో ఆ విమా నం నిరుపయోగంగా వుందని తెలుసుకున్నాడు. రెండు రోజులు ఓ కొండ గుహలో దాక్కుని సాయం కోసం అర్థించాడు. అప్పటికే వర్షాలకు పల్లపుప్రాంతం నీటిలో మునిగిపోయి చెట్లు, ఇళ్లపై కూర్చున్న ప్రజలను తను చేసిన మరో విమానంతో మిట్టప్రాంతాలకు తరలించి సాయం చేస్తున్నాడు సూరయ్య.

దారిలో వెళుతుండగా రాజు ఆర్తనాదాలు విని కొండ గుహలోకి దిగి చలికి వణుకుతున్న రాజును రక్షించాడు సూరయ్య.

ఆపద సమయంలో వున్న తనను సూరయ్య ప్రతిభతో చేసిన విమానం సాయంతో రక్షించినందుకు కృతజ్ఞతలు తెలుపుకు న్నాడు. వీరబ్రహ్మం. అసూయకు పోతే చేటు ఎదురవుతుందని గ్రహించాడు. ప్రతిభ తన కొడుకు సొంతం కావాలని స్వార్థంతో మిగిలిన పిల్లలను వెళ్లగొట్టడాన్ని తలుచుకుని పశ్చాత్తాపపడ్డాడు.

ప్రతిభను దాచివుంచాలని ఎన్ని కుయుక్తులు పన్నినా అది దాగదని గ్రహించాడు వీరబ్రహ్మం. అప్పటికే ప్రజాసేవ చేస్తున్న సూరయ్యను అభినందించి తన వద్ద నిరుపయోగంగా వున్న విమానంతో పాటు సూరయ్య సాయంతో మరికొన్నింటిని రూపొందించి దేశ ప్రజలకు విపత్కర సమయాల్లో సేవలు అందించసాగాడు చదువు, ప్రతిభ విలువ గ్రహించిన రాజు వీరబ్రహ్మం.

– బోగా పురుషోత్తం,

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# అత్యాశ



నరసింహపురం గ్రామంలో శరభయ్య అనే అత్యాశాపరుడు ఉండేవాడు. అతడు ఒకసారి తన భార్యతో పొరుగూరుకు నడిచి వెళుతున్నాడు. దారిలో అతనికి ఆకలైంది. అతనికి ఒక పండిన మామిడి చెట్టు కనిపించింది. వెంటనే అతడు ఆ చెట్టు వద్దకు వెళ్లి కిందపడిన మామిడి పండ్లను ఏరుకొని తిన్నాడు. భార్య వద్దన్నా వినకుండా ఆ మామిడి చెట్టును ఎక్కి ఇంకా పండ్లను తెంపసాగాడు. అలా అతడు రెండు సంచుల నిండా మామిడి పండ్లను తెంపాడు. అయినా అతడు ఆ చెట్టును దిగలేదు. అక్కడ కొమ్మ చివరలో అతనికి బాగా పండిన ఒకే ఒక్క పెద్ద మామిడిపండు కనిపించింది.

అతని భార్య “ఏమండీ! ఇప్పటికే మీరు ఈ పండ్ల చెట్టు యజమానిని గానీ, తోటమాలిని గానీ అడగకుండా చాలా పండ్లను తెంపారు. ఇది చాలా తప్పు. ఆ యజమాని/ తోటమాలి వస్తే మిమ్మల్ని దండిస్తారు. ఈ సంచులన్నీ మోయడమే చాలా కష్టం. మీరు త్వరగా దిగి రండి” అని అంది.

శరభయ్య ఆమె మాటలను లక్ష్యపెట్టకుండా “ఆగు.. ఈ ఒక్క పండు తెంపితే నా పని పూర్తి అవుతుంది” అని ఆ ఒకే ఒక్క పెద్ద పండు కోసం వంగి పట్టు తప్పి దభీమని కింద పడ్డాడు. వెంటనే “అమ్మా!” అని గట్టిగా అరిచాడు.

అతని భార్య పరిగెత్తి వచ్చి అతనిని పైకి లేపింది. ఆమె “చూశారా! మీరు నేను చెబితే వినలేదు. ఇప్పుడు ఆ యజమాని గానీ, దాని తోటమాలి గానీ వస్తే ఇది చూసి ఊరుకోరు. మీ అత్యాశే మీ కొంప ముంచింది. మిమ్మల్ని ఇప్పుడు వైద్యుని వద్దకు తీసుకొని వెళ్ళాలి” అని తనకు సాయం కోసం ఆ దారివైపు చూసింది.

ఇంతలో ఒక యువకుడు ఆ దారిలో బండి తోలుతూ ఆమెకు కనిపించాడు. ఆమె అతన్ని పిలిచి సాయం పట్టమంది. అతడు వచ్చాడు.

అతని సాయంతో శరభయ్యను ఆ బండిలో ఒక వైద్యుని వద్దకు తీసుకొని వెళ్ళింది. అతడు గాయాలకు కట్టుకట్టి విశ్రాంతి తీసుకోమని చెప్పాడు.

అప్పుడు ఆమె “చూశారా! మీరు ఆ సంచులలో ఉన్న పండ్లను అమ్మితే వచ్చే ఆ పండ్ల ఖరీదు కన్నా ఇప్పుడు ఈ మందుల ఖర్చు తడిసి మోపెడంత అయింది. మీకు పైసా నష్టం, శరీర కష్టం” అని అంది.

అప్పుడు శరభయ్య “నీవన్నది నిజమే! నీవు చెప్పిన మాట వినకుండా అత్యాశతో ఆ ఒక్క పండు కోసం పాకులాడి నేను గాయాల పాలైనాను. నేను చేసింది చాలా తప్పు పని. అందుకే నాకు తగిన శాస్తి జరిగింది. అదృష్టవశాత్తు ఆ చెట్టు యజమాని కానీ, తోటమాలి కానీ రాలేదు. వారు వస్తే నన్ను ఇంకా కఠినంగా శిక్షించేవారు. ఇక నుండి నేను అత్యాశను వదిలి ఉన్నదానితో తృప్తిగా జీవిస్తాను. పదిమందికి సాయపడతాను. నాకు బుద్ధి వచ్చింది” అని అన్నాడు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

– యజమానికి, నాయకుడికి మాటల్లో తేడా ఉంటుంది. యజమాని ఇక మీరు మీరు వెళ్లవచ్చు అంటాడు; నాయకుడు ఇక మనం వెళదాం.. అంటాడు.

– చక్కగా మాట్లాడదలచుకున్నవారు ముందు చక్కగా వినడం నేర్చుకోవాలి.